
డా॥ కాచం సత్యనారాయణ
M.A,MSW,PGDCJ,LLB
CMD


www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
03-07-2024
సంపుటి : 01 | సంచిక :60 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS

## వచ్చే 15 ఏళ్లు బీఆర్ఎస్‌దే అధికారం

### కాంగ్రెస్ పిచ్చి పిచ్చి పనులే మనకు అధికారం కట్టబెడతాయి

- గతంలో ఎన్టీఆర్ పాలన తర్వాత అలాగే జరిగింది
- రైతుబంధుకు ఎగనామం పెట్టే ఆలోచనలో కాంగ్రెస్
- పార్టీ మారిన ఎమ్మెల్యేలను ప్రజలే ఛీ కొడుతున్నారు
- త్వరలో తెలంగాణలో 160 అసెంబ్లీ స్థానాలు
- మహిళలకు పెద్ద పీఠవేసి అధికారం కట్టబెడతాం
- జడ్పీ ఛైర్మన్ల సమావేశంలో మాజీ సీఎం కేసీఆర్



**విశ్వంభర, మెదక్ :**
తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ ఈ సారి మళ్ళీ అధికారంలోకి వచ్చి మరో 15 ఏళ్ళు అధికారంలో ఉంటుందని బి.ఆర్.ఎస్ అధినేత కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు . కాంగ్రెస్ పార్టీకి ఒక లక్షణం ఉందని, ఒకసారి అధికారంలోకి వస్తే పిచ్చి పిచ్చి పనులన్నీ చేసి ప్రజల చేత ఛీ అనిపించుకునేలా వాళ్ళు ప్రవర్తిస్తారని పేర్కొన్నారు. గతంలో ఎన్టిఆర్ పాలన తర్వాత మళ్ళీ అలాగే జరిగిందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని బిఆర్ఎస్ పార్టీ జడ్పీ ఛైర్మన్లతో మంగళవారం ఎర్రవెల్లిలోని

మిగతా 2 లో



## వినూత్నంగా ఆలోచించండి

### ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

- తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దాలి
- వారానికో రోజు క్షేత్రస్థాయి పర్యటన
- నెలకోసారి జిల్లా అధికారులతో సమీక్ష
- ఐఏఎస్ అధికారులకు సీఎం దిశానిర్దేశం
- త్వరలోనే సీఎం జిల్లాల పర్యటనలు

**విశ్వంభర, హైదరాబాద్:**
దేశంలోనే అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా తెలంగాణను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తమ శాఖల పని తీరును మెరుగుపరిచేందుకు అవసరమైన ప్రక్షాళన చేసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే కొత్త కార్యక్రమాలు, వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. ఒక్కో అధికారి ఒక్కో ఫ్లాగ్ షిప్ ఐడియాను రెండు వారాల్లో ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి

మిగతా 2 లో


> ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పని చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఐఏఎస్ అధికారులందరూ విధిగా తమ పరిధిలోని శాఖలు, విభాగాలపై పట్టు సాధించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రజా పాలనను అందించేందుకు అందరూ బాధ్యతగా పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. అందరూ కలిసికట్టుగా పని చేసి ప్రజలకు సుపరిపాలనను అందించి తీరాలని చెప్పారు.

## రెండు రాష్ట్రాల సమస్యలను పట్టించుకోలే

### కలిస్తే భోజనమే చేసేవారు

జగన్, కేసీఆర్‌లపై కోదండరాం సెటైర్లు

2 లో..



## దీక్ష విరమించిన మోతీలాల్ నాయక్

- కేసీఆర్ దీక్ష చేస్తే రాష్ట్రం వచ్చింది
- నేను దీక్ష చేస్తే ఒక్క ఉద్యోగం కూడా రాలే
- మనుషులు చచ్చిపోతున్నా పట్టించుకోరా
- 50వేల ఉద్యోగాలు ఇచ్చే వరకు పోరాడుతానంటూ ప్రకటన

2 లో..



## మహా విషాదం

### ఉత్తర ప్రదేశ్‌లో భారీ తొక్కిసలాట ఘటనలో 107 మంది మృతి

- మరో 150 మందికి పైగా గాయాలు
- భోలే బాబా సత్సంగ్ శివారాధన కార్యక్రమంలో ఘటన
- మృతుల్లో చిన్నారులు, మహిళలు
- దేశవ్యాప్తంగా 4 లక్షల మంది హాజరు
- విచారణకు యూపీ ప్రభుత్వం ఆదేశం
- మృతులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల పరిహారం
- గాయపడిన వారికి రూ.50వేలు

2 లో..





## టీపీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్ గౌడ్!

- మద్దతు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి
- సీఎం రెడ్డి, డిప్యూటీ సీఎం ఎస్సీ, టీపీసీసీ చీఫ్ బీసీ
- సామాజిక వర్గాలుగా అధిష్ఠానం సమ ప్రాధాన్యం
- నేడో, రేపో అధికారిక ప్రకటన చేయనున్న ఏఐసీసీ
- మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్..
- కేబినెట్‌లో బెర్త్ ఖరారైన ఎమ్మెల్యేలు వీళ్లే..

3 లో..

## 213 మంది ఖైదీలకు క్షమాభిక్ష

- సత్ప్రవర్తన నేపథ్యంలో ముందస్తు విడుదల
- సీఎం రేవంత్‌కి దరఖాస్తు చేసిన ఖైదీల కుటుంబ సభ్యులు

2 లో..





### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర | :రూ.107 |
| రిటైల్ | :రూ. 129 |
| స్కిన్ | :రూ. 187 |
| స్కిన్ లెస్ | :రూ.213 |

## ములుగు జిల్లా పేరులో మార్పు..

3 లో..

- సమ్మక్క సారక్క ములుగు జిల్లాగా మార్పు
- మంత్రి సీతక్క చొరవతో కలెక్టర్ ఆదేశాలు



## అన్నదాతను ఉన్నత స్థాయిలో నిలబెట్టాలి

- వ్యవసాయ శాఖ అండగా ఉందనే నమ్మకాన్ని పెంపొందించాలి
- అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన
- అందరి అభిప్రాయాలకు అనుగుణంగానే రైతు భరోసా అమలు
- భారమైనప్పటికీ రైతుల సంక్షేమానికి రూ. 50 వేల కోట్లు వెచ్చిస్తాం



**విశ్వంభర, హైదరాబాద్:**
ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని, ఆరుగాలం శ్రమిస్తూ దేశానికి అన్నం పెట్టే రైతాంగాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టేందుకు వ్యవసాయ, అనుబంధ శాఖలు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయం, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్‌లో నూతనంగా

మిగతా 3 లో



# వచ్చే 15 ఏళ్లు బీఆర్ఎస్‌దే అధికారం

(మొదటిపేజీ తరువాయి)
వ్యవసాయ క్షేత్రంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో జడ్పీ చైర్మన్లు అందరూ రాష్ట్రం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని, విజయవంతంగా పదవీ కాలాన్ని పూర్తి చేసినందుకు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు . భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజా జీవితంలో ఒకసారి నిలిచిన తర్వాత అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల కోసం పని చేసేటోళ్లే నిజమైన రాజకీయ నాయకులని అన్నారు. పదేళ్ల బి ఆర్ ఎస్ పాలనలో అన్నీ సవ్యంగా నడిచాయని పేర్కొంటూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరెంటు, తాగు నీటి ఇబ్బందులతో పాటు శాంతి భద్రతల సమస్య తలెత్తి మతకల్లోలాలు కూడా చెలరేగడం బాధ కలిగిస్తున్నదని అన్నారు. అప్పుడు ఉన్న అధికారులే ఇప్పుడు ఉన్నప్పుడు శాంతి భద్రతల సమస్య ఎందుకు వస్తున్నదో ఆలోచించాలన్నారు .

### రైతు బంధుకు ఎగనామం పెట్టేలా ప్రభుత్వం చర్యలు

గతంలో ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధిని పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూపించిందని పేర్కొన్నారు. పార్టీ నాయకులను సృష్టిస్తుంది కాని నాయకులు పార్టీని సృష్టించరని , మంచి యువనాయకత్వాన్ని తయారు చేస్తామని పేర్కొన్నారు. అత్యున్నత పదవులు అనుభవించి పార్టీని వీడుతున్న వారిని నాలుగు రోజులు పదవులు లేకపోతే ఉండలేరా? అని ప్రజలే అసహించు కుంటున్నారని అన్నారు . రాజకీయాల్లో ఉన్న వాళ్లకు సౌజన్యం , గాంభీర్యం ఉండాలని అలా కాకుండా కొందరు కేసీఆర్ ఆనవాళ్లను చెడిపేస్తామంటున్నారని కేసీఆర్ తెలంగాణ తెచ్చిండు కాబట్టి మరి దాన్నే చెడిపేస్తరా అని ప్రశ్నించారు .తాము అధికారంలోకి వచ్చినంక గతంలో వై ఎస్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ , ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను పేర్లు మార్చకుండా ఇంకా బాగా అమలు చేశామని గుర్తు చేశారు . తెలంగాణ వచ్చే నాటికి చెట్టుకొకడు పుట్టకొకడు అయ్యిండనే బాధతో వ్యవసాయాన్ని స్థిరీకరణ చెయ్యాలని రైతుబంధు పథకాన్ని అద్భుతంగా రైతులందరికి అందించామన్నారు. ఇప్పుడు ఉన్న ప్రభుత్వం రకరకాల కారణాలతో అసలు ఆ పథకానికే ఎగనామం పెట్టె ప్రయత్నం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఏడాది పొడవునా పంటలను సాగు చేస్తూనే ఉంటారని సాగు లెక్కలు ఇతరత్రా కారణాలు చూపుతూ రైతుబంధు ను అమలు చేస్తే అవినీతి మొదలైతదని అన్నారు.

### తెలంగాణ పునర్నిర్మాణం ఇంకా జరగాల్సి ఉంది

మళ్ళీ బిఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని కొంచెం సమన్వయంతో ఓపిక పట్టాలని అన్నారు. మరో రెండేళ్లలో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందని తెలంగాణలో నియోజకవర్గాల సంఖ్య 160 వరకు పెరగొచ్చని అన్నారు. మహిళలకు కూడా ఎక్కువ అవకాశాలు వస్తాయన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం ఇంకా జరగాల్సి ఉన్నదని ఈ సారి బి ఆర్ ఎస్ తరపున ఎవరికి బీ ఫామ్ దక్కితే వాళ్లదే విజయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కొంచెం కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు . పార్టీ అన్ని స్థాయిల్లోని కమిటీల ఏర్పాటు ప్రక్రియను త్వరలో పూర్తి చేస్తామన్నారు . సోషల్ మీడియాను కూడా పటిష్టంగా తయారు చేస్తామన్నారు. బంగ్లాదేశ్ లో హష్మీ అనే ఒక ప్రొఫెసర్ పేద మహిళల కోసం 71 వేల పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి వారిని ఆదుకున్న విధానం గురించి, జీరో పొల్యూషన్ నగరాల్లో అక్కడి మేయర్లు ప్రజల్లో మమేకమైన విధానం గురించి కేసీఆర్ వివరించారు .

### జడ్పీ చైర్మన్లను ఘనంగా సన్మానించిన కేసీఆర్

తెలంగాణ రాష్ట్రంలోని బిఆర్ఎస్ జడ్పీ చైర్మన్లను బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లి లోని వారి నివాసంలోశాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కుటుంబ సభ్యులతో సహా ఈ సమావేశానికి ఆహ్వానించడంతో జడ్పీ చైర్మన్లు వారి కుటుంబ సభ్యులు కేసీఆర్ గారితో కలిసి ఫోటోలు దిగారు . ఈ సందర్భంగా కేసీఆర్ జడ్పీ చైర్మన్లను పేరు పేరునా పలకరించారు. ఆయా జిల్లాల్లో జరిగిన అభివృద్ధిలో భాగం పంచుకుని మంచిగ పని చేసినందుకు వారిని అభినందించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్ జడ్పీ చైర్మన్లు కుటుంబ సభ్యులతో వారి యోగ క్షేమాలను చర్చిస్తూ ఎక్కువ సేపు గడిపారు. ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించారు. భోజన సమయంలో అందరి తోనూ ఆత్మీయంగా సంభాషిస్తూ కనిపించారు. సమావేశం అనంతరం కేటీఆర్ జడ్పీ చైర్మన్లం దరికీ యాదాద్రి ప్రసాదంతో పాటు జ్ఞాపికలను అందజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి పార్టీ అధినేత కేసీఆర్ ను కలవడం సంతోషంగా ఉందని జడ్పీ చైర్మన్లు, వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. జడ్పీ చైర్మన్ల ఆత్మీ య సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జి.జగదీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్ రెడ్డి, బాల్క సుమన్, గండ్ర వెంకట రమణారెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహా విషాదం

## ఉత్తర ప్రదేశ్‌లో భారీ తొక్కిసలాట ఘటనలో 107 మంది మృతి

**విశ్వంభర, ఉత్తరప్రదేశ్:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని హాత్రస్ లో పెను విషాదం చోటుచేసుకుంది. ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భారీ తొక్కిసలాట వంద మందికి పైగా ప్రాణాలు తీసింది. ఇంకా వందలాది మంది గాయాల పాలయ్యారు. హత్రాస్ జిల్లా సికందరరావు పోలీస్ స్టేషన్ పరిధిలోని రతిభాన్‌పుర్‌లో భోలే బాబా సత్సంగ్ శివారాధన కార్యక్రమ సమయంలో ఈ తొక్కిసలాట జరిగింది. ఈ కార్యక్రమంలో పవిత్ర జలం పేరుతో భక్తులకు నీళ్లు ప్రసాదం ఇస్తారు.. ఈ జలం స్వీకరిస్తే సర్వరోగాలు పోయాయని నమ్మకం.. దీంతో దేశం నలుమూలల నుంచి దాదాపు 4లక్షల మంది వరకూ హాత్రాస్ చేరుకున్నారు. ఈ ఘటనలో వందలాది మంది గాయపడ్డారు. వారిలో మహిళలు చిన్నారులు ఉన్నారు. క్షతగాత్రులను హుటాహుటిన దగ్గర్లోని ఎటా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ఘటనపై ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

### ఒక్కసారిగా తొలగించడంతో..

స్థానిక ఆధ్యాత్మిక గురువు సంస్మరణార్థం ఏడాదికి ఒకసారి మాత్రమే జరిగే ఈ కార్యక్రమానికి.. నిర్వాహకులు భోలే బాబా సత్సంగ్ పేరుతో భారీగా ప్రచారం నిర్వహించారు. దీంతో ఉత్తరప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. 50 వేలమందికి పైగా వచ్చిన భక్తులను.. రాత్రి 11 గంటల నుంచి బారికేడ్లు అడ్డుపెట్టి.. రోడ్లపై నిర్బంధించారు. ఉదయం ఒక్కసారిగా వాటిని తొలగించడంతో భక్తులు దూసుకువచ్చారు. దీంతో భారీ తొక్కిసలాట జరిగింది.

### చిన్నారులు, మహిళలే..

ఈ తొక్కిసలాటలో పదుల సంఖ్యలో మహిళలు, చిన్నారులు బలైపోయారు. గాయపడ్డవారిని ఎటా మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మృతదేహాలను స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అయితే మృతదేహాలను ఉంచేందుకు అక్కడ సరిపడ స్థలం లేకపోవడంతో కమ్యూనిటీ హాల్ నేలపైన, ఆవరణలో లైన్‌గా పరిచారు అధికారులు.. కమ్యూనిటీ హాల్‌లో తమవారి మృతదేహాలను చూసి బంధువులు, కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. వారి ఆర్తనాదాలతో ఈ ప్రాంతమంతా విషాదం అలముకుంది.

### కొనసాగుతున్న దర్యాప్తు

ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. భక్తులు ఒక్కసారిగా పరుగులు తీయడం వల్లే తొక్కిసలాట జరిగిందని పోలీసులు చెబుతున్నారు. అయితే వారు ఎందుకు పరుగులు తీశారన్నదానిపై దర్యాప్తు కొనసాగుతోంది. హత్రాస్ ఘటనపై ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

### ప్రధాని తీవ్ర దిగ్భ్రాంతి

మరోవైపు ఈ విషాదంపై ప్రధాని మోదీ, యూ పీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై విచారణ కు ఆదేశించిన సీఎం యోగిఆధిత్యనాథ్ ..బా ధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షలు, గాయప డ్డ వారికి రూ. 50వేలు ప్రకటించారు.

# వినూత్నంగా ఆలోచించండి

(మొదటిపేజీ తరువాయి)
ఇప్పటివరకు పలువురు ముఖ్యమంత్రులతో పని చేసిన అనుభవమున్న అధికారులు ఇప్పటికీ కీలక విభాగాల్లో ఉన్నారని, ఎప్పటికప్పుడు ఆ ప్రభుత్వ ప్రాధాన్యాతలను గుర్తించి అధికారులు తమ పనితీరును చాటుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు మేలు జరిగే పనులు చేయాలనే సంకల్పంతో విధులు నిర్వహించాలని, ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేయాలని కోరారు. సచివాలయంలో మంగళవారం అన్ని విభాగాల కార్యదర్శులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సమావేమయ్యారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి ఈ సమీక్షలో పాల్గొన్నారు. మెత్తం 29 విభాగాలకు చెందిన ఐఏఎస్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అధికారులందరూ ఏకతాటిపై పని చేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అన్నారు. సచివాలయం నుంచి క్షేత్రస్థాయి వరకు అందరూ తమ విభాగాల పై పట్టు సాధించాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల్లో అయిదు గ్యారంటీలను అమలు చేసిందని సీఎం చెప్పారు. తర్వాత వంద రోజులు ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వ కార్యక్రమాలు, పనులు నిలిచిపోయాయని, ఇకపై అధికారులు విధిగా పరిపాలనపైనే దృష్టి సారించాలని ఆదేశించారు. దేశంలోనే అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా తెలంగాణను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని అన్నారు. తమ శాఖల పని తీరును మెరుగుపరిచేందుకు అవసరమైతే అధికారులు, సిబ్బంది ప్రక్షాళన చేసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రజలకు ఉపయోగపడే కొత్త కార్యక్రమాలు, వినూత్న ఆలోచనలను ఎప్పటికప్పుడు నేరుగా సీఎంవోతో పంచుకోవాలని సూచించారు. ఒక్కో అధికారి ఒక్కో ఫ్లాగ్ షిప్ ఐడియాను రెండు వారాల్లో ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. ప్రజలకు సుపరిపాలనను అందించేందుకు అధికారులు క్రమశిక్షణ పాటించాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించి ప్రజా ప్రయోజనాలకు ప్రాదాన్యమివ్వాలని సీఎం చెప్పారు. వేళాపాళలను తప్పనిసరిగా పాటించాలని, ప్రతి రోజు టైమ్ ప్రకారం సెక్రేటేరియట్లో అందుబాటులో ఉండాలని కోరారు. కేవలం ఆఫీసులకు పరిమితం కాకుండా తమ విభాగం పనితీరును పర్యవేక్షించేందుకు వారానికి ఒక రోజు విధిగా జిల్లాలకు క్షేత్ర పర్యటనకు వెళ్లాలని ఆదేశించారు. నెలకోసారి అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసుకోవాలని, సంబంధిత విభాగం చేపట్టిన కార్యక్రమాలు, జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకోవాలని సూచించారు. చాలా జిల్లాల్లో కలెక్టర్లు ఆఫీసులు దాటడం లేదని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐఏఎస్ అధికారులు ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని, తమ అనుభవంతో సుపరిపాలన విధానాలు అమలు చేయాలని సూచించారు. విధిగా కలెక్టర్లు కూడా క్షేత్ర పర్యటనకు వెళ్లేలా చూడాలని ముఖ్యమంత్రి సీఎస్ను ఆదేశించారు. ఆసుపత్రులు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ సేవలందించే అన్ని విభాగాలను అప్పుడప్పుడు విజిట్ చేయాలని చెప్పారు. ప్రజల సమస్యలు, ఇబ్బందులు, అనూహ్యంగా జరిగే సంఘటనలు, దుర్ఘటనలన్నింటా అధికారులు సత్వరమే స్పందించాలని కోరారు. అన్ని శాఖల్లో మెరుగైన విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని సీఎం గుర్తు చేశారు. వ్యక్తుల ఇష్టాయిష్టాలతో తమ ప్రభుత్వానికి సంబంధం లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. వ్యక్తిగతంగా అధికారులపై



రాగద్వేషాలేమీ లేవని, కేవలం పని తీరు ఆధారంగానే అధికారులకు తదుపరి ఉన్నత అవకాశాలుంటాయని, బాగా పని చేసే వారికి ప్రోత్సాహకాలుంటాయని సీఎం అధికారులకు భరోసా ఇచ్చారు. లేనిపోని సొంత నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దని, ముఖ్యమంత్రి కార్యాలయం ఇచ్చే సలహాలు సూచనలు పాటించాలని చెప్పారు. త్వరలోనే వారానికో జిల్లా పర్యటనకు వెళుతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులతో పాటు క్షేత్ర స్థాయిలో వివిధ కార్యక్రమాల అమలు తీరును స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. అక్కడి ప్రజలను కలుసుకునేలా తన పర్యటన ఉంటుందని అధికారులను అప్రమత్తం చేశారు. త్వరలోనే తన జిల్లా పర్యటనల షెడ్యూలు విడుదల చేస్తామని చెప్పారు.

### ఖమ్మం రైతు ఆత్మహత్యపై రేవంత్ సీరియస్

ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరులో విషాదం చోటు చేసుకుంది. తన భూమి కబ్జాకు గురైందని రైతు ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్నాడు.. అధికారులు పట్టించుకోలేదని సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశాడు ప్రభాకర్. తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు. ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన భోజడ్ల వీరభద్ర, భోజడ్ల ప్రభాకర్‌రావుకి దాదాపు ఏడెకరాల భూమి ఉంది. సర్వేనెంబర్ 276, 277లో ఉన్న భూమి విషయంలోనే ఇప్పుడు వివాదం నెలకొంది. ఇందులో కొంత భూమిని ఇదే గ్రామానికి చెందిన నాయకులు, చెరువు సొసైటీ సభ్యులు కబ్జా చేశారనేది ఈ రైతు ప్రభాకర్ ఆవేదన. పొలంలో పొక్లెయిన్, జేసీబీలతో గుంతలు తీసి మట్టిని కూడా తరలించేస్తున్నారంటూ కన్నీరు పెట్టారు. తన ఆవేదన మొత్తాన్ని సెల్ఫీ వీడియోగా తీసి.. తనకు చావే గతి అంటూ పురుగుల మందు తాగడం సంచలనంగా మారింది. తన సమస్యను అనేకమార్లు రెవిన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు అర్జీ ఇవ్వడానికి వస్తే అదీ కుదరలేదని ఆవేదన వ్యక్తం చేశారు రైతు ప్రభాకర్. తనకు మరో మార్గం లేదనే ఉద్దేశంతోనే పురుగుల మందు తాగినట్టు సెల్ఫీ వీడియోలో చెప్పారు. ఏడు ఎకరాల భూమిలో మూడు ఎకరాలు సర్వనాశనం అయిందని.. ఈ వీడియో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చేరాలని.. తన కుటుంబాన్ని ఆదుకోవాలంటూ రైతు వీడియోలో చెప్పడం చూపరులను కంటతడి పెట్టిస్తున్నది. ఖమ్మంజిల్లాలో రైతు ఆత్మహత్యపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. కారకులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం ఆదేశించారు. దీనిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం విచారణకు ఆదేశించారు. నివేదిక అందించాలని అధికారులను కోరారు. రైతులు ఆత్మహత్య చేసుకోద్దంటూ సూచించారు.

### ఏపీ సీఎం లేఖపై రేవంత్ సానుకూల స్పందన

విభజన సమస్యలు పరిష్కరించుకుందామంటూ ఏపీ సీఎం చంద్రబాబు రాసిన లేఖకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. చర్చకు సిద్ధమంటూ చంద్రబాబుకు తిరిగి లేఖ రాయనున్నారు. ఈ నేపథ్యంలో ఇరువురు ముఖ్యమంత్రులు ఈ నెల 6న హైదరబాద్‌లో భేటీ అయ్యే అవకాశం ఉన్నది. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్ర బాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం లేఖ రాసిన విషయం తెలిసిందే. రాష్ట్ర విభజన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకుందామని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేండ్లయినా రెండు రాష్ట్రాల మధ్య కొన్ని సమస్యలు అపరిష్కృతంగా మిగిలాయని తెలిపారు. విభజన హామీల పరిష్కారం ద్వారా.. పరస్పర సహకారం, తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ నెల 6న హైదరాబాద్‌లో ముఖాముఖి సమావేశమై చర్చించుకుందామని ప్రతిపాదించారు. ఇరు రాష్ట్రాల మధ్య సామరస్యం, పరస్ప ర సహకారం ఉంటేనే ప్రభుత్వాల లక్ష్యాలు నెరవేరి అభివృ ద్ధి సాధించగలుగుతామని పేర్కొన్నారు.

### వైఎస్సార్ జయంతి కార్యక్రమానికి రావాలంటూ షర్మిల ఆహ్వానం

కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ నెల 8న వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమానికి హాజరు కావాలని ఆమె ఆహ్వానించారు. ఈ సందర్భంగా షర్మిలకు సీఎం శాలువా కప్పి సత్కరించారు. పుష్పగుచ్ఛం అందించారు. షర్మిల ఆ తర్వాత, ప్రజాభవన్‌లో తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలిశారు. ఆయనను కూడా జయంతి కార్యక్రమానికి ఆహ్వానించారు. జులై 8న విజయవాడలో వైఎస్సార్ 75వ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు షర్మిల తెలిపారు. ఈ వేడుకలకు ఆమె పలువురు తెలంగాణ కాంగ్రెస్ నేతలను ఆహ్వానిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కూడా ఆహ్వానించారు.


# రెండు రాష్ట్రాల సమస్యలను పట్టించుకోలే

- కలిస్తే భోజనమే చేసేవారు
- జగన్, కేసీఆర్‌లపై కోదండరాం సెటైర్లు

**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్ర విభజన అంశాలపై చర్చించేందుకు ముఖాముఖీ భేటీ అవుదామంటూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాసిన విషయం తెలిసిందే. చంద్రబాబు లేఖకు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. దీంతో హైదరాబాద్లోని ప్రజా భవన్లో ఈ నెల 6వ తేదీన చంద్రబాబు, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రుల హోదాలో తొలిసారి భేటీ కాబోతున్నారు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీపై టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పదేండ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న రాష్ట్ర విభజన అంశాలపై చర్చించేందుకు చంద్రబాబు, రేవంత్ రెడ్డి భేటీ కావడాన్ని స్వాగతించారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కుర్చొని చర్చించడం వలన విభజన సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖాముఖీ మాట్లాడుకుంటే పదేళ్ల సమస్యలు సాల్వ్ అవుతాయన్నారు. గతంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్, కేసీఆర్ కూర్చొని కలిసి భోజనం చేశారు కానీ రాష్ట్ర విభజన అంశాలు, ప్రజా సమస్యలపై చర్చించలేదని సెటైర్ వేశారు.

# 213 మంది ఖైదీలకు క్షమాభిక్ష

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం 213 మంది ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించింది. దీర్ఘకాలంగా జైళ్లలో మగ్గుతున్న తమ కుటుంబ సభ్యులను విడుదల చేయాలంటూ ఖైదీల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజా పాలనలో దరఖాస్తులు అందజేశారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ఆధారంగా ఖైదీల ముందస్తు విడుదలకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆదేశిం చారు. దరఖాస్తులను పరిశీలించిన సీనియర్ అధికారు లు, అర్హులైన వారి వివరాలను హైలెవల్ కమిటీ ముందుంచారు. హైలెవల్ కమిటీ విడుదలకు అర్హులైన ఖైదీల జాబితాను క్యాబినెట్ ముందు ఉంచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని క్యాబినెట్ ఖైదీల విడుదలకు ఆమోదముద్ర వేసింది. అనంతరం ఆ జాబితాకు గవర్నర్ ఆమోద ముద్ర వేయడంతో ఖైదీల ముందస్తు విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం చర్లపల్లి జైలు నుంచి 213 మంది ఖైదీలు బుధవారం విడుదల కానున్నారు. వీరిలో 205 మంది యావజ్జీవ శిక్ష పడిన వారు, ఎనిమిది మంది తక్కువ కాలం శిక్షపడిన వారు. వీరందరికి జైలులో వివిధ వృత్తులకు సంబంధించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణలు


GOVERNMENT OF TELANGANA
ABSTRACT
Home Dept. - Prisons - Grant of Special remission to life and Non-life convicted prisoners - Recommendation of the Scrutiny Committee - Approved - Remission to (213) Life and Non-life Convicted Prisoners - Granted - Orders - Issued.

HOME (SERVICES-V) DEPARTMENT
G.O.Ms.No. 37 Dated: 02.07.2024
Read the following:-
1. From the Director General of Prisons and Correctional Services Lr.RC3/913/2023, dated: 19.12.2023
2. G.O.Ms.No. 2 Home (Ser.V)Dept., dated: 24/01/2024.
3. Memo No.13600/Ser.V/2023 Home (Ser.V) Dept, Dt: 01.07.2024.
4. From the Director General of Prisons and Correctional Services Lr.RC3/913/2023, dated: 02.07.2024

ORDER:

ఇచ్చారు. మెరుగైన ప్రవర్తన ద్వారా సమాజంలో తిరిగి కలిసిపోవడానికి వారందరికీ కౌన్సెలింగ్ ఇప్పించారు.

# దీక్ష విరమించిన మోతీలాల్ నాయక్

- కేసీఆర్ దీక్ష చేస్తే రాష్ట్రం వచ్చింది
- నేను దీక్ష చేస్తే ఒక్క ఉద్యోగం కూడా రాలే
- మనుషులు చచ్చిపోతున్నా పట్టించుకోరా
- 50వేల ఉద్యోగాలు ఇచ్చే వరకు పోరాడుతానంటూ ప్రకటన

**విశ్వంభర, హైదరాబాద్ :** నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్ నాయక్ దీక్ష విరమించారు. తొమ్మి దిరోజులుగా గాంధీ దవాఖానలో దీక్ష చేస్తున్న ఆయన కొబ్బ రినీళ్లు తాగి దీక్ష విరమించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నిరుద్యోగుల డిమాండ్ల కోసం గత తొమ్మిది రోజులుగా దీక్ష చేస్తున్నానని చెప్పారు. కేసీఆర్ 9 రోజులు దీక్ష చేస్తే రాష్ట్రం వచ్చింది కానీ.. తాను దీక్ష చేస్తే ఒక్క ఉద్యోగం కూడా పెరుగలేదన్నారు. ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందిం చలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### 50వేల ఉద్యోగాలు ఇవ్వాలి..

'ఇన్నిరోజులు అన్నపానియాలు లేకుండా ఆమరణ దీక్ష చేశా. తన ఆరోగ్యం సరిగ్గా లేదని, క్రియాటిన్ లెవల్స్ పెరిగి కిడ్నీ, లివర్లు పాడయ్యే పరిస్థితికి వచ్చింది. తెలంగాణ వచ్చిన తర్వాత నీళ్లు, కరెంటు వచ్చినయ్. 25 నుంచి 35 ఏండ్ల వయస్సు యువత ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. కొత్త ప్రభుత్వం రాగానే తమ డిమాండ్లు పరిష్కరిస్తామని చెప్పారు. కానీ ఆ దిశగా అడుగులు మాత్రం పడలే. ఈ ప్రభుత్వానికి రాజకీయాలపై ఉన్న దృష్టి విద్యార్థు లు, నిరుద్యోగులపై లేదు. ఉస్మానియా యూనివర్సిటీలో దీక్ష చేస్తానంటే సర్కారు ఒప్పుకోలేదు. మనుషులు చచ్చిపోయినా పట్టించుకో కపోవడం ప్రజాపాలనా?. నా ఫోన్ లాక్కుని ఎవరి తోనూ మాట్లాడనీయడం లేదు. డీఎస్సీ రద్దు చేసి.. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలి. రేపటి నుంచి మా సత్తా ఏంటో చూపిస్తాం. 50 వేల ఉద్యోగాలు ఇచ్చే వరకు ఉద్యమాన్ని తీవ్రం చేస్తాం. ప్రభుత్వం జీవోలను విడుదల చేసే వరకు ఉద్యమిస్తాం. అన్ని పార్టీల వారినీ కలుపుకుని పోతాం. నాకు మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నాయకులందరికీ కృతజ్ఞతలు.



# ఫొటో జర్నలిస్టులకు ఘన సత్కారం

బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో మంగళవారం జరిగింది. ఇటీవలే తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ గా నియమితులైన కె. శ్రీనివాస్ రెడ్డి, సాక్షి ఫోటో ఎడిటర్ గా ఉద్యోగ విరమణ చేసిన కె. రవికాంత్ రెడ్డికి వీడ్కోలు పలుకుతూ ఘనంగా సత్కరించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కె. విరహత్ అలీ, రాష్ట్ర కార్యదర్శులుగా వరకల యాదగిరి, కోశాధికారిగా ఏం. వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కె. అనిల్ కుమార్, ఏ. రాజేష్, సయ్యిద్ గౌస్ మొహియుద్దీన్ లు ఎన్నికైన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అనుమల్ల గంగాధర్, కె.ఎన్. హరి తదితరులు శాలువాలు, మెమొంటో, పూలమాలలతో ఘనంగా ఆత్మీయ సత్కారం చేశారు. - విశ్వంభర, హైదరాబాద్

# ములుగు జిల్లా పేరులో మార్పు..

## సమ్మక్క, సారక్క ములుగు జిల్లాగా మార్పు
## మంత్రి సీతక్క చొరవతో కలెక్టర్ ఆదేశాలు

**విశ్వంభర, ములుగు:** ములుగు జిల్లా పేరు మార్పుకు కసరత్తు మొదలైంది. ఆ జిల్లాను సమ్మక్క సారక్క ములుగు జిల్లాగా పేరు మారుస్తూ జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. అభ్యంతరాల స్వీకరణకు బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. జిల్లాల విభజన సమయంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి అనేక పోరాటాల ఫలితంగా ములుగు జిల్లా ఏర్పడింది. 9 మండలాలతో కూడిన ఈ అడవుల జిల్లా ఓ చారిత్రక జిల్లాగా ఏర్పడింది. ఆరంభం నుండి ఈ జిల్లాను సమ్మక్క సారక్క ములుగు జిల్లాగా ఏర్పాటు చేయాలని అనేక వినతులు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. కానీ పేరు మార్పు ప్రతిపాదన ఆచరణకు నోచుకోలేదు. తాజాగా ములుగు నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి సీతక్క ఒక అడుగు ముందుకు వేశారు. ములుగును సమ్మక్క సారక్క ములుగు జిల్లాగా పేరు మార్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. మంత్రి చొరవ ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ దినకర్ పేరు మార్పుకు చర్యలు మొదలు పెట్టారు. సమ్మక్క సారక్క ములుగు జిల్లాగా పేరు మారుస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 3వ తేదీ బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే గ్రామ సభలలో వారి అభ్యంతరాలు, సూచనలు తెలియపర్చవచ్చని సూచించారు. హిందీ, ఇంగ్లీష్ తెలుగు మూడు భాషలలో వారి అభ్యంతరాలు తెలియపరచాలి సూచించారు. గ్రామసభ అనంతరం ఈ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారు. గెజిట్‌లో ములుగుకు జిల్లా సమ్మక్క సారక్క ములుగు జిల్లాగా ఆమోదముద్ర లభిస్తుంది. మేడారం సమ్మక్క సారక్క దేవతలు కొలువుదిరిన ఈ జిల్లాలో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. పర్యాటక కేంద్రంగా కూడా విరాజిల్లుతుంది. యూనెస్కో గుర్తింపుపొందిన రామప్ప దేవాలయం కూడా ఈ జిల్లాలోనే ఉంది. సమ్మక్క సారక్క దేవతల పేరు చెప్పగానే ములుగు జిల్లా గుర్తుకొస్తుంది. కాబట్టి సమ్మక్క సారక్క ములుగు జిల్లాగా ఈ జిల్లా పేరును మార్చాలని స్థానిక ప్రజలు అనేకమార్లు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక మంత్రి సీతక్క చొరవతో ఎట్టకేలకు ఆ కల నెరవేరబోతుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# అన్నదాతను ఉన్నత స్థాయిలో నిలబెట్టాలి

(మొదటిపేజీ తరువాయి)
నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ కాంప్లెక్స్ భవన సముదాయాన్ని రాష్ట్ర వ్యవసాయం, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజేందర్ నగర్ శాసన సభ్యులు ప్రకాష్ గౌడ్, జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం మంత్రి వ్యవసాయ, ఉద్యానవన, ఇతర అనుబంధ శాఖల అధికారులతో సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశానికి, రాష్ట్రానికే కాకుండా యావత్ సమాజానికి ప్రధాన వనరుగా ఉన్న వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయాలతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే రానున్న రెండు మూడు నెలల వ్యవధిలోనే రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా కార్యక్రమాల ద్వారా రైతాంగ సంక్షేమానికి ప్రభుత్వం సుమారు రూ. 50 వేల కోట్ల పైచిలుకు నిధులను వెచ్చించనుందని వెల్లడించారు. ప్రభుత్వ ఖజానాపై ఎనలేని భారం పడుతున్నప్పటికీ, రైతుల శ్రేయస్సే పరమావధిగా ప్రభుత్వం సాగు రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. రైతు నేస్తం కార్యక్రమాల ద్వారా అన్నదాతల అభిప్రాయాలతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారుల సలహాలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు, అన్ని వర్గాల ప్రజల సూచనలను క్రోడీకరించి వారి మనోభావా లకు అనుగుణమైన నిర్ణయాలతో రైతు భరోసాను అమలు చేస్తామని, ఈ విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని మంత్రి స్పష్టం



చేశారు. ఒక్క రైతు రుణమాఫీ ద్వారానే రూ.31వేల కోట్ల మేరకు రైతాంగానికి ప్రయోజనం చేకూర్చనున్నామని, పాత పద్ధతి ప్రకారమే రుణమాఫీ అమలు జరుగుతుందని వెల్లడించారు. ఈ ఏడాది నుండే రైతు బీమాను సైతం అమలు చేయాలని ప్రభుత్వం పట్టుదలతో ఉందని అన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రైతాంగ ప్రయోజనాలే పరమావధిగా చిత్తశుద్ధితో కృషి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హితవు పలికారు. వివిధ కారణాల వల్ల సాగు రంగంలో నెలకొన్న స్తబ్దతను దూరం చేస్తూ, వ్యవసాయ శాఖ అన్ని విధాలుగా తమకు అండగా నిలుస్తుందనే నమ్మకాన్ని రైతుల్లో పెంపొందించాలని సూచించారు. అధికారులు తమ అనుభవాన్ని, విషయ పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయి-ిలో ప్రతి రైతు వరకు చేరుస్తూ, వారి కష్టనష్టాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భూమి సారాన్ని బట్టి ఏ రకమైన పంటలు వేయాలి, మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా ఏ పంట సాగు చేస్తే లాభాలు వస్తాయి, నూతన వంగడాలు, అధునాతన పద్ధతుల గురించి రైతాంగాన్ని చైతన్యపరచాలని అన్నారు. అప్పుడే వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తేగలుగుతామని, అన్నదాతను ఆర్థికంగా అభివృద్ధి చేయగలుగుతామని తెలిపారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ, ఆయిల్ పామ్ సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని అధిగమించేలా అంకితభావంతో కృషి చేయాలని అన్నారు. ఒక్కో రైతు వారీగా, వ్యవసాయ క్షేత్రాల సర్వే నెంబర్ ప్రకారంగా భూసార పరీక్షలు నిర్వహిస్తూ, వాటి ఫలితాలను రైతులకు అందజేయాలని సూచించారు. నేల స్వభావాన్ని బట్టి తగిన పంటలు సాగుచేసేలా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని మంత్రి అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా నకిలీ, నాసిరకం ఎరువులు, విత్తనాలకు ఆస్కారం లేకుండా పర్యవేక్షణ చేయాలని, రైతుల అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతాంగ ప్రయోజనాల కోసం కృషి చేసే అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం ఎల్లవేళలా తోడ్పాటుగా నిలుస్తుందని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని మంత్రి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, జాయింట్ సెక్రటరీ ఉదయ్ కుమార్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఉద్యానవన శాఖ డైరెక్టర్ యస్మిన్ బాష, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, నిఖిల, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ రఘురాం, ఎమ్.డి ఆఫ్ మార్కఫెడ్ సత్యనారాయణ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# టీపీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్ గౌడ్!

- సీఎం రేవంత్ రెడ్డి మద్దతు
- సీఎం రెడ్డి, డిప్యూటీ సీఎం ఎస్సీ, టీపీసీసీ చీఫ్ బీసీ
- సామాజిక వర్గాలుగా అధిష్ఠానం సమ ప్రాధాన్యం
- నేడో, రేపో అధికారిక ప్రకటన చేయనున్న ఏఐసీసీ
- మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్..
- కేబినెట్‌లో బెర్త్ ఖరారైన ఎమ్మెల్యేలు వీళ్లే..

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఎవరు నియమిస్తారు అనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. పీసీసీ చీఫ్ పదవిపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. తెలంగాణ సీఎం పదవి రెడ్డి సామాజిక వర్గానికి, డిప్యూటీ సీఎంగా ఎస్సీకి అవకాశం కల్పించారు. దీంతో పీసీసీ అధ్యక్ష పదవిని బీసీకి ఇవ్వాలని హస్తం పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### పోటీలో ఉన్నది వీళ్లే..

తెలంగాణ బీసీల్లో బలమైన సామాజిక వర్గాల్లో ఒకటి గౌడ సామాజిక వర్గం. దీంతో ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తే ఎలా ఉంటుందని అధిష్ఠానం ఆలోచన చేస్తోంది. ఈ క్రమంలోనే మంగళవారం మహేశ్‌కుమార్‌గౌడ్ ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. దీంతో మహేశ్ కుమార్‌గౌడ్‌కే పీసీసీ చీఫ్ పదవి దక్కే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. అందుకే ఆయన ఢిల్లీ వెళ్లినట్లు అంచనా వేస్తున్నారు. అయితే పీసీసీ పదవి కోసం మంత్రులతో సహా ముఖ్యనేతలు పోటీ పడ్డారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో పాటు, మధుయాష్కీ గౌడ్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జగ్గారెడ్డి, సీతక్క, బలరాం నాయక్, సంపత్ కుమార్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరిగింది. కానీ చివరికి రేసులో మహేష్ కుమార్ గౌడ్, బలరాం నాయక్ పోటీ పడ్డారు. అయితే సీఎం రేవంత్ రెడ్డితో సాన్నిహిత్యం, బీసీ నాయకుడు కావడం, ఎన్ఎస్‌యూఐ నుండి పార్టీలో ఎదిగిన నేతగా ఉండడం మహేష్ కుమార్ గౌడ్‌కు కలిసి వచ్చే అవకాశంగా కనబడుతోంది. అలాగే టీపీసీసీ చీఫ్ గా మహేష్ కుమార్ గౌడ్ కు సీఎం రేవంత్ మద్దతు తెలపడంతో, ఇటు పార్టీ అటు ప్రభుత్వం రెండు సమన్వయంగా పనిచేసే అవకాశం ఉంటుందన్న ఆలోచనతో అధిష్ఠానం మహేష్ కుమార్ గౌడ్‌ను పీసీసీ చీఫ్ గా నియమించేందుకు సిద్ధం అయినట్లు తెలుస్తుంది

### మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

ఇక పీసీసీ నియామకంతో పాటు మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రి పదవులు, పీసీసీ అధ్యక్ష పదవిపై పార్టీ పెద్దలతో చర్చ జరిపినట్లు తెలుస్తోంది. ఇక తెలంగాణలో బీసీల్లో మరో బలమైన సామాజిక వర్గం ముదిరాజ్ సామాజిక వర్గం. ఈ సామాజికవర్గానికి ఈసారి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సారి హైదరాబాద్ , రంగారెడ్డి , ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలకు మంత్రి పదవులు రానున్నాయి. నిజామాబాద్ జిల్లా నుండి సుదర్శన్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా నుండి ప్రేమ్ సాగర్ రావు , నల్గొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లకు క్యాబినెట్ లో చోటు దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



# భగవద్గీతలో వ్యక్తిత్వ వికాసం

**సౌఖ్యం శరీరానికి సంబంధించింది, శాంతి మనస్సుకు హృదయానికి సంబంధించింది, సంతోషం ఎంతోసేపు నిలిచేది కాదు. శాంతి ఉన్నచోట సుఖం సంతోషం నీడలా ఉంటాయి. "శాంతం లేక సౌఖ్యము లేదు" సారసదళనయన... అంటాడు త్యాగయ్య.. అదే త్యాగరాజు కీర్తనలో జపము తపము ఉన్న సకల సంపదలున్నా.. గజము హయము తురగములున్నా ఎన్నివున్నా కూడా శాంతము లేక సౌఖ్యము లేదని తేల్చి చెప్పాడు. శాంతము మార్కెట్లో దొరికే వస్తువు కాదు ఎవరికి వారు సంపాదించుకోవాల్సిందే మరి ఎలా సంపాదించుకోవాలి అంటే పెద్దలు చెబుతారు.ధర్మాన్ని ఆచరిస్తే, ధర్మం అంటే ఏమిటి ప్రశ్నల పరంపరకు జవాబు శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో బోధించాడు. ధర్మాన్ని గురించి ఆదికవి నన్నయ్య- మహాభారతంలో చెప్పినట్టు "ఒరులేయని ఒనరించిన నరవర ! అప్రియంబగు దా ఒరులకు అవిసేయకునిత ,పరాయణము ధర్మ పదములు కెల్లన్" అంటాడు. ఇతరులు ఏమి చేస్తే ,మనకు అప్రియమో (కష్టమో) అది నీవు ఇతరులకు, చేయకపోవడమే ధర్మం అంటాడు. మీ.. మీ వృత్తి ధర్మాల్లో ఇతరులకు కష్టం-నష్టం కలిగించకపోవడమే ధర్మం.**

ఇతరుల మనస్సు నొప్పించక కష్టం కలిగించకపోవడం అక్రమ సంపాదన పరపీడన చేయకపోవడం వల్ల ఇతరులకు,నీకు మనశ్శాంతి లభిస్తుంది అని పెద్దలు చెబుతారు.ధర్మం గురించి రామాయణ, భారతాలు పురాణాలు ,ఇతిహాసాలు ఎన్నో రకాలుగా బోధించాయి కానీ ,ఈ ఉరుకులు పరుగుల జీవితాల్లో చదివే,వినే ఓపిక ఎవరికి ఉంది. అయినంతవరకు తేలికగా అర్థమయ్యేలా ధర్మం గురించి తెలుసుకుందాం . ధర్మం వ్యక్తిగతంగా వృత్తి గతంగా తద్వారా సమాజపరంగా ఆచరిస్తే సమాజంలోని సమస్యలన్నీ పరిష్కారం అవుతాయి .కుటుంబ యజమాని కుటుంబ బాధ్యతలు తీర్చడం ధర్మం, తల్లిదండ్రులు పిల్లల క్షేమం చూడడం ధర్మం. పెరిగి పెద్దవారైన పిల్లలు తల్లిదండ్రులను చూడడం ధర్మం. ఉద్యోగస్తులు వారి వారి ఉద్యోగ ధర్మం యజమాని తన అనుచరుల క్షేమం యజమానికి తన అనుచరులు విశ్వాసంగా ఉండటం ధర్మం. విద్యార్థులు చదువుకొనుటే ధర్మం. ఇలా ఎవరి ధర్మం వారు ఆచరిస్తే సమస్యలు ఉత్పన్నం కావు. ఇక్కడ మనకు ట్రాఫిక్ రూల్స్ గుర్తుంచుకుందాం ఎడమ మాత్రమే వెళ్ళాలి. రెడ్ లైట్, గ్రీన్ లైట్స్ గమనించాలి. స్పీడ్ లిమిట్ దాటొద్దు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలు జరగవు.అలాగే ఎవరి ధర్మం వారు నిర్వర్తిస్తే సమాజంలో శాంతి నెలకొంటుంది.అశాంతికి కారణాలు, సామాజిక శాస్త్రవేత్తలు కొన్ని తెలుపుతున్నారు. ప్రతి వ్యక్తి సహనం అలవాటు చేసుకుంటే చాలా సమస్యలు తీరుతాయి. మా చిన్నతనాన శాంతి మంత్రంతో పాటు సహనానికి సంబంధించిన శ్లోకం ,ప్రార్థన గీతంతో పాటు చదివించేవారు "సహనోభవతు సహనభునక్తు సహవీర్యం కరవావహే .."అంటూ సహనం యొక్క ప్రాధాన్యత చెప్పేవారు .

సమాజంలో అసహనం వల్లనే అన్ని సమస్యలు వస్తున్నాయి. పిల్లలకు , పెద్దలకు,ఎవరికైనా సహనం లేకపోవడం ప్రతినిత్యం చూస్తున్నాం. కొన్ని కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. దాంపత్య జీవితంలో సహనం లేక చిన్న చిన్న విషయాలకు విడాకుల వరకు వెళుతున్నారు, ప్రేమించి పెళ్లి చేసుకున్న వారిలో కూడా సహనం లేక కోర్టులెక్కుతున్నారు. సహనాన్ని అలవర్చుకుంటే చాలా సమస్యలు తీరుతాయి. సమాజంలో శాంతి లేదనుకుంటే అశాంతి ఉన్నట్టే కదా అశాంతి దూరం కావాలంటే శాంతిని అలవర్చుకోవాలి దానికి ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి. సమాజంలోని అన్ని రుగ్మతులకు పరిష్కారం శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో బోధించారు. వ్యక్తిత్వ వికాసం గురించి ప్రపంచంలో ఎవరు చెప్పని కాలంలో మనకు వ్యక్తిత్వ వికాసం గురించి వివరంగా బోధించాడు. భగవద్గీతను బాల్యం నుండి పిల్లలకు పాఠ్యాంశాలు చేర్చి బోధిస్తే సమాజంలోని అన్ని రుగ్మతలను బాగు చేయవచ్చును. ప్రస్తుత సమాజంలో హత్యలు , ఆత్మహత్యలు ప్రతిరోజూ టీవీల్లో పత్రికల్లో చూడని రోజు లేదు. మార్కులు తగ్గినవని విద్యార్థుల ఆత్మహత్యలు ,ప్రేమలు విఫలమయ్యాయని ప్రేమజంటలు, వ్యాపారుల్లో నష్టమని మరికొందరు, అపోహలు అనుమానాలతో కొందరు ఆత్మహత్యలు ఇలా రోజురోజుకు పెరిగిపోతున్నాయి. హత్యల విషయానికొస్తే చిన్న చిన్న తగాదాలు, భూ సమస్యలు ఆర్థిక లావాదేవీలు ,రాజకీయ కక్షలు ప్రతీకారాలు ఇలా నిత్య కృత్యాలుగా మారాయి. ఈ మధ్యన క్రొత్తగా ఒక విధమైన హత్యలు వింటున్నాము.



సుప్రీంకోర్టు వారు సహజీవనం అనేది నేరం కాదు అని తీర్పు ఇచ్చినారని ప్రచారంలో ఉంది. దీన్ని వెసులుబాటుగా అన్వయించుకొని వక్రభాష్యం గా తీసుకొని వింతగా ప్రవర్తిస్తున్నారు. ఈ సమస్యల వల్ల కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. కొంతమంది స్త్రీలు పురుషులు అక్రమ సంబంధాలతో క్షణిక సుఖం కొరకు క్షణికావేశం వల్ల హత్యలు జరుగుతున్నాయి.పిల్లలు ఉన్న తల్లులు తండ్రులు ఈ అకృత్యాలకు పాల్పడుతున్నారు.ఈ జాడ్యం ఎంతవరకు పోతుందో అర్థం కాదు. హత్యలు ,ఆత్మహత్యల వల్ల వారి తల్లిదండ్రులు, వారు కన్న పిల్లలు అనాధలై దుఃఖ సాగరంలో మునిగిపోతున్నారు.ఈ సమస్యలన్నింటికీ భగవద్గీతలో పరిష్కార మార్గాలు ఉన్నాయి . భగవద్గీతలోనీ 1.స్థిత ప్రజ్ఞ్య లక్షణం 2. భక్తుని లక్షణం. 3. జ్ఞాని లక్షణం ఇవి మనకు చక్కటి బోధతో మార్గనిర్దేశం చేస్తాయి. వీటికి తోడు దైవీ గుణాలు అలవర్చుకుంటే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారు. అన్ని కాకుండా కొన్నింటిని అలవర్చుకోవాలి జీవితంలో కష్ట నష్టాలు, సుఖదుఃఖాలు లాభనష్టాలు వీటిని తట్టుకునేలాగా పెద్దలు బాల్యం నుండి చెప్పాలి. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు స్నేహితులకు ఆత్మీయులకు కన్నవారికి చెప్పుకుంటే సగం భారం తగ్గగలదు. ఎంతటి ఝటిల సమస్యకైనా పరిష్కారం చూపించగలరు. ఆందోళన ఇలాంటి విపత్కర క్షణాలు అధిగమిస్తే అంతా మంచే జరగగలదు.

" చీకటి వెనక వెలుగే కదా వచ్చేది ""శోకాల మరుగున దాగి సుఖమున్నదిలే".. అంటాడు శ్రీ శ్రీ కవి

ఇక మానసిక వికాసానికి ,మానసిక ఉల్లాసానికి సాహిత్యం సంగీతం మనలను ఉన్న స్థితి నుండి ఉన్నత స్థానానికి తీసుకొని పోగలదు.

నేటి బాలలే బావి భారత పౌరులు కానీ నేటి విద్యా విధానం దారి తప్పుతుంది. కారణం కార్పొరేట్ పాఠశాలలు మార్కుల కర్మాగారాలైపోయాయి. పిల్లలను యంత్రాల్లా మార్కుల కొరకు కుస్తీలు పట్టిస్తున్నారు. అది "శిక్షణ" నా లేక "శిక్ష" నా అర్థం కావడం లేదు. బాల్యంలో ఆటపాటలతో గడపవలసిన వయస్సులో మార్కులే లోకం,సర్వస్వం లతయారవుతున్నారు. ఇందులో తల్లిదండ్రుల పాత్ర కూడా ఉంది. తల్లిదండ్రుల ప్రేమ అనురాగాలకు దూరమవుతున్నారు. బింభ ప్రతిబింభ న్యాయంగా పిల్లలు ఎదిగి తల్లిదండ్రులకు దూరమై దగ్గరుండి దూరం పెడుతున్నారు. శాస్త్ర సాంకేతిక జ్ఞానం అవసరమే పోటీ ప్రపంచంలో పిల్లలు ఎదగాలి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చదువుల వల్ల సంపాదనపరులు కావడం సంతోషించ తగ్గదే కానీ, దానితోపాటు సంగీత సాహిత్యాలు ,మానసిక వికాసానికి మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి. శారీరక ఆరోగ్యం మానసిక ఆరోగ్యం రెండు ముఖ్యం ఆరోగ్యవంతమైన సమాజంలో ఆనందం ఉత్సాహం వల్ల ప్రశాంతత కలుగుతుంది. ప్రశాంతతకు విలువ కట్టలేము కోట్లు కుమ్మరించిన దొరకని ప్రశాంతత సంగీత సాహిత్యాలలో లభ్యమవుతుంది. సాహిత్యం మనిషిని మహోన్నతుని చేస్తుంది.

**పులకించని మది పులకించు-**
**వినిపించని కథ వినిపించు.**
**కనిపించని ఆశలనించు**
**గానం మనసునే మరిపించు..**

రేపు రేపను తీపి కలలకు రూపమిచ్చును గానం,,
మది చింత బాపును గానం

తేలికైన పదాలతో గానం యొక్క ప్రాధాన్యతను ఆత్రేయకవి తెలియ చెప్పినారు. శాంతి సౌభాగ్యాలు సుఖ సంతోషాలు వర్ధిల్లాలి అంటే ఆధ్యాత్మిక భావనలు సంగీత సాహిత్యాలు ప్రజల హృదయాల్లోకి వెళ్లాలి అప్పుడు సాత్త్విక భావనలు కలిగి నైతిక వర్తనులు కాగలరు.

ధర్మో రక్షతి రక్షితః
ఓం శాంతి



**- జిన్నం అంజయ్య**
రచయిత, కవి,
సీనియర్ రాజకీయ నాయకుడు
9849310392

# అభినవ కవితా యుగ సంస్థాపకులు రాయప్రోలు

**"ఏ దేశమేగినా ఎందుకాలిడినా**
**ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన**
**పొగడరానీ తల్లి భూమి భారతిని**
**నిలుపరా నీ జాతి నిండు గౌరవం"**

**అంటూ "జన్మభూమి" గీతాన్ని రచించి.. తెలుగు జాతి గౌరవాన్ని ఎలుగెత్తి చాటిన సుప్రసిద్ధ రచయిత, కవి రాయప్రోలు సుబ్బారావు. నవ్య కవితా పితామహునిగా పేరుపొందిన రాయప్రోలు సుబ్బారావు (మార్చి 17, 1892 - జూన్ 30, 1984) తెలుగులో భావ కవిత్వానికి ఆద్యులు. ఈయన 1913లో వ్రాసిన తృణ కంకణముతో తెలుగు కవిత్వములో నూతన శకము ఆరంభమైనదని అంటారు.**

రాయప్రోలు సుబ్బారావు
13.03.1892 -30.06.1984



జాతీయోద్యమ కవిత్వాన్ని పుష్కలంగా రచించిన కవి రాయప్రోలు సుబ్బారావు. "నాదు జాతి, నాదు దేశము, నాదు భాష అను అహంకార దర్పనమందు" అని ప్రబోధిస్తూ జాత్యభిమానం, దేశాభిమానం, భాషాభిమానం ప్రతి ఒక్కరికీ నరనరాల్లో జీర్ణించుకు పోయేలా ఆయన సృజన చేశారు. ఒక కొత్త మార్గాన్ని పలుకుబడిని, భాషను దర్శనాన్ని ఇచ్చి నూతన యుగానికి సంస్థాపకుడుగా వెలసిన వారు రాయప్రోలు సుబ్బారావు. అభినవ కవితాయుగానికి ఆయన సంస్థాపకులు. నన్నయ్య తర్వాత తెలుగు కవిత్వ భాష ఆమూలంగా పరివర్తనం పొందింది రాయప్రోలు వల్లనే. ఆయన తెలుగు సంస్కృత భాషలే కాకుండా. రవీంద్రుని ప్రభావంతో భారతీయ జాతీయతా భావాలను కొత్త ఒరవడిలో తెలుగు కవితలో ప్రవేశపెట్టారు. రాయప్రోలు పరిపక్వమతులు, పాశ్చాత్య సాహిత్య విశారదులు, నవ్య కవితోపాసకులు. పాశ్చాత్య కవుల ప్రకృతి ఆరాధనా విధానాన్ని ఆకళింపు చేసుకున్న తెలుగు కవి. పాశ్చాత్య దేశాలలో పరిమళించిన ఈ భావుకతను రాయప్రోలు తెలుగులో సుసంపన్నం చేశారు. భావ కవిత్వోద్యమానికి నాయకత్వం వహించి, తృణకంకణం, స్నేహలత, ఆంధ్రావళి, జడ కుచ్చులు లాంటి రచనలు చేసిన ఆయనకు 'కోకిలస్వామి' అనే బిరుదు ఉంది. సంస్కృత రచనలపై అతిగా ఆధారపడిన తెలుగు కవిత్వాన్ని స్వతంత్ర రచనల వైపు మళ్ళించారు.

రాయప్రోలుది కేవలం అనుకరణ కాదు. తెలుగు, సంస్కృత భాషా పటిమను ఆయన వీడలేదు. సమకాలీన సమాజానికి అనుగుణంగా భావుకతను అల్లి తెలుగు కవితకు క్రొత్త సొగసులు అద్దారు. రాయప్రోలు గొప్ప జాతీయవాది. అంతేకాదు. తెలుగు జాతి అభిమాని. ఆయన దేశభక్తి గేయాలు ఎంతో ఉత్తేజకరంగా ఉంటాయి. అయన వ్రాసిన గీతాలలో అందరినోళ్లలోనూ బాగా నానిన జన్మభూమి" గీతంలో తెలుగుదనం, జాతీయాభిమానం, గత వైభవ సంకీర్తనం, ప్రబోధం లాంటివి తొణికిసలాడుతాయి. ఇప్పటికీ ఈ గీతం ఉత్తమ దేశభక్తి ప్రబోధంగా నిలిచిందనడంలో అతిశయోక్తి లేదు. "అవమానమేలరా! అనుమానమేలరా! భారతీయుడ నంచు భక్తితో పాడ.. లేరురా మనవంటి వీరులింకెందు...

ఏ పూర్వ పుణ్యమో, ఏ యోగ బలమో జనియించినాడ వీ స్వర్గఖండమున ఏ మంచి పూవులన్ ప్రేమించినావో నిను మోచె ఈ తల్లి కనక గర్భమున... లేదురా ఇటువంటి భూదేవి యెందూ లేరురా మనవంటి పౌరులింకెందు. సూర్యుని వెలుతురుల్ సోకునందాక ఓడలా ఝండాలు ఆడునందాక...అందాక గల ఈ అనంత భూతలిని మన భూమి వంటి చల్లని తల్లి లేదు పాడరా నీ తెలుగు బాల గీతములు పాడరా నీ వీర భావ భారతము". ఇంతకంటే గొప్ప దేశభక్తి పూరిత కవిత్వం ఇంకేముంటుంది.

1918లో ఉస్మానియా విశ్వ విద్యాలయం స్థాపించ బడి, తెలుగు శాఖ ఏర్పడటం జరిగాక, .. ఆయన ఉస్మానియా తెలుగు శాఖకు తొలి ఆచార్యుడిగా నియమింప బడ్డారు. ఆనాడు తెలుగు శాఖలో చదువుకున్న విద్యార్థుల్లో పల్లా దుర్గయ్య, అనుముల కృష్ణమూర్తి, ఠంయాల రంగాచార్యులు, అలాగే జువ్వాడి గౌతమరావు లాంటి వారు ఎందరో ఉన్నారు. 1958 ప్రాంతాల్లో జువ్వాడి గౌతమరావు జయంతి పత్రిక నడిపేవారు. దాన్లో సాహిత్యధార అనే శీర్షికను నిర్వహించేవారు. రాయప్రోలు అందులో రచనలు చేసేవారు. కాళిదాస మేము సందేశాన్ని దూత మేఘము అన్న పేరుతో యతి ప్రాసలు లేకుండా రాయప్రోలు వారు రచించగా, పలువురి విమర్శలకు గురైనారు.

ఆయన ఒక పక్క కవిత్వంలో తెలుగు ప్రజల వంటి ధీరులింకెందునూ లేరని, ఏదేశ మేగినా జాతిగౌరవం నిలపాలని వ్రాస్తూనే, మరొక పక్క తెలంగాణలో ప్రజలు రాజ్యంతో వీరోచితంగా పోరాడు తూండగా నైజాం రాజ్యాన్ని పొగుడుతూ రచించారన్న పేరు మూట కట్టుకున్నారు. రవీంద్రుని శిష్యుడైన రాయప్రోలు సుబ్బారావు నిజాం ప్రభువునకు అనుకూలంగా ప్రవర్తించడం.. ప్రజలకు వ్యతిరేకంగా ఉండటం నాటి జాతీయోద్యమ నాయకులకు నచ్చలేదు.

"కోకిల స్వామి" బిరుదాంకితుడు అయిన రాయప్రోలు గురించి, కాళోజీ నారాయణరావు నా గొడవలో ...'ఓ కోయిలా.. ఏ మావి చివురులు తిని ఎవరిని పాడుతున్నావు?' రాయప్రోలును ఉద్దేశించి ఒక గేయం రాశారు.

కట్టమంచి రామలింగారెడ్డి ఆయనను స్తుతించారు. రాయప్రోలు కవిత్వాన్ని జాతీయ భావ ప్రేరకంగా దుగ్గిరాల గోపాల కృష్ణయ్య వంటి కవిత్వ ప్రేమికులు భావించి 1913 నాటి బాపట్ల ఆంధ్ర మహాసభల్లో వాటిని గానం చేయడం విశేషం.

రాప్రోలువారి సప్తతి సందర్భంలో విజయవాడ లో జరిగిన సభలో...తాను రాయప్రోలు వల్ల ప్రేరణ పొందినట్లు తొలి రచనలు చేసినట్లు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ పేర్కొనడం గమనార్హం. రాయప్రోలు జూన్ 30, 1984న మరణించారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

# బహుళ పార్టీల ప్రభుత్వాల ఆవశ్యకత

1947 లో నెహ్రూ తొలుత జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరిచారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, జన సంఘ్ మూల పురుషుడైన శ్యామ్ ప్రకాశ్ ముఖర్జీ, కృపలానీ మరికొందరు సోషలిస్టులను కలుపుకొని నడిచారు. 1967 నుండి ఇతర పార్టీల మద్దతుతో కేంద్ర ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. ఇవి ఆయా ప్రాంతాల , భాషా ప్రజల ఆకాంక్షలకు, భారత రాజ్యాంగంలోని ఫెడరల్ స్వభావానికి నిదర్శనం.

**ఫజల్ అలీ కమిషన్ చేసిన నష్టాలు.**

రాష్ట్రాల పునర్ విభజించాలని ఏర్పాటు చేసిన ఫజల్ అలీ కమిషన్ నివేదిక తెచ్చి పెట్టిన కష్టాలు నష్టాలు, పర్యవసానంగా సాగిన సంఘర్షణలు ఇన్నీ అన్నీ కావు. ఆదివాసీ గిరిజన ప్రాంతాల ప్రత్యేకతను గుర్తించకుండా ఆయా రాష్ట్రాలలో సరిహద్దులుగా కలిపారు. జాతీయోద్యమ కాలంలో పాలకులకు వ్యతిరేకంగా స్వయం ప్రతిపత్తి కోసం చేసిన 170 తిరుగుబాట్ల చరిత్రను మరిచారు. భాష ఒకటే అనే పేరిట అసమానతల ప్రాంతాలను దబ్బనంతో కుట్టారు.

నాడు 15 కోట్లు నేడు 32 కోట్లు జనాభా గల అమెరికాలో 56 రాష్ట్రాలున్నాయి. నాడు 30 కోట్లు నేడు 140 కోట్లున్న ఇండ్యాలో 14 రాష్ట్రాలు చాలు అనుకోవడమే ఒక పెద్ద పొరపాటు. 565 సంస్థానాలను , నైజాం, కాశ్మీర్ , గోవా, పుదుచ్చేరి రాజ్యాలను బ్రిటిష్ , ఫ్రెంచ్ పాలిత ప్రాంతాలను ఫజల్ అలీ కమిషన్ సూచనలతో 14 రాష్ట్రాలుగా మార్చినంత సులభంగా సంస్కృతులు భాషలు ఆకాంక్షలు మారవు. అసలా ఏర్పాటు వల్లే అనేక సంఘర్షణ లు , అసమానతలు, అంతర్గత వలసలు,, వలస వాదాలు పెరిగాయి. అనేక ఉద్యమాలతో 29 రాష్ట్రాలయ్యాయి. . ఇంకా 15 ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు సాగుతున్నాయి. ఉత్తర ప్రదేశ్ ను 8 రాష్ట్రాలుగా, బిహార్ ను 5 రాష్ట్రాలుగా, మధ్య ప్రదేశ్ ను నాలుగు రాష్ట్రాలుగా, మహరాష్ట్రను 5 రాష్ట్రాలుగా ఏర్పాటు చేయాల్సివుండగా కలిపి కుట్టారు. శతాబ్దాలుగా కొనసాగిన గోండ్వానా , విదర్భ, నాగపూర్ రాష్ట్రాలు, నైజాం రాజ్యం అస్తిత్వం లేకుండా చేశారు. దేశం అసమ అభివృద్ధికి అంతర్గత వలసాధిపత్య దోపిడి అణిచివేతలకు వివక్షకు వెలివేతకు మూల భూతమయ్యారు. అధిక పార్లమెంటు సీట్లు గల రాష్ట్రాలే కేంద్రంలో చక్రం తిప్పారు.

**ఇండియా ఫెడరల్ స్వభావం ప్రత్యేకమైనది**

ఇండియాలో ఫెడరల్ స్వభావం ప్రత్యేకమైనది. అది కుల వ్యవస్థ నిర్మిత సమాజంలో అగ్ర కుల ఆధిక్యత, బహుజన కులాల సాధికారికత అనే రెండు రూపాలు తీసుకున్నాయి. మరోవైపు ఆదివాసీ స్వయం ప్రతిపత్తి ఉద్యమ రూపాలు తీసుకున్నాయి. అలా కేంద్రం, కాంగ్రెస్, బిజెపీ పార్టీల ఇష్టాయిలతో వెరవకుండా ముందుకు నడిచారు. వారు ప్రాంతీయ శక్తులుగా ఎదిగారు. అందుకు రకరకాల నినాదాలను సిద్ధాంతాలను ముందుకు తెచ్చారు. అలా ఏర్పడుతూ వచ్చినవే ప్రాంతీయ పార్టీలు. నేటికీ అవి తమ వనరులు ఉద్యోగాలు తమకే అంటూ తమ ప్రాంత అభివృద్ధి సంస్కృతి, స్వీయ పరిపాలన, ఆత్మ గౌరవం, స్వేచ్ఛ సమానత్వం , స్వీయ అస్తిత్వం కోసం పెనుగులాడుతున్నాయి. పోరాడుతున్నాయి. ఇదే క్రమంలో బీసీలు మహిళలు, చిన్న భాషల వారు తమ సంస్కృతుల రక్షణ కోసం, తమ వనరులతో తమ స్వీయ అభివృద్ధి కోసం స్వీయ ఆత్మ గౌరవం కోసం తమ స్థానిక పార్టీలు స్థాపించి కొని సర్పంచ్ నుంచి ఎమ్మెల్యేలే, ఎంపీ దాకా గెలిపించుకుంచున్నారు. ఇవాళ ఇపుడు దేశంలో 100కు పైగా భారత రాజ్యాంగం పరిధిలో ఎన్నికల కమిషన్ గుర్తించి పార్టీలు ప్రజల చేత ఎన్నుకోబడుతున్నాయి. వీటన్నింటిని రాదని దేశ వ్యాప్తంగా ఏక పార్టీ అధికారంలోకి రావాలని కోవడం, మిగతా అందరినీ అణిచి వేయడమే.

**బహుళ పార్టీల వ్యవస్థ**
**ప్రజాస్వామ్యానికి నిదర్శనం**

నేడు 50 పార్టీలతో ఏర్పడే సంకీర్ణ ప్రభుత్వాలు అని పిలుస్తున్న బహుళ పార్టీ ప్రభుత్వాలు భారత రాజ్యాంగంలో ఫెడరల్ స్వభావానికి, రాష్ట్రాల హక్కులకు, ఆకాంక్షలకు నిదర్శనం. సంకీర్ణ ప్రభుత్వాలను నిజానికి జాతీయ ఫెడరల్ ప్రభుత్వాలు అని పిలవాలి. ప్రాంతీయ పార్టీలు సంకీర్ణ ప్రభుత్వాల్లో కోరేవి ఫెడరల్ విధానంలో తమ ప్రాంత తమ పార్టీ ప్రయోజనాలు. ఇవి రాజ్యాంగం ఫెడరల్ స్వాభావానికి సంబంధించినవి. ఏక పార్టీ ప్రభుత్వాలు ఫెడరల్ రాజ్యాంగం విలువలను సీమితులను కాదని అన్నిటిలో తొచ్చుకు వస్తాయి. నియంతృత్వం చెలాయిస్తాయి. ఇందిర గాంధీ ఎమర్జెన్సీ, బిజేపీ నరేంద్ర మోడీకు చేసిన ప్రజా వ్యతిరేక చట్టాలు ఎన్నో. బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు ఏక్ పార్టీ పాలన నిరాకరించాయి. సంకీర్ణ ఫెడరల్ ప్రభుత్వాల వల్లనే కుల గణన ఒక తొలి అడుగుగా ముందుకు వచ్చింది. ప్రభుత్వాలు స్థిరంగా వుంటే ప్రజలకు కీడు జరుగుతుంది. మార్పు అడ్డగించ బడుతుంది.

**మార్పులు వేగవంతం కావడానికి సంఘర్షణ తప్పదు**


నిలకడగా సాగే కుల వ్యవస్థలో, మార్పులు వేగవంతం కావడానికి సఘర్షణ తప్పదు. అంబేద్కర్, జ్యోతిరావు పూలే, రాజా రామమోహన్ రాయ్, మార్క్స్ కూడా సంఘర్షణ తప్పదు అని చెప్పిన వారే. అందుకే బీయస్పీ కాన్సీరాం డిస్ట్ర బెన్స్ ఈజ్ అవర్ ఫిలాసఫీ అన్నారు. మార్పు కోరేవారు ప్రభుత్వాలు స్థిరంగా ఉంటే గల ప్రమాదాలు గుర్తిస్తారు. డియంకె, అన్నాడియంకే ఎన్టీఆర్ హయాంలో కేంద్రం రాష్ట్రాల కనువుగా పని చేయాల్సి వచ్చింది. జయలలిత మద్దతు అనివార్యం కావడం వల్లనే తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లను పార్లమెంటు ఆమోదించి కోర్టులు జోక్యంచేసుకోకుండా 9వ షెడ్యూల్‌లో చేర్చడం జరిగింది.

**ఏకపార్టీ పాలన నియంతృత్వానికి దగ్గరి దారి**

పూర్తి మెజారిటీ వుంటే ఏం జరుగుతుందో ఇందిరా గాంధీ పెట్టి ఎమర్జెన్సి, అమలు చేసిన నల్ల చట్టాలు, నరేంద్రమోడీ అమిత్‌షాల రెండెడ్ల బండి ఒకే దేశం ఒకే భాష నినాదాలు అనేక నల్ల చట్టాలు నిదర్శనం. దాంతో నేను సరే మంచిదే యూరపులో వలె భాషల వారీగా దేశం సోవియట్ యూనియన్ 13 దేశాలుగా ప్రశాంతంగా విడి పోయినట్టు విడిపోతే సరి. అని స్పష్టం చేశాను. సామ్రాజ్య వాదులు అశోకుడు, అక్బర్, ఔరంగ దేబ్, ఆంగ్లేయుల కాలంలో తప్ప భారత ఉపఖండం ఒకే దేశంగా ఒకే పరిపాలనలో ఎన్నడూ లేదు. ఏక పార్టీ ప్రభుత్వాలు మార్వాడీ గుజరాతీ సేట్లకు జాతీయ ప్రయోజనాల పేరిట రాష్ట్రాల సహజ వనరులను అప్పగిస్తాయి. స్థానిక, ఆయా రాష్ట్రాల పారిశ్రామిక వేత్తలను ఎదగకుండా చేస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఏక పార్టీ ప్రభుత్వాలు భారీ పారిశ్రామిక వేత్తల, జాతీయ దళారీ వర్గాల కనుసన్నలలో సాగుతాయి. బహుళ పార్టీ ప్రభుత్వాలు స్థానిక, ప్రాంతీయ ఆయా రాష్ట్రాల జాతీయ పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తాయి.

**బహుళ పార్టీ ప్రభుత్వాలు**
**నెహ్రూ కాలం నుంచే ఉన్నాయి**

నెహ్రూ కాలం నుండే బహుళ పార్టీ జాతీయ ప్రభుత్వాలు కొనసాగాయి. 1967 నుండి సగం రాష్ట్రాల్లో కాంగ్రెస్ స్థానంలో బహుళ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఆ తరువాత ఏ పార్టీ కూడా ప్రజా సమస్యలపై గెలిచిన దాఖలాలు లేవు. 1971 లో పాకిస్తాన్ యుద్ధంతో, 1977 లో ఎమర్జెన్సీ వ్యతిరేకతతో , 1984 లో ఇందిర హత్య సానుభూతితో, 1989 లో రాజీవ్ గాంధీ సానుభూతితో, 1995లో , 2014, 2019, 2024 రామ జన్మ భూమి జపంతో గెలుచుకుంటూ వచ్చారు. ప్రాంతీయ పార్టీలు కమ ప్రయోజనాలను ముందుకు తెస్తూ గెలుస్తూ వస్తున్నాయి. సహజంగానే వీటీ స్వభావం ఫెడరల్ స్వభావం. భాషలు వేరు. సంస్కృతులు వేరు. అవసరాలు ప్రాధాన్యతలు వేరు. తమ అస్తిత్వం కోసం పోరాటం చేస్తాయి, బేరం చేస్తాయి, కేంద్రం నుండి సాధించుకుంటాసి. ఇలా ఫెడరల్ , బహుళ పార్టీ ప్రభుత్వాలు భారత రాజ్యాంగం మౌలిక లక్ష్యాలతో కనీస కార్యక్రమంతో ముందుకు సాగితే బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు సాధ్యమే . అందుకు 69 శాతం రిజర్వేషన్లు ఆమోదించిన గత ప్రభుత్వాలే నిదర్శనాలు అని మరిచి పోకూడదు.



**- బి. ఎస్.రాములు**
సామాజిక తత్వవేత్త
బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ
ఫోన్ : 8331966987

# రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి



- ఓడిపోయిన ఉక్రోషంతో ఆయన ప్రసంగం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**విశ్వంభర, ఢిల్లీ:** బీజేపీ పట్ల, ప్రధాని నరేంద్ర మోడీ పట్ల వారికున్న అక్కసును, ఎన్నికల్లో వరుసగా మూడోసారి ఓడిపోయిన ఉక్రోషంతో రాహుల్ గాంధీ ప్రసంగంలో స్పష్టంగా కనిపించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి .కిషన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఢిల్లీలో అయన మీడియాతో మాట్లాడుతూ .. కాంగ్రెస్ పార్టీ, వారి మిత్రపక్షాలు హిందుత్వాన్ని అవమానిస్తూ మాట్లాడటం ఇది మొదటిసారేమీ కాదని, సనాతన ధర్మాన్ని వారి మిత్ర పక్షాలు తీవ్రమైన పదజాలంతో విమర్శించిన సందర్భాలు చాలానే ఉన్నాయన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ, పార్లమెంటు వేదికను తన విద్వేష పూరిత ప్రసంగాలని వేదికగా మలచుకోవడం దురదృష్టకరమన్నారు. యావత్ హిందూ సమాజానికి హింసను, విద్వేషాన్ని ఆపాదిస్తూ ఆయన మాట్లాడిన మాటలకు యావద్భారతం సాక్షీభూతంగా నిలిచిందన్నారు. ఇది రాహుల్ గాంధీ అసలు రంగులను మరోసారి ప్రపంచానికి బట్టబయలు చేసిందని చెప్పారు. ఎప్పటిలాగే రాహుల్ గాంధీ తన ప్రసంగంలో భాగంగా అబద్ధాలను దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. నిజమైన సమస్యల మీద చర్చించవలసిన లోక్ సభను.. బహుశా ఎన్నికల ప్రచారమని భావించి ఇంకా తప్పుడు సమాచారంతో, తప్పుడు వీడియోలతో దుష్ప్రచారం చేసి లబ్ధి పొందాలని రాహుల్ గాంధీ ప్రయత్నం చేస్తున్నట్లున్నరని ఆరోపించారు. లోక్ సభలో రాహుల్ గాంధీ చేసిన విద్వేషపూరిత ప్రసంగానికి యావత్ హిందూ సమాజాన్ని క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. స్వయం సహాయక బృందాల మహిళలను లఖ్‌పతి దీదీలుగా మార్చే లక్ష్యంతో ప్రధాని మోదీ పనిచేస్తున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. డీఎంఎఫ్ నిధుల ద్వారా స్వయం సహాయక బృందాలను ప్రోత్సహించడం, వారి ఉత్పత్తులకు సరైన గుర్తింపును కల్పిస్తామన్నారు. రానున్న రోజుల్లో మహిళా గ్రూపులకు ఆదాయ వనరులను సమకూర్చే లక్ష్యంలో భాగంగా డీఎంఎఫ్ స్టాల్ ప్రారంభించామని తెలిపారు. గనుల శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల్లోని 645 జిల్లాల్లో డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ( డీఎం ఎఫ్ ) ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. ప్రధాని ఆదేశాలతో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలకు.. బొగ్గు, ఇతర ఖనిజాల గనుల సీఎస్ ఆర్ యాక్టివిటీలో భాగంగా ఈ సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇందులో భాగంగా గనులున్న ప్రాంతాల ప్రజల విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, నైపుణ్యత, స్వయం సహాయక బృందాలకు అవసరమైన శిక్షణ, ప్రోత్సాహాన్ని అందించే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దేశవ్యాప్తంగా డీఎంఎఫ్ ఆధ్వర్యంలో రూ.92 వేల కోట్లకు పైగా నిధులున్నాయని , ఇందులో రూ.50,900 కోట్లను వెచ్చించి 3,29,945 ప్రాజెక్టులు చేపట్టామని తెలిపారు. ఇందులో 1,88,642 ప్రాజెక్టులు పూర్తయ్యాయని వెల్లడించారు . .ఇప్పటికే ఢిల్లీ హాట్ లో శాశ్వత ప్రాతిపదికన ఓ స్టాల్ ఏర్పాటు చేశామన్నారు. పర్యావరణ పరిరక్షణకు సరైన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం తమ ప్రధాన లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.



# మంత్రివర్గ విస్తరణకు అంతా రెడీ

- జులై 4 ముహూర్తం
- నేడు మరోసారి ఢిల్లీకి రేవంత్
- ఆశావహుల్లో చాలా మంది

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారు అయింది. జూలై 4 మంత్రి వర్గ పునర్వవస్థీకరణకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. అయితే కేబినెట్ విస్తరణ లో ఎవరికి అవకాశం దక్కనుంది. విస్తరణపై ముఖ్యమంత్రి రేవంత్ ఎలాంటి కసరత్తు చేస్తున్నారు..? హైకమాండ్ చేసిన సూచనలు ఏంటి..? ఇటీవల పార్టీ మారినవారికి చోటు కల్పిస్తారా..? అనేదే ఆసక్తికరంగా మారింది. ఎట్టకేలకు తెలంగాణ కేబినెట్ విస్తరణకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం కేబినెట్‌లో సీఎంతో కలుపుకుని 12 మంది మంత్రులు ఉండగా, మరో 6 బెర్తులు ఖాళీగా ఉన్నాయి. కేబినెట్ విస్తరణలో ఈ ఆరు మంత్రి పదవులు భర్తీ చేయనున్నారు. ఢిల్లీలో ఐదు రోజుల పాటు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, హైకమాండ్‌తో సంప్రదింపుల అనంతరం కేబినెట్ కూర్పుపై స్పష్టత వచ్చినట్లు సమాచారం. ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవులలో రెండు బీసీలకు, ఒకటి ఎస్టీకి ఇవ్వాలని డిసైడ్ అయ్యారట. అయితే ఎవరెవరికి మంత్రి పదవులు ఇవ్వాలనే దానిపై మరోసారి ఢిల్లీలో పార్టీ ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ కావాలని నిర్ణయించారట. ఈ నేపథ్యంలోనే మంత్రి పదవి ఆశావాహులు అంతా అటు ఢిల్లీ ఇటు సీఎం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారట. అయితే ఉమ్మడి హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలకు ప్రస్తుత కేబినెట్‌లో ప్రాతినిధ్యం లభించలేదు. కేబినెట్ విస్తరణలో ఈ 4 ఉమ్మడి జిల్లాలకు తప్పనిసరి అవకాశం కల్పించాల్సి పరిస్థితి.

### మంత్రి పదవుల కోసం భారీ పోటీ..!

ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ మంత్రి పదవి ఆశిస్తున్నారు. మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉండడం వినోద్‌కు ప్లస్ పాయింట్ అయితే, వివేక్ ఇతర పార్టీలకు వెళ్లి రావడం మైనస్‌గా భావిస్తున్నారట. గతంలో ఎమ్మెల్సీ, ప్రస్తుతం మంచిర్యాల ఎమ్మెల్యేగా ఉన్న ప్రేమ్ సాగర్ రావు తనకు మంత్రి పదవి ఖాయం అని భావిస్తున్నారు. ఇక ఎస్టీ కోటాలో ఎడ్మ బొజ్జు పేరు సైతం వినిపిస్తోంది. ఇక ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి పార్టీ సీనియర్ నేత సుదర్శన్ రెడ్డి మంత్రి పదవి లిస్ట్ లో ముందు వరుసలో ఉన్నారు. ఆయనకు దాదాపు మంత్రి పదవి ఖాయం అనే పార్టీలో టాక్. మైనారిటీ కోటాలో మరో నేత షబ్బీర్ అలీ పేరు వినిపిస్తోంది. పీసీసీ పదవి ఆశిస్తున్న ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ తనకు పీసీసీ కాకుంటే మంత్రి పదవి ఇవ్వాలని కోరుతున్నారట. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సీరియస్‌గా మంత్రి పదవి కోసం ప్రయత్నం చేస్తున్నారు. అయితే నల్లగొండ నుంచి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి రెడ్డి ఒకే సామాజిక వర్గం నుంచి మంత్రులుగా ఉండడంతో రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి సమస్యగా మారింది. ఇక ఎస్టీ కోటాలో బాలునాయక్‌కు మంత్రి పదవి కన్ఫర్మ్ అని తెలుస్తోంది. బీసీ కోటాలో ముఖ్యంగా యాదవ కోటాలో మంత్రి పదవి లిస్ట్ లో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు అవకాశం ఉందని సమాచారం.

### హైదరాబాద్‌లో ఎవరికో..?

ఇక ఉమ్మడి హైదరాబాద్ జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేరు. ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్ ఒక్కరే కాంగ్రెస్ కు ఎమ్మెల్యే ఉన్నారు. ఒకవేళ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వాలనుకుంటే బీసీ కోటాలో దానంకు అవకాశం దక్కేలా ఉంది. మరో యువనేత బల్మూరి వెంకట్ కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఇక ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి పార్టీ సీనియర్ నేత మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి దక్కే అవకాశం ఉంది. మరో నేత పరిగి రామ్మోహన్ రెడ్డి కూడా మంత్రుల లిస్ట్ లో ఉన్నారు. ఇక ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉందట. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్ లో చేరికతో జీవన్ రెడ్డి అసంతృప్తి గా ఉన్నారు. దీంతో జీవన్ రెడ్డి కి మంత్రి పదవి ఇస్తే ఎలా ఉంటుంది అనే చర్చ కూడా ఉంది. బీసీ కోటాలో ఉమ్మడి మహబూబ్ నగర్ నుంచి వాకాటి శ్రీహరి ముదిరాజ్ పేరు వినిపిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారం సందర్భంగా ముదిరాజ్ కేబినెట్‌లో అవకాశం ఇస్తామని సీఎం చెప్పడంతో శ్రీహరికి మంత్రి పదవి ఖాయం అనే చర్చ పార్టీలో ఉంది. మొత్తం గా పూర్తిస్థాయి కేబినెట్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కసరత్తు దాదాపు పూర్తి అయినట్లే తెలుస్తోంది. చాలా మంది పేర్లు పరిశీలన లో ఉన్నా, గోప్యత పాటించాలని డిసైడ్ అయ్యారట. మంత్రి పదవి వస్తుందో రాదో అన్న టెన్షన్ అందరిలో నెలకొంది.

# ఈ రాష్ట్రంలో అడుగుపెట్టాలంటే..

## సరిహద్దులో సైన్యంలా రాష్ట్రంలోకి డ్రగ్స్ రాకుండా పోలీసు పహారా ఉండాలి

- సైనిక స్కూళ్ల మాదిరే పోలీసు పిల్లలకు ప్రత్యేక స్కూల్స్
- నేరాల నియంత్రణకే ప్రాధాన్యం ఇవ్వాలి
- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడాలి
- పోలీసు అధికారులతో సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** ఒకప్పుడు గుడుంబా పెద్ద సమస్యని, ఇప్పుడు అది లేదని, ప్రస్తుతం పల్లె, పట్టణం తేడా లేకుండా డ్రగ్స్ సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మనం ఏ స్థాయిలో ఉన్నా, ఎంత సంపాదించినా మన పిల్లలు బాగుండాలని కోరుకుంటామని, ఆ పిల్లలే డ్రగ్స్ బారిన పడితే ఎలా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. తెలంగాణకు ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) నుంచి గంజాయి వస్తోందనే సమాచారం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. చొరబాట్లు, ఇతర సమస్యలు రాకుండా దేశ సరిహద్దుల్లో సైన్యం ఎలా అప్రమత్తంగా ఉంటుందో, పహారా కాస్తుందో, అలాగే రాష్ట్ర సరిహద్దుల్లోనూ పోలీసులు అలా అప్రమత్తంగా ఉండి, పహారా కాసి తెలంగాణలోకి గంజాయి మొక్క డ్రగ్స్ రాకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, ఆపై స్థాయి అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసు శాఖలో సీబీసీఐడీ, ఏసీబీ, గ్రేహౌండ్స్, అక్టోపస్ వంటి విభాగాలు ఏర్పాటు చేశారని, ప్రస్తుతం సైబర్ నేరాలు, డ్రగ్స్ సమాజాన్ని పట్టి పీడిస్తున్నందున సైబర్ సెక్యూరిటీ బ్యూరో, యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఏర్పాటయ్యాయన్నారు. డ్రగ్స్, సైబర్ నేరాలు పట్టిపీడిస్తున్నందున వాటిని అరికట్టేందుకు అవసరమైన సామర్థ్యాలను అందిపుచ్చుకోవాలని పోలీసులకు ముఖ్యమంత్రి సూచించారు. ఐపీసీ, సీఆర్‌పీసీల స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలు తెచ్చినందున వాటిపైనా పూర్తి అవగాహన తెచ్చుకోవాలని, అందుకు అవసరమైన శిక్షణ తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అలా శిక్షణ పొందినప్పుడే సమాజం నుంచి నూతనంగా ఏర్పాటయ్యే సవాళ్లను ఎదుర్కొవచ్చని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.. దేశంలో ఎక్కడ తీవ్రవాద, ఉగ్రవాద కదలికలు, అరెస్టులు అయినా, బాంబు పేలుళ్లు జరిగినా అదనపు సమాచారం కోసం కేంద్ర హోం శాఖ నుంచి ఆయా రాష్ట్రాల పోలీసులు తెలంగాణ ఎస్ఐబీ సహకారం కోరతారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. మన రాష్ట్ర పోలీసు, హైదరాబాద్ పోలీసుపై అందరికీ నమ్మకం ఉందని, నేరగాళ్ల ఆలోచనను, వాళ్లు వేసే ఎత్తుగడలను ముందే గుర్తించి ఆ నేరాలను అరికట్టే ప్రణాళిక రచించి, అందుకు అవసరమయ్యే శిక్షణ పొందుతున్నందునే తెలంగాణ పోలీసుకు జాతీయ స్థాయి గుర్తింపు ఉందని ముఖ్యమంత్రి అన్నారు. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్‌తో మన ఉత్పత్తులు విదేశాలకు, విదేశీ ఉత్పత్తులు మన దేశానికి వస్తున్నట్లే, నేరగాళ్లు సైతం విదేశాల నుంచే ఇక్కడ నేరాలకు పాల్పడుతున్నారని, వాటిని సమర్థంగా ఎదుర్కోవడానికి అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పోరాటాలతో ఏర్పడిన తెలంగాణలో పదేళ్లలో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. సింగరేణి కాలనీలో ఒక బాధితుని కుటుంబాన్ని, ఔటర్ రింగు రోడ్డులో ఒక బాధితుడైన డాక్టర్‌ను పరామర్శించడానికి వెళితే వారంతా గంజాయికు అలవాటైన వారి వలనే తాము బాధితులుగా మరినట్లు తెలిపారన్నారు. తమ పిల్లలు కార్పొరేట్ స్కూళ్లకు వెళుతున్నారని, తాము రూ.వందల కోట్లు సంపాదించినా ఉపయోగం లేకుండాపోయిందని, తమ పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇందుకు ప్రధాన కారణం పోలీసు వ్యవస్థ రాజకీయ నిఘాపై శ్రద్ధ పెట్టి నేరగాళ్లను వదిలివేయడమేనని ముఖ్యమంత్రి అన్నారు.

### మితిమీరిన భద్రత వద్దు

రాజకీయ వ్యవస్థపై నిఘా తగ్గించి నేరాలపై నిఘా పెట్టి నేరగాళ్లను పట్టుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. సమాజంలో ఉన్న ప్రజలు ఎన్నుకుంటేనే తాము ప్రజా ప్రతినిధులుగా వచ్చామని, తమకు మితిమీరిన సెక్యూరిటీ అవసరం లేదని, ఎవరికి ఎంత అవసరమో అంతే సెక్యూరిటీ ఇవ్వాలని, భద్రత విషయంలో తనతో సహా ఎవరికీ అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదని డీజీపికి ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. భద్రత, ఇతర విషయాల్లో కొన్ని సార్లు పోలీసుల అతి ఉత్సాహం చూపుతారని, ఆ ఉత్సాహం, శక్తి నేరాల నియంత్రణపై చూపాలని ముఖ్యమంత్రి హితవు పలికారు. పోలీసు కుటుంబాల పిల్లలు రాణించలేరనే అపవాదు సమాజంలో ఉందని, ఇందుక ప్రధాన కారణం విధుల్లో పడి కుటుంబాలకు, పిల్లలకు సరైన సమయం కేటాయించకపోవడమే కారణమని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే సైనిక స్కూళ్ల మాదిరే పోలీసు పిల్లల కోసం పోలీసు స్కూళ్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. గ్రేహౌండ్స్‌కు చెందిన 50 ఎకరాల స్థలంలో పోలీసు స్కూల్ ఏర్పాటు చేస్తామని, ఆరు నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందులో ఉంటుందని, హోంగార్డు నుంచి డీజీపీ పిల్లల వరకు చదువుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. సామర్థ్యం, పని తీరుతోనే బదిలీలు కోరుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. సామర్థ్యం ఉన్నవారిని తమ ప్రభుత్వం గుర్తిస్తుందని, అందుకు సందీప్ శాండిల్య ఉదాహరణ, తన ప్రభుత్వంలో రిటైర్ అయిన వారిని పదవీ కాలం పొడిగించిందని ఒక్క సందీప్ శాండిల్యకేననే విషయం గుర్తుంచుకోవాలన్నారు.

### నేను పోలీసు కుటుంబం నుంచే వచ్చా...

పోలీసుల పిల్లలు తాము పోలీసుల కుటుంబాల నుంచి వచ్చామని చెప్పుకునేందుకు ఇబ్బంది పడతారని, అందుకు కారణం పోలీసు శాఖపై సమాజంలో ఉన్న అభిప్రాయమేనని ముఖ్యమంత్రి అన్నారు. ఆ అభిప్రాయం మారాలని, తన తండ్రి, తన అన్న పోలీసు అని గర్వంగా చెప్పుకునేలా మన ప్రవర్తన ఉండాలని ఆయన సూచించారు. తన అన్న భూపాల్ రెడ్డి వనపర్తిలో కానిస్టేబుల్ గా పని చేసి తనను చదివించారని, తన అన్న పెంపకంతోనే తాను ఈ రోజు ముఖ్యమంత్రి స్థాయికి వచ్చానని ఆయన వెల్లడించారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే పోలీసు శాఖ సమస్యలు పరిష్కరించుకోకుంటే జీవితకాలంలో అవి పరిష్కారం కావన్నారు. తాను జడ్పీటీసీ సభ్యునిగా ఉన్నప్పుడు పోలీసు అధికారులంటే ఒక గౌరవం, భయం ఉండేదని, క్రమంగా అది పడిపోయిందని, దానిని పునరుద్ధరించేలా ప్రయత్నించాలని సూచించారు. నేరాల నియంత్రణలో ఎస్‌హెచ్‌వోలే కీలక పాత్ర అని, పైఅధికారుల పని పర్యవేక్షణ మాత్రమేనని, ఈ విషయం గుర్తించి పోలీసులకు వన్నెతెచ్చేలా పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

### తెలంగాణ బ్రాండ్ హైదరాబాద్

తెలంగాణ బ్రాండే హైదరాబాద్ అని, హైదరాబాద్ పోలీసు అంటే తెలంగాణకు గుండెకాయ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నగరంలో నేరాలను నియంత్రించకపోతే, అరాచకాలను అరికట్టకపోతే రాష్ట్రానికి తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని ముఖ్యమంత్రి అన్నారు. పోలీసులు అంతా తమ బాధ్యతను ప్రతి రోజు గుర్తుపెట్టుకొని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజిని కాపాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రాజకీయ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డీజీపీ రవి గుప్తా, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ బి.శివధర్‌రెడ్డి, టీజీ న్యాబ్ డీజీ సందీప్ శాండిల్య, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, హైదరాబాద్, సైబారాబాద్, రాచకొండ కమిషనర్లు శ్రీనివాసరెడ్డి, అవినాష్ మహంతి, తరుణ్ జోషి తదితరులు పాల్గొన్నారు.

### ఇక నుంచి ఆన్‌లైన్‌లో సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తుల స్వీకరణ

ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) దరఖాస్తులను ఇక నుంచి ఆన్ లైన్ లో స్వీకరించనున్నారు. సీఎంఆర్‌ఎఫ్ నిధులు పక్కదారి పట్టకుండా పారదర్శకతతో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందు కోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో వెబ్ సైట్ ను రూపొందించారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ వెబ్ సైట్ ను మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్‌ఎఫ్ నిధులు పక్కదారి పెట్టిన నేపథ్యంలో ఈ విధానాన్ని రూపొందించారు. ఇక ముందు ముఖ్యమంత్రి సహాయ నిధి దరఖాస్తులను ఈ వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సీఎంఆర్‌ఎఫ్ కోసం తమ వద్దకు వచ్చే వారి వివరాలు తీసుకుని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ సిఫార్సు లేఖ ను జత చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అప్లికేషన్ లో సంబంధింత దరఖాస్తు దారుల బ్యాంక్ అకౌంట్ నెంబర్ తప్పనిసరిగా ఇవ్వాలి. అప్‌లోడ్ చేసిన తర్వాత సీఎంఆర్‌ఎఫ్ కు సంబంధించిన ఒక కోడ్ ఇస్తారు. ఆ కోడ్ ఆధారంగా ఒరిజినల్ మెడికల్ బిల్లులను సచివాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్ ను సంబంధిత ఆస్పత్రులకు పంపించి నిర్ధారించుకుంటారు. అన్ని వివరాలు సరిగ్గా ఉంటే సీఎంఆర్ ఎఫ్ అప్లికేషన్ ను ఆమోదించి చెక్ ను సిద్ధం చేస్తారు. చెక్ పైన తప్పని సరిగా దరఖాస్తు దారుడి అకౌంట్ నెంబర్ ను ముద్రిస్తారు. దీని వల్ల చెక్ పక్కదారి పట్టే అవకాశం ఉండదు. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు చెక్ లను స్వయంగా దరఖాస్తుదారులకు అందజేస్తారు. ఈ నెల 15 తర్వాత సీఎంఆర్‌ఎఫ్ ధరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరిస్తారు. https//cmrf.telangana.gov.in\ సైట్ లో దరఖాస్తు అందుబాటులో ఉంటుంది.



# తీన్మార్ మల్లన్నకు నిరసన సెగ

- పిలిచి మరీ అవమానం
- నిరుద్యోగ సమస్యలపై నిలదీసిన బీజేవైఎం

**విశ్వంభర, భువనగిరి:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా మెల్లగా వ్యతిరేకత మొదలైంది. ముఖ్యగా.. నిరుద్యోగ యువత నుంచి ఈ వ్యతిరేకత ప్రారంభమైంది. నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ.. ఇప్పటికే యువత ఆందోళనలు మొదలుపెట్టింది. మోతీలాల్ నాయక్ అనే నిరుద్యోగి ఆమరణ నిరాహార దీక్ష చేయగా.. ఆయనకు విపక్ష పార్టీలకు చెందిన నాయకులు, పలు విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే.. కాంగ్రెస్ సర్కార్‌పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న యువత.. ఎక్కడికక్కడ ఆ పార్టీ నేతలను నిలదీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే.. యాదాద్రి భువనగిరిలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కు నిరసన సెగ తగిలింది. తీన్మార్ మల్లన్నను బీజేవైఎం నేతలు అడ్డుకున్నారు. నిరుద్యోగుల డిమాండ్‌ల మీద స్పందించాలంటూ మల్లన్నను డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అయితే.. సమావేశానికి వెళ్తున్న మల్లన్నను పిలిచిన బీజేవైఎం కార్యకర్తలు.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయటమే కాకుండా.. ఆయనను మాట్లాడుకుండా చేశారు. నిరుద్యోగుల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావిస్తానని మల్లన్న వారికి హామీ ఇచ్చారు. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి కృషి చేస్తానని మాట ఇచ్చారు. అయినప్పటికీ మల్లన్నను బీజేవైఎం కార్యకర్తలు ఆయన మాటలను లెక్క చేయకుండా.. తీన్మార్ మల్లన్నకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూనే ఉన్నారు. దీంతో.. "మీరు రమ్మని పిలిస్తేనే వచ్చానని.. వచ్చాన నా మాట వినకుండా ఇలా నినాదాలు చేయటం నన్ను అవమానించటమే అవుతుంది.." అంటూ మల్లన్న తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీంతో.. పోలీసులు కల్పించుకుని.. ఆందోళనకారులను చెదరగొట్టారు. ఎంతకు వినకపోవటంతో.. తీన్మార్ మల్లన్న అక్కడి నుంచి వెనక్కి వెళ్లిపోయారు.

# అస్తవ్యస్తంగా కాంగ్రెస్ పాలన

- హామీలను పక్కన పెడుతున్న రేవంత్ సర్కార్
- ప్రభుత్వంపై హరీష్ రావు ఫైర్



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా తయారైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సంక్షేమానికి సమాధి కట్టేశారు.. నిరుద్యోగులను నిలువునా ముంచేశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. నిరుద్యోగులు రోడ్డెక్కి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఆంక్షలు తప్ప పెన్షన్లు లేవు. ఒకటో తేదీన జీతాలు ఇస్తామని గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. మే, జూన్ మాసాలకు సంబంధించిన పెన్షన్లు ఇవ్వలేదు. పక్కనే సీఎం చంద్రబాబు పాత బకాయిలు కలిపి ఏడు వేల పెన్షన్ ఇచ్చిండు. రేవంత్ నెలకు పెన్షన్ నాలుగు వేలు చేస్తా అని చేయలేదు. ఇచ్చే రెండు వేల పెన్షన్ కూడా రెండు నెలల నుంచి ఇవ్వడం లేదు. అర్హులైన వారికి పెన్షన్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో పారిశుద్ధ్యం పడకేసింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర పోతోంది. ఏడు నెలల కాలంలో ఏడు పైసలు కూడా విడుదల చేయలేదు. ఆ రోజు కేసీఆర్ ప్రభుత్వంలో పల్లె ప్రగతి కింద ప్రతి పల్లెకు జనాభా ప్రతిపాదన నిధులు ఇచ్చాం. గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు నిధులు ఇచ్చాం. కాంగ్రెస్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ పల్లెలు దేశానికి ఆదర్శంగా నిలిచాయి. రేవంత్, చంద్రబాబు సమావేశంపై హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తన సహచరుడు చంద్రబాబుతో సంప్రదించి ఆ ఏడు మండలాలు వెనిక్కి తేవాలని కోరుతున్నాం..ఈ ఏడు మండలాలు ఇచ్చిన తరువాతనే మిగతా విభజన అంశంపై చర్చించాలని కోరుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి నాల్లలోనే 7 మండలాలను ఏపీలో కలిపారు. దానితో లోయర్ సీలేరు పవర్ ప్రాజెక్ట్ ఆ రాష్ట్రానికి వెళ్ళిందని ఆగ్రహించారు. దానిని కేసీఆర్ తీవ్రంగా ఖండించి బందుకు కూడా పిలుపునిచ్చారు..ఆ బిల్లు పెట్టింది బీజేపీ ఐతే ఆమోదించింది కాంగ్రెస్ అన్నారు. భద్రాచలంలో కనీసం భక్తుల పార్కింగ్, డంపింగ్ కు కూడా స్థలం లేని పరిస్థితి ఉందని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ కి ఓటు వేసినందుకు ఖమ్మం జిల్లాలో చింతకాని మండలంలో ఓ వ్యక్తి వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు..ప్రభాకర్ ఆత్మహత్య హృదయ విదారకంగా ఉందన్నారు.

# మహాదేవపూర్ మండలంలో కలెక్టర్ పర్యటన

**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ మహాదేవపూర్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో మొత్తం ఎంత మంది వైద్యులున్నారు, విధులకు హాజరైన సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ ఎంతమంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారని హాస్పిటల్ సూపరింటెండెంట్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్పిటల్‌లోని ఆపరేషన్ థియేటర్, డయాలిసిస్ సెంటర్ ఓపీ విభాగాన్ని పరిశీలించారు. హాస్పిటల్‌లో వైద్య పరికరాల కొరత ఏమైనా మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రతిపాదనలు అందచేయాలని సంభదిత వైద్యాధికారులను ఆదేశించారు. మండలంలోని మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వర్షాలకాలం మొదలైనందున హాస్పిటల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ .. పరిశుభ్రంగా ఉంచాలని సూపరిండెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. విధులకు హాజరయ్యే వైద్యుల అటెండెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ ప్రాంగణంలో ఉన్న ఖాళీ ప్రదేశాన్ని పండ్లు మరియు పూల మొక్కలతో సుందరికరణ చేయాలన్నారు. అనంతరం మండలంలోని మెట్పల్లి గ్రామం మరియు ఎస్సీ కాలని లోగల మండల పరిషత్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించి పెండింగులోని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నపిల్లలతో ముచ్చటించారు. అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు అందించే పోషక పదార్థాలు పరిశీలించి బాలామృతం ప్యాకెట్‌ను బాలింతలకు అందించారు. కార్యక్రమంలో కాళేశ్వరం నుంచి కుంట్లమ్ గ్రామానికి వెళ్లే రహదారి పరిశీలించి 5 కిలోమీటర్ల మేర పాడైనందున అట్టి రోడ్డు





నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని అంచనా వేయాలని సంబంధిత పంచాయతీ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి రేపు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యటన ఉన్నందున చేపట్టే కార్యక్రమ వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ చెంద్రశేఖర్, తహసీల్దార్, ప్రహలాద్, ఎంపీడీఓ చంద్రశేఖర్, పంచాయతీ రాజ్ ఈఈ దిలీప్, డీఈ సాయిలు, ఏఈ రవీందర్, మహాదేవపూర్ సీడీపీఓ, రాధిక, ఎంపీపీ రానిభాయ్ తదితరులు పాల్గొన్నారు.



## దేవాదాయశాఖ అధికారులతో సమీక్షా సమావేశం

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఎండోమెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రావు, అసిస్టెంట్ కమిషనర్ సునీత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ రావు, ఏఈ దుర్గాప్రసాద్, భూపాలపల్లి డివిజన్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులతో నియోజకవర్గంలోని పలు దేవాలయాలపైన ఎమ్మెల్యే చర్చ జరిపారు. ముఖ్యంగా రేగొండ మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ అభివృద్ధి, చిట్యాల మండలంలోని నైన్ పాక గ్రామంలోని నాపాక ఆలయ అభివృద్ధితో పాటు పలు దేవాలయాల అభివృద్ధికి సంబంధించి చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నదని, అందుకు అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

## సైనికుల సేవలు వేలకట్టలేనివి



**విశ్వంభర, ఆమనగల్లు :** దేశ సైన్యంలో మన గ్రామ యువకులు ఉండడం మనకెంతో గర్వకారణం అని వెల్దండ గ్రామమాజీ సర్పంచ్ యన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ అన్నారు. వెల్దండ మండల కేంద్రానికి రంగరాతి తిరుపతయ్య దేశ సైన్యంలో పనిచేసి పదవీ విరమణ పొందిన సందర్భంగా మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్స్‌లో జరిపిన సమావేశంలో తిరుపతయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మట్ట వెంకటయ్య గౌడ్, యెన్నంశేఖర్ రెడ్డి, విష్ణు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో డిగ్రీ ప్రవేశాలకు ఆహ్వానం

**విశ్వంభర, షాద్‌నగర్ :** షాద్‌నగర్‌లోని నాగర్ కర్నూల్ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో 2024 2025 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బీ సుజాత సూచించారు. ఈ కళాశాల షాద్‌నగర్ బైపాస్‌లో కమ్మదనం వెళ్లే దారిలో నూర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించబడుతుంది. కావున బీఎస్సీ, బీకాం, బీఏలో ప్రవేశించదలిచిన అర్హత గల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో సంప్రదించవచ్చని, ప్రవేశానికి చివరి తేదీ 5 జులై గా సూచించారు. వివరాలకు ఫోన్ నెంబర్ 7995660881ను సంప్రదించాలని తెలిపారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేవైఎం ధర్నా



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం మంగళవారం భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, అలాగే గ్రూప్ 1 విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం 1:100 ప్రకారం మెయిన్ ఎగ్జామ్‌కి అభ్యర్థులను అర్హతను పెంచాలని, గ్రూప్ 2,3 పోస్టులను పెంచి నోటిఫికేషన్‌ను ఇవ్వాలని అలాగే ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ పరీక్షల తేదీలను వాయిదా వేసి మెగా డీఎస్సీని ప్రకటించాలనే డిమాండ్లనుతో మండల తహసిల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి, మండల అధ్యక్షులు పైళ్ళ ప్రశాంత్, బీజేపీ మండల అధ్యక్షులు గజరాజు కాశీనాథ్, మండల నాయకులు పరకాల రాంబాబు, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి లోడి మహేష్ గౌడ్, బీజేవైఎం ఉపాధ్యక్షులు ఆకుల రవీందర్, బీజేవైఎం మండల అధికార ప్రతినిధి పోన్నగాని సూర్య ప్రకాష్, సోషల్ మీడియా మండల కన్వీనర్ బండారి సాయి, బోజ్జ పవన్, వనం మధు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ఆలయంలో కాలసర్ప పూజలు

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో మంగళవారం సందర్భంగా దాదాపు 100కు పైగా కాలసర్ప పూజలు భక్తులచే నిర్వహించబడ్డాయి. వివాహాలు కానివారు, సంతానం కలగనివారు, కుజ దోషం ఉన్న వారు ఈ కాలసర్ప పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులకు ఏటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.






## సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

**విశ్వంభర, ఆమన్గల్లు :** కడ్తాల్ మండలం సాలార్పూర్ గ్రామపంచాయతీలో జడ్పీ నిధుల నుంచి రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కడ్తాల్ జడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, అదేవిధంగా గ్రామాలు దేశానికి పట్టుగొమ్మలని, గ్రామాలను ఎంత అభివృద్ధి చేసుకుంటే మన దేశం అంత అభివృద్ధి పథంలో నడిచినట్టుగా భావించాలని అన్నారు. అదే విధంగా గత ప్రభుత్వంలో కడ్తాల్ మండల పరిధిలోని అనేక గ్రామాలకు సీసీ రోడ్లను నిధులు మంజూరు చేయించానని ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తండాల్లో గ్రామాల్లో ఇంకా మిగిలిన పనులను పూర్తి చేయాలని సూచించారు. ఎంపీటీసీ ప్రియా రమేష్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలి పంతు, మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, మాజీ వార్డ్ సభ్యులు బాబా తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్కూల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** భారత విద్యార్థి ఫెడరేషన్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ హైస్కూల్లో సమస్యల పైన జిల్లా విద్యాశాఖ అధికారికి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూల్లో చదువుకునే పేద విద్యార్థులకు కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని, తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ హై స్కూల్స్ లో మరియు ప్రైమరీ స్కూల్స్ లో టీచర్స్ కొందరు సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో చదువు పైన అవగాహన లేకుండా పోతుందన్నారు. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారి చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు పేద మధ్యతరగతి విద్యార్థులు కాబట్టి వాళ్లందర్నీ భవిష్యత్తులో తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుల పైన ఉందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ హై స్కూల్స్ మరియు ప్రైమరీ స్కూల్స్ లో చదువు చెప్పే ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు తక్షణమే వారిపై చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాల్సిందిగా ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.

## ది హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ అన్నదానం

**విశ్వంభర, షాద్‌నగర్ :** మల్లికార్జున కాలనీలో ది హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొబ్బిలి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ రోజు కౌన్సిలర్ రేటికల్ నందీశ్వర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదానం దాత బొబ్బిలి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అన్నదానం మహాదానం కాబట్టి వారంలో ఒకరోజు ప్రతి మంగళవారం నిరుపేదల ఆకలి తీర్చడానికి తన వంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు.



## షీ టీమ్స్‌పై అవగాహన సదస్సు



**విశ్వంభర, చివ్వేంల :** సూర్యాపేట ఎస్పీ ఐపీఎస్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు సూర్యపేట షీ టీం ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో షీ టీమ్స్, మహిళల భద్రత మరియు, రక్షణ పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సూర్యాపేట షీటీం ఎస్సై ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అధ్వర్యంలో మహిళ రక్షణపై పటిష్టంగా పని చేస్తున్నామని, విద్యార్థినిలు సమస్యలు ఉంటే ఉపాధ్యాయుల దృష్టికి, అధికారుల దృష్టి తేవాలని, మానసిక ధైర్యం కలిగి ఉండాలని, అనుకూల, ప్రతికూల సమయాల్లో స్పందించేలా అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

తల్లిదండ్రుల కోరికలను, కళలను నెరవేర్చాల్సిన బాధ్యత మనపై ఉన్నదని గుర్తు చేశారు. ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా, ATM కార్డ్ వివరాలు, OTP వివరాలు ఇతరులకు తెలపవద్దని పేర్కొన్నారు.

ఇతరులు ఆశ చూపితే వారికి ఆకర్షితులు కావద్దు అని తెలియజేశారు. మెసేజ్‌లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని, సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అన్నారు.

అలాగే వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, షీ టీమ్స్ ఏఎస్ఐ సాలయ్య, హెడ్ కానిస్టేబుల్ యల్లారెడ్డి, చివ్వెంల పోలీస్ స్టేషన్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ రెడ్డి, లింగయ్య, కానిస్టేబుల్ భూపాల్ రెడ్డి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## హిందువులని అవమానించిన రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** పార్లమెంటు సాక్షిగా రాహుల్ గాంధీ హిందువులను హింస వాదులని కించపరచడం జరిగిందని, అందుకు నిరసనగా భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ దేశ నాయకుడు రాహుల్ గాంధీ హిందువులను హింస వాదులని అంటూ హిందువులను కించపరిచరుస్తూ ఉంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇందుకు కాంగ్రెస్ దేశ నాయకుడు రాహుల్ గాంధీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మంథని రాజేందర్, యువమోర్చ మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్, ఉపాధ్యక్షుడు అంకరి రాజేందర్ సీనియర్ నాయకులు కన్నెబోయిన అయిలన్న, పూర్ణచందర్ కొక్కు శ్రీను, నాగుల సాయి, జాడి మనోజ్, దడిగెల వెంకటేష్, శ్యామల ప్రశాంత్, సంపత్, రాకేష్, సంతోష్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల సమస్యలపై వినతి

**విశ్వంభర, భూపాలపల్లి :** బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు అన్ని మండల తహసీల్దార్ ఆఫీస్‌లలో వినతి పత్రాలు ఇవ్వాలనే ఆదేశాల మేరకు అందులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో మహాదేవపూర్ తహసీల్దార్ రాథోడ్ ప్రహలాద్ గారికి వినతి పత్రం అందజేశారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్ మాట్లాడుతూ.. నీళ్ళు నిధులు నియామకాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి నేటి వరకు నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసానికి గురవుతున్నారనేది జగమెరిగిన సత్యం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చెయ్యి చూపించినట్లుగానే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పంథాలో నడుస్తూ హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తుందన్నారు. కావున తహసీల్దార్ ఈ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళమని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్, కార్యదర్శులు బల్ల సంపత్, శ్యామల ప్రశాంత్, వెంకటేష్, పూర్ణచందర్, బీజేపీ నాయకులు మంథని రాజేందర్, అంకరి రాజేందర్‌లు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రారంభమైన

# 38వ హైదరాబాద్ సెయిలింగ్ వీక్ 2024

**విశ్వంభర, హైదరాబాద్ :** భారతదేశ సెయిలింగ్ క్యాలెండర్‌లో ల్యాండ్‌మార్క్ ఈవెంట్ అయిన 38వ హైదరాబాద్ సెయిలింగ్ వీక్ 2024 ఈరోజు ఘనంగా ప్రారంభించారు. ప్రారంభ వేడుకలో లెఫ్టినెంట్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నే VSM, కమాండెంట్ MCEME, కల్నల్ కమాండెంట్ కార్ప్స్ ఆఫ్ EME, కమోడోర్ EME సెయిలింగ్ అసోసియేషన్ మరియు ప్రెసిడెంట్ లేజర్ క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నేతృత్వంలో EME సెయిలింగ్ అసోసియేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ఏడాది హైదరాబాద్ సెయిలింగ్ వీక్ సెయిలింగ్ ప్రతిభకు, క్రీడాస్ఫూర్తికి పోటీగా నిలువనుంది. భారతదేశానికి చారిత్రాత్మకంగా, EME సెయిలింగ్ అసోసియేషన్ 15 సంవత్సరాలలో మొదటిసారిగా అంతర్జాతీయ మెజరర్స్ క్లినిక్, అంతర్జాతీయ న్యాయమూర్తుల సెమినార్‌ను కూడా నిర్వహించింది. సెయిలింగ్ పోటీల్లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నత ప్రమాణాలను కొనసాగించడానికి మరియు ప్రతిభను పెంపొందించడానికి ఈవెంట్ యొక్క నిబద్ధతను హైలైట్ చేస్తుంది. ఈ సంవత్సరం బహుళతరగతి రెగట్టా యొక్క పునరుజ్జీవనాన్ని కూడా సూచిస్తుంది, ఇవి సెయిలింగ్ ఔత్సాహికుల యొక్క విభిన్న శ్రేణిని ఒకచోట చేర్చి, భారతదేశంలో పెరుగుతున్న ప్రజాదరణ మరియు పోటీ స్ఫూర్తికి దోహదం చేస్తాయి.

ఈవెంట్‌లలో సమగ్ర పవర్‌బోట్ కోర్సులు మరియు దేశం నలుమూలల నుంచి వచ్చిన NCC క్యాడెట్ నావికుల కోసం YAI కోచింగ్ క్యాంప్ ఉన్నాయి. ఇది ఈవెంట్ యొక్క సమగ్ర స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. ఈ శిబిరం బాలిక నావికులకు శిక్షణ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించింది మరియు BASS అనాథాశ్రమంలోని పిల్లల కోసం ప్రత్యేక సెషన్‌లను ప్రదర్శించింది. యువ తరంలో నౌకాయానం పట్ల ప్రేమను పెంపొందించింది. EME సెయిలింగ్ అసోసియేషన్ & లేజర్ క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన 38వ హైదరాబాద్ సెయిలింగ్ వీక్ ఆర్మీ మరియు దేశంలో క్రీడలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది.






# ప్రజా భవన్‌లో ప్రజావాణి

**విశ్వంభరా హైదరాబాద్ :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలు చిన్నారెడ్డిని, ప్రజాభవన్ అధికారులను కలిసి వినతిపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 601 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 142 , పౌరసరఫరాల శాఖ కు సంబంధించి 87 , మున్సిపల్ శాఖ కు సంబంధించి 53, హోం శాఖకు సంబంధించి 47 దరఖాస్తులు, పంచాయతి రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబంధించి 52, ఇతర శాఖలకు సంబంధించి 220 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ఇతర అధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించండంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# 4న ప్రభుత్వ పాఠశాలల బంద్

## బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యను బలోపేతం చేస్తామని మౌలిక వసతులు కల్పిస్తామని అట్టహాసంగా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం విద్యాసంస్థలు ప్రారంభమైన కనీసం పుస్తకాలు స్కూల్ డ్రెస్సులు పంపిణీ చేయలేకపోవడం నిధులు విడుదల చేయలేకపోవడంతో మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. అదేవిధంగా ప్రైవేట్ కార్పొరేట్ ఫీజుల దోపిడీ నియంత్రించి ఫీజు నియంత్రణ చట్టం అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయకపోవడం దారుణమని అన్నారు. నియంత్రణకి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విద్యాసంస్థల ప్రారంభానికి ముందే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల డొనేషన్, బుక్స్, స్కూల్ బస్సు పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ బహిరంగ దోపిడీకి పాల్పడుతున్న ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గు చేటు అన్నారు. ప్రభుత్వం విద్యాశాఖ అధికారుల తీరు నిరసిస్తూ రాష్ట్ర కార్యాలయంలో నాల్గొవ తేదీన బంద్ ప్రకటించడం జరిగింది. ఈ బంద్ ద్వారా రాష్టంలో పాఠశాల పేరుతో జరుగుతున్నా దోపిడీలను అరికట్టేంతవరకు BSF పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా వారి డిమాండ్స్ ను వెంటనే పరిష్కరించి విద్య వ్యవస్థను కాపాడాలని డిమాండ్ చేశారు. సర్కార్ బడులలో సత్వరమే పుస్తకాలు డ్రస్సులు అందించాలని, ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్లో అధిక ఫీజుల నియంత్రణ, బుక్స్ డ్రెస్ డొనేషన్ పేరుతో ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలపై కఠినంగా వ్యవహరించాలి. ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి. విద్య హక్కు చట్టం అమలు చేయాలి. ఒకే పేరుపై అక్రమంగా నడుస్తున్న కార్పొరేట్ స్కూల్ లను నిషేధించాలని BSF రాష్ట్ర కమిటీ డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని అన్నారు.



# ఆర్‌అండ్‌బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి రివ్యూ

### చంద్రబాబు, రేవంత్ భేటీ నేపథ్యంలో

**విశ్వంభర, హైదరాబాద్:** ఈ నెల 6వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ కాబోతుండటం ఆసక్తిగా మారుతోంది. తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ నేపథ్యంలో పది సంవత్సరాలుగా అపరిష్కృతంగా మారిన విభజన అంశాలకు ఓ పరిష్కార మార్గం దొరకవచ్చు అనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం సచివాలంయంలోని తన చాంబర్ లో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక రివ్యూ నిర్వహించారు. సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు భేటీలో చర్చించాల్సిన విభజన అంశాలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ పరిధిలోని ఆస్తుల వివరాలపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు. లేక్ వ్యూ, గ్రీన్ ల్యాండ్స్, మంజీరా అతిథి గృహాలపై మంత్రి కోమటిరెడ్డి చర్చించారు. అలాగే మంత్రులు, ఎమ్మెల్యేల క్వార్టర్లపై మంత్రి వెంకట్ రెడ్డి సమీక్షలో అధికారులతో చర్చించారు.

# 9న శీతల పండుగ

### సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య నాగునాయక్

**విశ్వంభర చివ్వేంల :** గిరిజనులు ఘనంగా జరుపుకునే శీతల పండుగను ఈ నెల తొమ్మిదో తేదీన మంగళవారం యావత్ గిరిజనులందరూ జరుపుకోవాలని సేవాలాల్ సేన సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య నాగు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు పవిత్రంగా ఉంటాయని, పండుగ సందర్భంగా గిరిజనులు పశువులను అలంకరించడం జరుగుతుందని ఇది పూర్వికుల నుంచి వస్తున్న ఆనవాయితీ అని తెలిపారు. ఇది ప్రతీ సంవత్సరం పెద్దపుసాలా కార్తీ మొదటి వారం లేదా రెండవ మంగళవారం యావత్ గిరిజనులు అందరూ ఐక్యతను చాటే విధంగా ఈ పండుగను పెద్ద ఎత్తున జరుపుకునే సంప్రదాయ పండుగ అతి పవిత్రమైనదిగా పేర్కొన్నారు. ఈ శీతల పండుగను యావత్ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గిరిజనులందరూ జరుపుకోనున్నట్లు పేర్కొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలకు కుర్చీల అందజేత




**విశ్వంభర, కొత్తూరు :** మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి సొంత ఖర్చులతో సుమారు 400 కుర్చీలను అందజేశారు. అధికారులు ఎంపీపీని కుర్చీలు కావాలని అడిగిన వెంటనే స్పందించిన ఆయన మంగళవారం సొంత ఖర్చుతో కుర్చీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతి, తాజా మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్లారం శేఖర్ రెడ్డి, లింగం నాయక్, మాజీ ఉపసర్పంచ్లు దయానంద్ గుప్తా, నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ మోడీ దర్శన్, సిద్దు గౌడ్, జయేందర్ రెడ్డి, రమేష్ నాయక్, జంగయ్య యాదవ్, దయానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దండోరా రథోత్సవం విజయవంతం చేయాలి

### ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ మేడి శ్రీనివాస్ మాదిగ

**విశ్వంభర న్యూస్, ఆత్మకూరు(ఎం) :** ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న నాయకత్వంలో ఆత్మకూరు(ఎం)మండల ఇంచార్జ్ మేడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈనెల జూలై 7 తారీఖున హైదరాబాదులోని రవీంద్రభారతిలో జరుగు 30 సంవత్సరాల దండోరా రథోత్సవాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు. అలాగే మాదిగ దండోరా ఉద్యమంలో అమరులైన మృతవీరులను వారి కుటుంబాలను ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. అలాగే ఆత్మకూరు(ఎం) మండలం నుండి వెయ్యి డప్పుల తోటి తరలివెళ్లి మాదిగ సంస్కృతిని కూడా ప్రదర్శించాలని మేడి శ్రీనివాస్ మాదిగ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వస్తుపుల స్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కుమ్మరికుంట్ల గణేష్ మాదిగ, వస్తుపుల ఎల్లయ్య మాదిగ, మేడి చంద్రయ్య మాదిగ, పంది రవీందర్ మాదిగ, మండల నాయకులు మేడి బాలకృష్ణయ్య మాదిగ, సంఘపాక స్వామి మాదిగ, సంఘపాక రాజమల్లు మాదిగ, మేడి నరేష్ మాదిగ, ఎడ్ల ఐలయ్య మాదిగ, కొమ్ము ముత్తయ్య మాదిగ, మేడి నరసింహారావు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ హాస్టల్‌లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



**విశ్వంభర, అంబర్‌పేట్ :** అంబర్‌పేట్ నియోజకవర్గం గోల్నాక డివిజన్ గోవింద్ నగర్‌లో గల గవర్నమెంట్ బిసి బాయ్స్ హాస్టల్‌ను మంగళవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సందర్శించారు.

ప్రజావాహిని నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే హాస్టల్‌ను తనిఖీ చేశారు. అయితే హాస్టల్ వసతులు అన్నీ ఉన్న, ఇందులో ఉండాల్సిన ఆఫీసర్లు మరియు విద్యార్థులు లేకపోవడంతో ఎమ్మెల్యే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులను హాస్టల్లో జాయిన్ అయ్యేలా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమస్యను ప్రత్యేక దృష్టితో చూస్తున్నామని అలాగే కలెక్టర్ తో కూడా మాట్లాడి తగిన చర్యలు త్వరితగతిన తీసుకోవాలని కోరుతామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఎస్. ప్రవీణ్ కుమార్, వార్డెన్ కిరణ్, ఇంచార్జ్ రాములు, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఖేలో భారత్ యూత్ గేమ్స్‌లో సత్తా చాటిన సర్దార్ అంగద్ సింగ్ సిద్ధూ



**విశ్వంభర, బషీర్ బాగ్:** ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియాను (ఎంఎస్ఎంఈ) మంత్రిత్వ శాఖ, పీట్ ఇండియా ఉద్యమం గుర్తించింది. నీతి ఆయోగ్ భారత ప్రభుత్వంచే ఆమోదించారు. మన తెలంగాణ క్రీడాకారులు "ఇండో నేపాల్ ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్ 2024"కి ఎంపికయ్యారు. నేపాల్ రంగశాల స్టేడియం (పోఖారా)లో జూన్ 26, 27, 28, 29, 30 2024న నిర్వహించారు. ఖేలో భారత్ యూత్ గేమ్స్ అథ్లెటిక్స్, కరాటే, కబడ్డీ, సిలంబం, యోగా, ఫుట్‌బాల్, ఖోఖో, ఎయిర్ రైఫిల్ షూటింగ్, ఆర్చరీ, హ్యాండ్ బాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్రికెట్, తైక్వాండో పోటీలు నేపాల్‌లో జరిగాయి. తెలంగాణ రాష్ట్ర ఎయిర్ రైఫిల్ షూటింగ్ ప్లేయర్లు "ఇండోనేపాల్ ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్ 2024"లో 10మీ ఎయిర్ రైఫిల్ షూటింగ్ టార్గెట్ పీప్‌సైట్ పాల్గొని వ్యక్తిగత, ద్వంద్వ జట్టు వంటి వివిధ విభాగాల్లో 6బంగారు, 2 సిల్వర్ మెడల్స్ గెలుచుకున్నారు. ఇందులో చక్రత్ సాయిహన్సిక అండర్ 17 ఎయిర్ రైఫిల్, వ్యక్తిగతంగా 1గోల్డ్ మెడల్, డ్యూటీమ్‌కి 1సిల్వర్ మెడల్, సర్దార్ అంగద్ సింగ్ సిద్ధూ అండర్ 17, ఎయిర్ రైఫిల్, వ్యక్తిగతంగా 1గోల్డ్ మెడల్, డ్యూటీమ్‌లో 1సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. గుగ్లావత్ సురేందర్ అండర్ 25, పిస్టల్, వ్యక్తిగతంగా 1గోల్డ్ మెడల్ డ్యూటీమ్‌లో 1గోల్డ్ మెడల్ గెలుచుకున్నారు. రాథోడ్ సంతోష్ అండర్ 30 లో బ్రేక్ బారెల్, వ్యక్తిగతంగా 1గోల్డ్ మెడల్, డ్యూటీమ్ 1 సిల్వర్ మెడల్, బైరగోని అరుంకుమార్ ఓపెన్ కేటగిరీ ఎయిర్ రైఫిల్, వ్యక్తిగతంగా 1గోల్డ్ మెడల్ , 1 డ్యూటీమ్‌లో సిల్వర్ మెడల్ గెలుచుకుని సత్తా చాటారు. నేపాల్ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ దుర్గా థాయ్ చేతుల మీదుగా మెడల్స్ అందుకున్నారు.

# ప్రభుత్వ భూములపై వెంటనే సర్వే నిర్వహించాలి

- కలెక్టర్ శశాంక్‌తో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చర్చలు



**విశ్వంభర, కొత్తూరు :** సిద్ధపూర్ గ్రామంలో భూసేకరణలో అవకతవకలకు గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అలాగే భూములు కోల్పోయి పరిహారం పొందకుండా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కలెక్టర్‌ని కోరారు. అదేవిధంగా పలు సర్వే నెంబర్లలో పేదల ఇళ్ల నిర్మాణానికి, అటస్థలాల కోసం కనీసం 15 నుంచి 20 ఎకరాల భూమిని సర్వే చేసి గుర్తించి ఇవ్వగలరని కోరారు. కొందుర్గు మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన స్టేడియం కోసం భూసేకరణ చేసి త్వరగా అప్పగించేందుకు తగు చర్యలు తీసుకోగలని అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూంల కేటాయింపుల్లో జరిగిన అవకతవకలపై వెంటనే సమగ్ర విచారణ జరిపి నిజమైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూంల కేటాయింపులు జరిగేటట్టు చూడగలరని కోరారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూంల కేటాయింపుల్లో ఎలాంటి నియమ నిబంధనలు పాటించకుండా, ఇష్టానురీతిగా తమ అనుచరులకి కేటాయించారని పేర్కొన్నారు. కావున అర్హులైన పేదలకు మాత్రమే కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారుల ఎంపికలో పార్టీలకతీతంగా వ్యవహరించాలని, అదేవిధంగా పాలిటెక్నిక్ కళాశాలకు త్వరగా భూమిని కేటాయించాలని ఎమ్మెల్యే కలెక్టర్‌తో చర్చించారు. పెండింగ్ లో ఉన్న సమస్యలపై కలెక్టర్ తో పాటు వచ్చిన అదనపు కలెక్టర్ కలెక్టర్ (స్థానిక సంస్థలు ), జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, జిల్లా పంచాయతీ అధికారి తదితరులతో సమావేశమై తొందరగా పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

# 'మున్సిపల్ అధికారులు ప్రభుత్వ స్కూళ్ల వైపు కూడా చూడండి'



**విశ్వంభర, షాద్‌నగర్ :** అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జూలై 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన విద్యార్థి ఉద్యమ బాట సమస్యలపై సర్వే సందర్భంగా మంగళవారం షాద్నగర్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలికల హై స్కూల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని పాఠశాలలో పేరుకుపోయిన చెత్తను చాలా రోజుల నుంచి శుభ్రం చేయకపోవడం వలన దుర్వాసన వస్తుంది స్కూల్ ఆవరణలో పిచ్చి మొక్కలు మొలవడంతో పాములు తేళ్లు స్కూల్ లోపలికి వస్తున్నాయని తక్షణమే ప్రభుత్వ పాఠశాలల్లో పేరుకుపోయిన చెత్తను పిచ్చి మొక్కలను శుభ్రం చేయాలని ఉన్నతాధికారులను కోరారు. లేనియెడల విద్యార్థి సంఘాలు విద్యార్థులు ఏకమై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్నటువంటి మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లును తక్షణమే వారికి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ షాద్నగర్ అధ్యక్షుడు విజయ్ చారి, కార్యదర్శి ఆకాష్ నాయక్, అరుణ్, రాహుల్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# మాడుగుల మండల చివరి సర్వసభ్య సమావేశం



**విశ్వంభర, ఆమనగల్లు :** మాడ్గుల మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన చివరి సర్వ సభ్య సమావేశంలో కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. సభ్యుల పదవీకాలం ముగుస్తుండడంతో సభ్యులందరికీ వీడ్కోలు పలికి శాలువాలతో సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి ,ఎంపీపీ పద్మా రెడ్డి, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మూడు చట్టాలను స్వాగతిస్తు రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ మెంబర్ గోకుల రామారావ్, సహకార సంఘం డైరెక్టర్ రాజీవ్ రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణాగులగారి, రంగాప్రవీణ్, అరవిందరెడ్డి, వెన్నం రాజు, శ్రీనివాస్, శ్రీకాంత్, భగిరథ, లక్ష్మి, తదితర న్యాయవాధులు పాల్గొన్నారు.

- విశ్వంభర, హైదరాబాద్

## జీవో నెంబర్ 46ను రద్దు చేసి

# జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి

- బీజేవైఎం నిరసన, ధర్నా
- తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేత



**విశ్వంభర, షాద్‌నగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా.. నేటికి హామీలు అమలు కాలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య మండిపడ్డారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న ఉద్యోగాలపై బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్యాట అశోక్ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు, నిరుద్యోగులు సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్ చెప్పిన మాటలు విని నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచారంటూ మాడిపడ్డారు.

తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్యలని పట్టించుకోవడంలేదన్నారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చెయ్యి చూపించినట్లుగానే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పంథాలో నడుస్తూ.. హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తుందన్నారు. ఈ మోసాలను ఎండగడుతూ.. తెలంగాణ యువత తరపున, నిరుద్యోగుల తరపున బీజేవైఎం కొన్ని సంవత్సరాలుగా.. పోరాటాలు చేస్తూనే ఉందని, అయినప్పటికీ ఈ నియంతృత్వ ప్రభుత్వం కనీస స్పందన లేకుండా కాలం గడిపేస్తుందని అన్నారు.

ఈ నిరుద్యోగ సమస్యలను కలెక్టర్ వద్దకు తీసుకెళ్ళమని విజ్ఞప్తి చేస్తూ.. తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్యాట అశోక్ మాట్లాడుతూ.. రాష్ట్ర శాఖ నిరుద్యోగుల సమస్యలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న ప్రధాన అంశాలనూ మీడియాకు వివరిస్తూ.. గ్రూప్ వన్ ప్రిలిమ్స్ లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలి, గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని, 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను నిలిపివేసి నూతన తేదీలను ప్రకటించాలని అన్నారు. అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33% రిజర్వేషన్ కేటాయించాలన్నారు. పోలీసు కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీవో నెంబర్ 46ను వెంటనే రద్దు చేయాలని, జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంథాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని నీళ్ళు నిధులు నియామకాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి నేటి వరకు నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసానికి గురవుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్యలు విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పుట్నాల సాయికుమార్, కో కన్వీనర్ సుబ్రహ్మణ్యం, పట్టణ అధ్యక్షులు సాయి మండల అధ్యక్షుడు వివేక్, జిల్లా నాయకులు మల్చల మురళి, చెట్ల వెంకటేష్, మట్టం ఋషికేష్, భూషణ్ పటేల్, శ్రీనివాస్ చారి, అందేల సందీప్, ఘటోజు విజయ్, వీ రవీందర్, శ్యాంసుందర్ అడ్వకేట్ పిట్టల సురేష్, మల్చలం రాము, మంగ విజయ్, రవి గౌడ్, ప్రభాకర్, రవీందర్, కొంకల మణికంఠ, విజయ్ శ్యాంసుందర్, బల్లరెడ్డి, సురేష్ వన్నాడ శివ, యాదగిరి, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.



## వర్కింగ్ జర్నలిస్టులందరికీ

# ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

### టీజేయూ మహిళ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకళ

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని టీజేయూ కార్యాలయంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ షానూర్ బాబా ఆదేశాల మేరకు టీజేయూ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కంది చంద్రకళ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు పేరుకు మాత్రమే ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చి పంపిణీకి నోచుకోక పోవడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రత్యేక చొరవ తీసుకొని అక్రిడేషన్ కార్డ్ ఉన్న లేకున్నా.. వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయిస్తూ వారికి మీ చేతుల మీదుగా పట్టాలు అందజేయాలని కోరారు. జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, టీజేయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మల్లేష్, టీజేయూ జిల్లా కార్యదర్శి గుర్రాల నాగరాజు, టీజేయూ గౌరవ అధ్యక్షుడు టీజేయూ జిల్లా సహాయ కార్యదర్శి నోముల రవీందర్ రెడ్డి, టీజేయూ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ అజీజ్, గొట్టిపర్తి శ్రీనివాస్, టీజేయూ మండల అధ్యక్షుడు గడ్డం నాగరాజు, టీజేయూ మండల కార్యదర్శి మేడి శ్రీనివాస్, టీజేయూ మండల కోశాధికారి కట్టెకోల రమేష్, టీజేయూ మండల కార్యవర్గ సభ్యుడు గుర్రం సురేష్, దంతూరి సుమలత తదితరులు పాల్గొన్నారు.

## గీత జ్ఞాన యజ్ఞం ప్రారంభం



**విశ్వంభర, మెట్పల్లి :** మెట్పల్లి అమృత టవర్స్ ఆధ్వర్యంలో 78వ గీత జ్ఞాన యజ్ఞం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ గీత ప్రబోధక్ శ్రీ చిలమందుల చత్రపతి మాట్లాడుతూ.. 14 రోజులపాటు నిర్వహించు గీత యజ్ఞంలో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ యజ్ఞంలో గీతా సత్సంగ్ వ్యవస్థాపకుడు గీతా సారాన్ని బోధిస్తారని, గీతను ఎలా చదవాలి, ఎలా అర్థం చేసుకోవాలి అనేదానిపై విపులంగా వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గీత సత్సంగ్ మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 6న కొత్తూరు తైబజార్ వేలం

**విశ్వంభర, కొత్తూరు :** ఈనెల 6వ తేదీన శనివారం కొత్తూరు మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు తైబజార్ వేలంపాట నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బాలాజీ ఓ ప్రకటనలో తెలిపారు. తై బజార్ వేలంపాటలో పాల్గొనేవారు ఈ నెల 4వ తేదీ నుంచి 5వ తేది సాయంత్రం వరకు రూ.10,000/వేలు డీడీతో పాటు రూ.2000 దరఖాస్తు ఫాంకు మున్సిపల్ కార్యాలయంలో చెల్లించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బాలాజీ కోరారు.

## డీఎస్సీ నియామకాలు జరిగే వరకు విద్యా వాలంటీర్లను నియమించాలి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** డీఎస్సీ నియామకాలు జరుగు వరకు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో తాత్కాలికంగా విద్యా వాలంటీర్లను నియమించి, బదిలీ కాబడిన సెకండరీ గ్రేడ్ టీచర్లందరినీ రిలీవ్ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా సాంస్కృతిక కమిటీ కన్వీనర్ కట్ట రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తేదీ 30 జూన్ 2024న పూర్తి కాబడిన సెకండరీ గ్రేడ్ టీచర్ ఉపాధ్యాయులను రిలీవ్ చేయు సందర్భంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బదిలీ కాబడిన సీనియర్ ఉపాధ్యాయులను రిలీవ్ చేసి, జూనియర్ ఉపాధ్యాయుల స్థానంలో మరొక ఉపాధ్యాయుడు వచ్చువరకు రిలీవ్ చేయకపోవడం వలన తదుపరి పాఠశాలలో సర్వీసును నష్టపోతారు. కావున బదిలీ కాబడిన ఉపాధ్యాయులను అందరిని రిలీవ్ చేసి డీఎస్సీ నియామకాలు జరుగు వరకు అవసరమైన స్థానాలలో తాత్కాలికంగా విద్యా వాలంటీలను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జూకంటి కరుణాకర్, జిల్లా కార్యదర్శి కొనతం శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు ఎలిమినేటి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓ కార్యాలయం ఎదుట

# మహిళల ధర్నా

**విశ్వంభర, దేవనకొండ :** గత ప్రభుత్వ హయాంలో ప్రకటించిన వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా మహిళలకు ప్రతి ఏటా ఇచ్చే చేయూత నిధులను తమకు రాలేదంటూ మండల కేంద్రానికి చెందిన మహిళలు మంగళవారం స్థానిక దేవనకొండ ఎంపీడీవో కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి మద్దతుగా మాజీ ఎంపిటిసి సభ్యులు ఎమ్ నరసరావు, సిపిఐ నాయకులు కండప్ప, అశ్వర్థామ, భాస్కర్, మధులు మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రస్తుత ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటూ తక్షణమే ఎవరైతే అర్హులు ఉన్నారో వారి ఖాతాలలో చేయూత నిధులను జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఈఓఆర్డి సూర్యనారాయణ, పంచాయతీ సెక్రెటరీ రుబిక, జూనియర్ అసిస్టెంట్ చరణ్ ఇచ్చారు. కార్యక్రమంలో చేయూత నిధులు పడని లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అట్టహాసంగా ప్రెస్ క్లబ్ ప్రారంభం



**విశ్వంభర, చింతపల్లి :** జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం చింతపల్లి మండల ప్రెస్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రెస్ అసోసియేషన్ సభ్యులు బాలునాయక్‌ను శాలువతో ఘనంగా సన్మానించారు. తదనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జర్నలిస్టులకు ఇచ్చిన హామీని నెరవేర్చుటకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వ స్థలాల్లో ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులతోపాటు వారి సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేయాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పత్రికలు కృషి చేయాలన్నారు. పత్రికలు వాటి ఔచిత్యాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రెస్ అసోసియేషన్ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండూరి భవాని పవన్ కుమార్, జడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు దొంతం సంజీవరెడ్డి, నాగభూషణం, ముచ్చర్ల గిరి, వైస్ ఎంపీపీ యాదిగౌడ్, వెంకట నరసింహారెడ్డి, నరేందర్ రావు, జితేందర్ రెడ్డి, వెంకటయ్య గౌడ్, కో ఆప్షన్ జాంగిర్, సలీం, రియాజ్ పాషా, గోవిందు రవి, చెట్లపల్లి ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, విద్యాసాగర్ రావు, వింజమూరు రవి, కుంభం శ్వేత, వివిధ పార్టీల నాయకులు, మండల ప్రజలు, ప్రెస్ అసోసియేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్కూళ్లలో పనిచేసే స్వీపర్లకు

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి



**విశ్వంభర, దేవనకొండ :** దేవనకొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్లకు గత ఐదు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడం చాలా దారుణమని ఏఐటియుసి మండల గౌరవ అధ్యక్షులు ఎం. నరసారావు, ఆయాలు స్వీపర్ల సంఘం మండల అధ్యక్షురాలు మహాదేవిలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో ప్రభుత్వ స్కూల్ మరియు పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్లు, ఆయాల డిమాండ్ల పరిష్కారం కోసం దేవనకొండ తహసిల్దార్‌కు మెమోరాండం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేద మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన కార్మికులు తమ పొట్టకూటి కోసం స్వీపర్లుగా విధులు నిర్వహిస్తూ ఉన్నారన్నారు. వారి యొక్క సేవలు వినియోగించుకుంటూ వారి సేవలకు తగ్గ వేతనాలను సకాలంలో చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో పనిచేసే ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అలాగే గ్రామాలలో ప్రభుత్వ స్కూళ్లలో పనిచేసే ఆయాలపై రాజకీయ వేధింపులు, ఒత్తిళ్లు చేస్తూ వారిని భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ స్కూల్లో పనిచేసే ఆయాలకు పెండింగ్లో ఉన్న ఐదు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కండప్ప, భాస్కర్, మధు, స్వీపర్ల ఆయాల సంఘం మండల ఏఐటీయూసీ నాయకులు గోవిందమ్మ, హసీనా, మహాదేవి, లక్ష్మీ, మారెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ




**విశ్వంభర, దేవనకొండ :** దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సమావేశం సందర్భంగా ఆదోని డిప్యూటీ డి.ఎంహెచ్.ఓ డాక్టర్ సత్యవతి హాజరై ఆశాలకు ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలకు నిర్దేశించిన టార్గెట్లను సకాలంలో పూర్తి చేయాలని అదేవిధంగా సీజనల్ వ్యాధుల గూర్చి పీఎస్‌సి సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఇందులో భాగంగా జిల్లా మలేరియా అధికారి నూకరాజు పిసి సిబ్బందిని ఉద్దేశించి జూలై మాసంలో వర్షాకాలం ఎక్కువగా ఉంటుందని దాని ప్రభావం వలన వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని కాబట్టి ఎప్పటికప్పుడు ఆశాలు ఇంటింటికి తిరిగి దోమలకు సంబంధించిన లార్వాలను సర్వే చేయాలని వారు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు విజయ్ కుమార్, కళ్యాణ్ సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, సూపర్వైజర్లు భాగ్యలక్ష్మి, రంగస్వామి, జయలక్ష్మి, హనుమంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన చివరి సర్వసభ్య సమావేశం

### ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బాలునాయక్



**విశ్వంభర, చింతపల్లి :** మండలంలోని ప్రజా ప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి పాటుపడాలని దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ కొండూరు భవానీ పవన్ అధ్యక్షతన నిర్వహించిన మండల చివరి సర్వసభ్య సమావేశం అట్టహాసంగా జరిగింది. అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడకుండా వైద్యశాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో విద్యుత్ సమస్యలు అధికంగా వుండంతో సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు సూచించారు. అనంతరం సర్పంచులకు చివరి సమావేశం కావడంతో ఎమ్మెల్యే బాలునాయక్, ఎంపీపీ కొండూరు భవానీ పవన్ కుమార్, వివిధ గ్రామాల ఎంపీటీసీలను శాలువా, పూలదండలు, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి, ఎంపీడీవో సుజాత, వైస్ ఎంపీపీ యాదిగౌడ్, పిఎసిఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, సిరాజ్ ఖాన్, రవి నాయక్, హరి నాయక్, ముచ్చర్ల యాదగిరి, ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి




విశ్వంభర, ఆత్మకూరు(ఎం) : ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం టిఆర్ఎస్వి కార్యదర్శి కూరెళ్ళ మణికుమార్ అన్నారు. ఆ రోజు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, 2 లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ఇచ్చిన మాటను నేడు విస్మరించారని అన్నారు. గ్రూప్2లో 2,000, గ్రూప్3లో 3,000 వరకు పోస్టుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. గ్రూప్1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరారు. డీఎస్సీలో టీచర్ పోస్టుల సంఖ్యను 25 వేలకు పెంచాలని, రూ.4,000 నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పద్మ నాయక వెలమసంఘం కార్యాలయ భూమి పూజ

**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో పద్మ నాయక వెలమ మర్రు వంశీయుల సంఘం కార్యాలయానికి ఆ సంఘం నాయకులు మంగళవారం భూమి పూజా నిర్వహించారు. త్వరలోనే కార్యాలయ ఏర్పాటు, ఫౌంక్షన్ హాల్ నిర్మాణ పనులు చెపడుతామని సంఘం నాయకులు అన్నారు. మర్రు వంశస్థుల ఆధ్వర్యంలో నిర్మాణం చేపడుతున్నట్టు కుల సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చలపతి రావు, ప్రధాన కార్యదర్శి మర్రు పాండు రంగారావు, వెలమకుల సంఘంనాయకులు, కమిటీ మెంబర్లు కులస్థులు పాల్గొన్నారు.





# పెరుగుతున్న కరోనా కేసులు

- ప్రజల్లో ఆందోళన
- వైరస్‌ను తరిమినా మళ్లీ కనిపించడంపై భయం
- కరోనా 2020 మాయని గాయమే

**విశ్వంభర, న్యూ ఢిల్లీ:** కరోనా తన ప్రభావం మెల్లగా పెంచుకుంటోంది. 2020 డిసెంబర్ లో కరోనా ప్రభావానికి ప్రపంచమే అతలాకుతలం అయింది. శానిటైజర్, క్వారంటైన్ లాంటి పద్ధతులు పాటించి ప్రజలు ఒత్తిడికి గురయ్యారు. ఆ మహమ్మారి వయసుతో సంబంధం లేకుండా అందరిని కబళించింది. ప్రస్తుతం సేద తీరుతున్న సమయంలో మళ్లీ కరోనా కేసులు పెరగడం ఆందోళనకు గురి చేస్తోంది. ఇక కరోనా పోయిందని అనుకుంటున్న తరుణంలో కేసులు ఎక్కువ కావడం ప్రజలను భయభ్రాంతులకు దగ్గర చేస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్ లో మళ్లీ కరోనా కలకలం పెరుగుతుందని చెబుతున్నారు. కరోనా టీకాలు వేసుకోవడంతో వైరస్ దాదాపుగా కనుమరుగైంది. ప్రజలంతా స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుని ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు. ఇలాంటి సమయంలో 1021 కేసులు నమోదు కావడం సంచలనం కలిగిస్తోంది. మంగళవారం కరోనా కేసుల సంఖ్య 13,037 గా నమోదయ్యాయని వైద్య ఆరోగ్య శాఖ వెల్లడిస్తోంది. దీంతో చాపకింద నీరులా విస్తరిస్తున్న కరోనా మళ్లీ ఏం ఉత్పాతం తెస్తుందోననే బెంగ అందరిలో పట్టుకుంది. యాక్టివ్ కేసుల సంఖ్య పెరుగుతుండటంతో ఏం చేయాలో పాలు పోవడం లేదని అధికార యంత్రాంగం పేర్కొంటోంది.



# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

## పోలీసులు, మావోయిస్టుల మధ్య కాల్పులు

## 11 మంది మావోయిస్టులు మృతి

**విశ్వంభర, ఛత్తీస్‌గఢ్ :** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా కుర్రేవాయ్ అటవీప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసులు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 11 మంది మావోయిస్టులు మృతి చెందారు. నారాయణపూర్ జిల్లా దండకారణ్యంలో మావోయిస్టుల కోసం పోలీసులు జల్లెడ పడుతున్న సంగతి తెలిసిందే. అబూజ్మడ్ దండకారణ్యంలో మావోయిస్టుల శిబిరాల సెర్చింగ్ చేసేందుకు 1400 మంది జవాన్లను మోహరింప జేశారు. ఈ క్రమంలో కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతాబలగాలకు మావోయిస్టులు మధ్య ఎదురుపడటంతో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో 11 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఈ విషయాన్ని నారాయణపూర్ ఐజీ సంజయ్ రాజ్ మీడియాకు తెలిపారు. ఐజీ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ లోని నారాయణపూర్ జిల్లాలో అంబూజ్‌మడ్‌లోని కోహ్‌కామెటా పోలీస్‌స్టేషన్ పరిధిలో భద్రతాబలగాలు కూంబింగ్ నిర్వహించాయి. అవతలివైపు నుంచి కాల్పులు మొదలవడంతో పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. ఈ క్రమంలో పోలీసులు, నక్సలైట్ల మధ్య మంగళవారం మధ్యాహ్నం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయి. భద్రతా సిబ్బంది సురక్షితంగా ఉన్నారని ఆయన చెప్పారు. జిల్లా రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులతో కూడిన ఈ ఆపరేషన్ సోమవారం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.

# కుదుపులకు గురైన ఎయిరిండియా విమానం





**విశ్వంభర, న్యూ ఢిల్లీ:** విమానం గాలిలో ఉండగా ఏదైనా జరిగితే భయం కలుగుతుంది. ఆకాశంలో ప్రయాణిస్తుండటంతో ఏం జరుగుతుందోననే బెంగ పట్టుకుంది. గుండె జబ్బు మనుషులైతే ఒత్తిడికి ప్రాణాలు పోవడం ఖాయం. అలాంటి ఘటనే మంగళవారం చోటు చేసుకుంది. దీంతో ప్రయాణికులు పరేషాన్‌కు గురయ్యారు. చివరకు ఏం కాకపో వడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఎయిరిండియా విమానం చేసిన పనికి అందరిలో ఒకటే టెన్షన్ పట్టుకుంది. మంగళవారం న్యూ ఢిల్లీ నుంచి సిడ్నీకి వెళ్తున్న విమానం టేకాఫ్ తీసుకున్న కాసేపటికి కుదుపులకు గురైంది. కానీ ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఎవరిని కూడా ఆస్పత్రిలో చేర్పించలేదు.

సిడ్నీలో ల్యాండ్ అయ్యాక అందరి ఆరోగ్య పరిస్థితి సవ్యంగానే ఉందని విమానయాన వర్గాలు తెలిపాయి. సంఘటనపై భయపడాల్సిన పనిలే దని చెప్పారు. విమానం ఒక్కసారిగా కుదుపుల కు గురికావడంతో ఏం జరుగుతుందోననే కంగా రు అందరిలో పట్టుకుంది. స్వల్ప గాయా లైన వారికి చికిత్స అందజేశారు. ప్రమాదంపై ఆం దోళన చెందాల్సిన అవసరం లేదని తెలిసింది.

# మా లక్ష్యం..

# ఆత్మనిర్భర్ భారత్ సాకారం

- కాంగ్రెస్ హయాంలో అన్ని రంగాల్లో స్కాములే
- సానుభూతి కోసం ఇప్పుడు కొత్త డ్రామాలు
- మీ అబద్ధాలకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పారు
- రిజర్వేషన్లకు వ్యతిరేకం కాంగ్రెస్ పార్టీనే
- మంచి చేశామనే ప్రజలు మూడోసారి అధికారం ఇచ్చారు
- కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ ధ్వజం



**విశ్వంభర, ఢిల్లీ:** గతంలో బొగ్గు విషయంలో అంతులేని అవినీతి జరిగేదని, 2014కి ముందు బొగ్గు కుంభకోణాలకు లెక్కే లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విమర్శించారు. లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని నరేంద్ర మోడీ సమాధానమిచ్చారు. తన ప్రసంగంలో అత్యధిక భాగం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. ఇతర రంగాల్లోనూ స్కాములు చోటుచేసుకున్నాయని తెలిపారు. 2014కి ముందు దోషులు చట్టం నుంచి తప్పించుకునేవారని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిందని, 2014 తర్వాత దోషుల ఇళ్ల వద్ద కూడా బుల్లెట్ల వర్షం కురిసిందని మోదీ అన్నారు. తాము వచ్చాక తీవ్రవాదంపై ఉక్కుపాదం మోపామని స్పష్టం చేశారు. ఎన్డీయే రాకతో బ్యాంకు ప్రతిష్ఠ పెరిగిందని వెల్లడించారు. తాము చేపట్టిన చర్యలతో ప్రపంచవ్యాప్తంగా మన బ్యాంకులపై విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు. కశ్మీర్ లోయలో 370 ఆర్టికల్ తొలగించాక అక్కడ శాంతిభద్రతల పరిస్థితి మెరుగైందని ప్రధాని మోడీ వివరించారు. 370 ఆర్టికల్ ఎత్తివేశాక జమ్మూ కశ్మీర్‌లో రాళ్ల దాడులు తగ్గిపోయాయని వెల్లడించారు. తాము వచ్చాక దేశంలో తుప్పు పట్టిన చట్టాలను రద్దు చేశామని తెలిపారు. దేశం మరింత ముందుకు వెళ్లాలని ప్రజలు కోరుకుంటున్నామని అన్నారు. ఎన్డీయే పదేళ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థను 10వ స్థానం నుంచి 5వ స్థానానికి తీసుకువెళ్లామన్నారు. మున్ముందు భారత్ ను మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చుతామని, అదే మా లక్ష్యం! ఆత్మనిర్భర్ భారత్‌ను సాకారం చేసుకుంటున్నామని చెప్పారు. సెల్ ఫోన్లను మనమే సొంతంగా తయారు చేసుకుంటున్నామన్నారు. చిప్స్, సెమీకండక్టర్ల ఉత్పాదనలో గణనీయమైన వృద్ధిని సాధించామన్నారు.

'దేశంలో పేదరిక నిర్మూలను కట్టుబడి ఉన్నాం. పేదలకు మరో 3 కోట్ల ఇళ్లు నిర్మిస్తున్నాం. మా పదేళ్ల పాలనలో మహిళా సంఘాలను బలోపేతం చేశాం. మూడు కోట్ల మంది మహిళలను లక్షాధికారులుగా మార్చాం. వచ్చే ఐదేళ్లలో మూడింతల వేగంతో పనిచేస్తాం. దేశ ప్రజలకు మూడింతల లబ్ధి చేకూర్చుతాం. మా పాలన బాగుందని, మేం చేస్తున్న పనులు ప్రయోజనకరంగా ఉన్నాయనే ప్రజలు ఎన్డీయే కూటమికి మూడోసారి అవకాశం ఇచ్చారు. లోక్ సభ ఎన్నికలతో పాటు జరిగిన 4 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎన్డీయే కూటమి సత్తా చాటిందన్నారు. ఒడిశాలో జగన్నాథస్వామి ఆశీస్సులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ లో మా కూటమి క్లీన్ స్వీప్ చేసింది. ఇలా అనేక రాష్ట్రాల ప్రజలు మా పాలన కోరుకుంటున్నారు. కేరళలోనూ మా పార్టీ ఖాతా తెరిచింది. తమిళనాడులోనూ మా ఓటు శాతం పెరిగింది. మహారాష్ట్ర, ఝార్ండ్, హర్యానా రాష్ట్రాల ప్రజలు మా వెంటే ఉన్నారు. ఈసారి కూడా కాంగ్రెస్ ను పక్కన కూర్చోవాలని ప్రజలు తీర్పు ఇచ్చారు. సభలో నినాదాలు చేయడమే మీ పని అని మూడోసారి కూడా కాంగ్రెస్‌కు దేశ ఓటర్లు నిర్దేశించారు. ప్రజలు ఇచ్చిన తీర్పుపై కాంగ్రెస్ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాల్సింది పోయి ఇంకా శీర్షాసనాలు వేస్తున్నారు. అర్థంపర్థంలేని నినాదాలతో కాంగ్రెస్ నేతలు కాలక్షేపం చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల ఆందోళనను, వృథా ప్రయాసను దేశ ప్రజలంతా చూస్తున్నారు. 99 సీట్లు వచ్చినందుకే కాంగ్రెస్ నేతలు స్వీట్లు పంచుకున్నారు. కాంగ్రెస్ కు వచ్చింది 100కి 99 సీట్లు కాదు... 543కి 99 సీట్లు.' వరుసగా మూడోసారి ఓడిపోయినా కూడా కాంగ్రెస్ లో మార్పు రాలేదు. దేశ ప్రజలు ఏం కోరుకుంటున్నారో ప్రతిపక్ష నేతలకు అర్థం కావడంలేదు. ఇకనైనా ప్రజా తీర్పును గౌరవించడం నేర్చుకోవాలని కాంగ్రెస్ నేతలను కోరుతున్నాను. కాంగ్రెస్ నేతల తీరు చూస్తుంటే ఎన్నికల ఫలితాలను వారు ఏమాత్రం సమీక్షించుకున్నట్టు కనిపించడం లేదు. బీజేపీ, కాంగ్రెస్ ముఖాముఖి పోరాటంలో కాంగ్రెస్ స్ట్రయిక్ రేట్ 26 శాతం మాత్రమే. పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ మిత్రపక్షాల స్ట్రయిక్ రేట్ 50 శాతంగా ఉంది. 16 రాష్ట్రాల్లో ఒంటరిగా పోటీ చేసిన కాంగ్రెస్ ఓట్ల శాతం దారుణంగా పడిపోయింది. మిత్రపక్షాలు చేసిన సాయం వల్లే కాంగ్రెస్ కు అన్ని సీట్లయినా వచ్చాయి. ఒంటరిగా పోటీ చేస్తే కాంగ్రెస్‌కు గతంలో వచ్చిన సీట్లే వచ్చేవి. 6 దశాబ్దాల కాంగ్రెస్ పాలన చూస్తే అరాచకం, అవినీతి తప్ప ఇంకేముంది? దేశం నలుమూలలా కాంగ్రెస్ పార్టీ విషం చిమ్మింది. భాషలు, ప్రాంతాలు, వర్గాల మధ్య కాంగ్రెస్ చిచ్చు పెట్టింది. కాంగ్రెస్ నిర్వాకంతో దేశ ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతింది.

కాంగ్రెస్ పెద్దల మనసులో ఒకటుంటే... పైకి మరొకటి చెబుతారు. ఇటీవల ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో హింస రాజేసేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్ నేతలు రాజకీయాలు ఏనాడూ దేశ హితం దిశగా సాగలేదు. ఇప్పుడు దేశ ప్రజల సానుభూతి కోసం కాంగ్రెస్ కొత్త డ్రామాలు మొదలుపెట్టింది. ఓబీసీ వర్గాలను కాంగ్రెస్ పార్టీ దొంగలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది. వీరసావర్కార్ పైనా కాంగ్రెస్ నేతలు విమర్శలు చేశారు. చిన్నపిల్లల చేష్టలను ప్రజలు పట్టించుకోరన్న విషయాన్ని కాంగ్రెస్ గ్రహిస్తే మంచిది. అబద్ధాలతో చేసే రాజకీయాలు ఎన్నాళ్లు కొనసాగుతాయి? మొదటి ఎన్నికల్లో ఈవీఎంలపై బురద చల్లారు... ఆ తర్వాత రాజ్యాంగం, రాఫెల్ యుద్ధ విమానాల డీల్, రిజర్వేషన్లపైనా దుష్ప్రచారం చేశారు. ఎల్‌ఐసీ, బ్యాంకులు, అగ్నివీర్ అంశాలపైనా అబద్ధాలు చెప్పారు. రైతులకు ఎంఎస్ పీ ఇవ్వడంలేదని తప్పుడు ప్రచారం చేశారు. ఇలాంటి అబద్ధాలను ప్రజలు నమ్ముతారనుకుంటే ఎలా? అందుకే కాంగ్రెస్ నేతల అబద్ధాలకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పారు. విపక్ష నేతల ప్రవర్తన సభ హుందాతనానికి తగినట్టుగా లేదు. వారు ఇకనైనా చిన్నపిల్లల మనస్తత్వం వీడాలి. పార్లమెంటులో ఇలాంటి ప్రవర్తన ప్రజాస్వామ్యానికి వన్నె తీసుకురాదు. ఎస్సీ, ఎస్టీ, ఇతర పీడిత వర్గాలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీల వ్యతిరేక పార్టీ అని అంబేద్కర్ ఆనాడే చెప్పారు. నెహ్రూ ప్రభుత్వ విధానాలు నచ్చక అంబేద్కర్ రాజీనామా చేశారు. అదే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అంబేద్కర్ ను ఓడించింది. జగజ్జీవన్ రామ్ ప్రధాని కాకుండా అడ్డుపడింది కూడా కాంగ్రెస్ పార్టీనే. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి రిజర్వేషన్లకు వ్యతిరేకం. నాడు రిజర్వేషన్లపై నెహ్రూ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు కూడా రాశారు. ఇప్పుడు దేశంలోని హిందువులపై దారుణమైన ఆరోపణలు చేస్తున్నారు. హిందూ ఉగ్రవాదం అనే మాటను ప్రచారం చేస్తున్నారు. హిందువులు ఎప్పుడూ హింసను ప్రోత్సహించరు... హిందువులు హింసకు వ్యతిరేకం. హిందువులను అవమానించిన కాంగ్రెస్ నేతలను ప్రజలు ఎన్నటికీ క్షమించరు. దేశంలో ప్రతి వ్యక్తి ఈశ్వర రూపంగా హిందువులు భావిస్తారు. కానీ, భక్తిశ్రద్ధలతో పూజించే దేవతలను, అమ్మవార్లను కాంగ్రెస్ నేతలు తూలనాడారు. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీశాయి. కాంగ్రెస్ నేతలు దేశ సైనిక వ్యవస్థను కూడా విమర్శిస్తున్నారు. సైనికుల మనోబలాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ వైఖరి ఉంది. రాఫెల్ యుద్ధవిమానాలు ఆటబొమ్మలని ఎగతాళి చేశారని' ప్రధాని మోడీ చెప్పుకొచ్చారు.



# ముఖేష్ అంబానీ హౌరా!

- నిరుపేద జంటలకు వివాహాలు
- అనంత్ అంబానీ పెళ్లికి మద్దతుగా వివాహాలు
- భారీగా బంగారు ఆభరణాలు గిఫ్ట్‌గా ఇచ్చిన అంబానీ

**విశ్వంభర, ముంబై:** రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముఖేష్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ - రాధిక మర్చంట్‌ల వివాహం జూలై 12న జరుగనుంది. వీరి వివాహం అంశం ప్రతి రోజు వార్తల్లో నిలుస్తూనే ఉంది. ముంబైలో జరగనున్న ఈ హై ప్రొఫైల్ వెడ్డింగ్‌కు ముందు చాలా ప్రీ వెడ్డింగ్ ఈవెంట్‌లు జరిగాయి. ఇదిలావుండగా, మంగళవారం అనంత్-రాధికల వివాహానికి ముందు అంబానీ కుటుంబం మహారాష్ట్రలోని థానేలో బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం గ్రాండ్‌గా సామూహిక వివాహాలను నిర్వహించింది. ముంబైకి 100 కిలోమీటర్ల దూరంలోని పాల్ఘర్ ప్రాంతానికి చెందిన 50 మందికి పైగా నిరుపేద జంటలకు అంబానీ కుటుంబం సామూహిక వివాహం కార్యక్రమాన్ని నిర్వహించింది అంబానీ కుటుంబం. థానేలోని రిలయన్స్ కార్పొరేట్ పార్క్‌లో వివాహ వేడుక జరిగింది. ఈ వేడుకకు జంటల కుటుంబాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సుమారు 800 మంది హాజరయ్యారు. ఈ వేడుకతో ప్రారంభించి రాబోయే పెళ్లిళ్ల సీజన్‌లో దేశవ్యాప్తంగా ఇలాంటి వందలాది వివాహాలకు మద్దతుగా కొనసాగిస్తామని అంబానీ కుటుంబం ప్రతిజ్ఞ చేసింది. ఈ వేడుకలో స్వయంగా ముఖేష్ అంబానీ తన భార్య నీతా కూడా పాల్గొన్నారు. దీనికి సంబంధించి అంబానీ కుటుంబం నుంచి ఓ కార్డు కూడా జారీ అయింది. పాల్ఘర్‌లోని స్వామి వివేకానంద విద్యా మందిర్‌లో తొలుత నిర్వహించిన ఈ సామూహిక వివాహాల తర్వాత థానేకి మార్చారు. ప్రతి జంటకు మంగళసూత్రం, పెళ్లి ఉంగరం, ముక్కుపుడకతో సహా బంగారు ఆభరణాలను బహుమతిగా అందజేశారు. వధువులకు కాలి ఉంగరాలు, వెండి ఆభరణాలు అందజేశారు. ఈ వేడుక సజావుగా ఎలాంటి అంతరాయం కలగకుండా జరిగేలా వేదికలో ఈ మార్పు చేశారు. ఈ సామూహిక వివాహ వేడుకకు ముఖేష్ అంబానీ, ఆయన భార్య నీతా అంబానీ హాజరయ్యారు. నీతా అంబానీ - ముఖేష్ అంబానీ తమ కుటుంబ సభ్యుల తో వివాహ వేడుకకు హాజరై దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాకుండా అదనంగా, ప్రతి వధువుకు రూ. 1.01 లక్షల చెక్కును అందించారు. ప్రతి జంటకు సంవత్సరానికి సరిపడా కిరాణా సామాగ్రి, గృహోపకరణాలు బహుమతిగా అందించారు. ఇందులో 36 రకాల నిత్యావసర వస్తువులు, పాత్రలు, గ్యాస్ స్టవ్, మిక్సర్, ఫ్యాన్ వంటి విద్యుత్ వస్తువులు ఉన్నాయి.



# ప్రధాని మోడీ ప్రసంగంలో పస లేదు

## కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ

**విశ్వంభర, ఢిల్లీ:** ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగంలో పసలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ మనీశ్ తివారీ విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ అనంతరం ప్రధాని నరేంద్రమోదీ లోక్‌సభలో సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా సుదీర్ఘ ప్రసంగం చేసిన ప్రధాని.. తన ప్రసంగమంతా కాంగ్రెస్ పార్టీని, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని విమర్శించడం, హేళన చేయడంతోనే సరిపుచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం లోక్‌సభ నిరవధిక వాయిదాపడిన అనంతరం బయటికి వచ్చిన మనీశ్ తివారీని మీడియా ప్రతినిధులు పలుకరించారు. ఈ సందర్భంగా ఆయన.. ప్రధాని ప్రసంగంలో పసలేదని అన్నారు. సుదీర్ఘంగా మాట్లాడిన ప్రధాని చైనా ఆక్రమణల గురించి మాట్లాడలేదని, జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద దాడుల ప్రస్తావన తేలేదని, కొత్తగా అమల్లోకి వచ్చిన క్రిమినల్ చట్టాల ఊసెత్తలేదని తివారీ విమర్శించారు. కేవలం కాంగ్రెస్ పార్టీని నిందించడం, రాహుల్‌గాంధీని హేళన చేయడానికే ప్రధాని ప్రసంగం సరిపోయిందని అన్నారు.



## సీఎంను కలిసిన బెల్జియం ప్రతినిధుల బృందం

**పెట్టుబడుల అవకాశాలపై సీఎం చంద్రబాబుతో చర్చ**

**విశ్వంభర, అమరావతి:** బెల్జియం దేశానికి చెందిన వాణిజ్య, పరిశ్రమల ప్రతినిధుల బృందం మంగళవారం అమరావతి విచ్చేసింది. భారత్‌లో బెల్జియం రాయబారి దిదీర్ వాండెర్ హాసెల్ట్ నేతృత్వంలో వచ్చిన బెల్జియం బృందం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయింది. దీనిపై సీఎం చంద్రబాబు సోషల్ మీడియా ద్వారా స్పందించారు. "బెల్జియం రాయబారి వాండెర్ హాసెల్ట్ నాయకత్వంలో వచ్చిన వాణిజ్య, పరిశ్రమల ప్రతినిధుల బృందంతో సమావేశమయ్యాను. ఏపీలో వ్యాపార వర్గాలకు అనుకూలంగా ఉండే వాతావరణాన్ని సృష్టించేందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వ్యాపారవేత్తలను ఆహ్వానిస్తున్నాం" అని సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. ఈ మేరకు బెల్జియం బృందంతో సమావేశం తాలూకు ఫొటోలను చంద్రబాబు పంచుకున్నారు.

## సెంట్రల్ జైల్లో సిబ్బందికి కనీస వసతులు లేవు

- గంజాయి కేసుల్లో చిన్న పిల్లలు ఖైదీలుగా ఉన్నారు
- హెూమంత్రి వంగలపూడి అనిత




**విశ్వంభర, విశాఖపట్నం :** సెంట్రల్ జైల్లో సిబ్బందికి కనీస వసతులు లేవని ఏపీ హెూంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. విశాఖ సెంట్రల్ జైలును సందర్శించారు. గంజాయి కేసులో జైలులో ఉన్న గంజాయి ఖైదీలను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న, చిన్న పిల్లలు గంజాయి కేసుల్లో ఖైదీలగా ఉన్నారని చెప్పారు. ఐదు, పది వేల రూపాయలు కోసం పిల్లలు గంజాయి ఖైదీలగా మారుతున్నారని చెప్పారు. గంజాయి స్మగ్లర్లు మాత్రం దర్జాగా తిరుగుతున్నారని, సెంట్రల్ జైల్లో గంజాయి డి అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని హెూంమంత్రి చెప్పుకొచ్చారు. త్వరలో అధికారులతో సమీక్ష నిర్వహించి, సిబ్బందికి మంచి చేస్తామన్నారు. ఖైదీలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నామని, వారి ఖైదీలకు ఆరోగ్యానికి పెద్దపీట వేస్తామని కూడా చెప్పారు. గంజాయి, డ్రగ్స్ విషయంలో ఉక్కుపాదం మోపుతామని పేర్కొన్నారు. త్వరలోనే ఆరిలోవ నూతన పోలీస్ స్టేషన్ అందుబాటులోకి రానుంది చెప్పారు. దిశ చట్టం లేదు.. దిశ పోలీస్ స్టేషన్ పేరు మార్పు చేస్తామన్నారు. అలాగే, హనుమంతువాక సిగ్నల్ వద్ద ట్రాఫిక్‌ను హెూం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా హనుమంతువాక ఏరియాలో ట్రాఫిక్ అధికంగా ఉంటుందని, గిరి ప్రదక్షణకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.. విశాఖలో ఒకే ఫ్లైఓవర్ ఉండడం దురదృష్టకరమన్నారు. త్వరలోనే విశాఖలో అవసరమైన ఫ్లై ఓవర్లు నిర్మిస్తామని, టూవీలర్స్ పై ప్రయాణించే ప్రయాణికులు హెల్మెట్ వినియోగించాలని సూచించారు. భద్రత కోసం హెల్మెట్ వాడాలని, చలనాలు కోసం కాదని హెూంమంత్రి అనిత వివరించారు.

## నేడు అమరావతిపై శ్వేతపత్రం

**శ్వేతపత్రం విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు**

**గతంలో జరిగిన నిర్మాణాలు, పెండింగ్ పనులపై వివరించే ఛాన్స్**




**విశ్వంభర, అమరావతి:** అమరావతి తాజా పరిస్థితి, భవిష్యత్ కార్యాచరణపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు శ్వేతపత్రం విడుదల చేయనున్నారు. మొన్న సచివాలయంలో పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఆ శాఖ ఉన్నతాధికారులతో పాటు సీఆర్డీఏ కమిషనర్‌తో ముఖ్యమంత్రి సమీక్షించారు. శ్వేతపత్రంలో పొందుపరచాల్సిన అంశాలపై కొన్ని సూచనలు చేశారు. కీలకమైన శాఖలు, ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న శ్వేతపత్రాల్లో ఇది రెండోది. పోలవరం ప్రాజెక్ట్ పై ఇప్పటికే మొదటి శ్వేతపత్రం విడుదల చేసింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలుత పోలవరం ప్రాజెక్ట్‌ను సందర్శించిన చంద్రబాబు ఆ తర్వాత రాజధానిలోనూ విస్తృతంగా పర్యటించారు. రాజధాని పనులను మళ్లీ పట్టాలెక్కించేందుకు చేపట్టాల్సిన చర్యలపై కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. రాజధాని అమరావతి నిర్మాణం పూర్తి చేసేందుకు చంద్రబాబు నడుం కట్టారు. ఇప్పటికే నిర్మాణ పనులను పరిశీలించారు. రాజధాని నిర్మాణ పనులు ఏ స్థాయిలో ఉన్నాయి అనే దానికి సంబంధించి పూర్తి నివేదికను తెప్పించుకునే పనిలో చంద్రబాబు ఉన్నారు. ఈ నేపథ్యంలో రెండో శ్వేతపత్రంగా రాజధాని అమరావతి నిర్మాణానికి సంబంధించి విడుదల చేయాలని చంద్రబాబు నిర్ణయించారు.

నిన్న దీనికి సంబం ధించి అధికారులతో రివ్యూ చేశారు. ఇప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించి వ్యవహా రాలను శ్వేతపత్రంలో పొందుపరిచారు. గతం లో జరిగిన నిర్మాణాలు, పెండింగ్ లో ఉన్న ప నులు, ఏయే పనులు ప్రధానంగా డ్యామేజ్ అయ్యాయి.. ఇలాంటి అంశాలను వైట్ పేపర్ లో పొందుపరిచినట్లు తెలుస్తోంది.

# ప్రజా సమస్యలపై డిప్యూటీ సీఎం స్పందన

- ఆడపిల్లల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- వేల మంది అమ్మాయిలు అదృశ్యమైనా గత ప్రభుత్వం పట్టించుకోలేదు
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- కాకినాడ కలెక్టరేట్ అధికారులతో సమీక్ష
- పెండింగ్ పనులు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ




**విశ్వంభర, కాకినాడ:** సుమారు 40 నుంచి 50 పంచాయితీలకు తాగునీటి సదుపాయం లేదని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్, పొల్యూషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ, అటవీ శాఖ అధికారులతో రివ్యూ చేసినట్లు తెలిపారు. జల జీవన మిషన్ కు సంబంధించి ఎన్ని పంచాయతీలకు నీరు అందించగలుగుతున్నాం అనే అంశాలపై సమీక్ష నిర్వహించామన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుండి ఒక సంవత్సరానికి సుమారు 1000 కోట్లు ఇసుక మీదే వస్తుందని, ఇసుక నుండి వచ్చిన ఆదాయంలో కొంత భాగం పంచాయతీలకు రావాల్సి ఉందని, అది రాలేదని పవన్ వెల్లడించారు. పంచాయతీలకు తిరిగి రావాల్సిన నిధులు రాలేదన్నారు. పంచాయితీల నుంచి సంపాదించిన డబ్బును తిరిగి పంచాయతీలకు ఇవ్వాలని, అది ఇవ్వకపోవడం వల్ల ఇలాంటి ఇబ్బందులు ఉన్నాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'పంచాయతీల మీద పూర్తి వివరాలు 48 గంటల్లో మీకు తెలియజేస్తాం. హోప్ ఐలాండ్ ఎకో టూరిజం పరంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. స్మార్ట్ సిటీకి సంబంధించి బాధ్యత కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ కి అప్పజెప్పాం. వాతావరణంలో మార్పులు రావడం వల్ల సముద్రం సంవత్సర సంవత్సరానికి ముందుకు వస్తోంది. దానికి నిదర్శనం ఉప్పాడ సముద్ర తీర ప్రాంతం. వాతావరణంలో కర్బన్ శాతాన్ని తగ్గించే విధంగా ప్రత్యేకంగా ఆలోచన చేసి పొల్యూషన్ తగ్గించే ప్రయత్నాలు ఎన్డీఏ ప్రభుత్వం చేస్తుంది. పొల్యూషన్ పెంచే ఫ్యాక్టరీలపై ఒక నివేదిక ఇవ్వాలని చెప్పా. 4 జిల్లాల్లో పొల్యూషన్ ఎక్కువగా ఉంది. మడ అడవులను రక్షించుకోవడం అత్యంత కీలకం. సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్ మెంట్‌ను కాపాడేందుకు, అభివృద్ధి చేసినందుకు ప్రయత్నం చేస్తున్నా. అన్ని గ్రామాలకు మంచి నీటి సరఫరా ఏ విధంగా ఇవ్వాలి అనే దానిపై దృష్టి పెట్టాం. గత ప్రభుత్వాలు పంచాయతీ నుంచి డబ్బులు తీసుకున్నాయి. కానీ, వారికి ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వడం లేదు. ఎక్కడా కూడా మ్యాచింగ్ గ్రాంట్స్ ఇవ్వలేదు. అసలు రావాల్సిన నిధులు ఏమేం ఉన్నాయి అనేదానిపై లోతైన దర్యాప్తు చేస్తున్నాం. 9 నెలలు క్రితం కిడ్నాప్ చేశారని ఒక తల్లి నా దగ్గరకు వచ్చి తెలియజేశారు. తేజస్విని అనే పాపని చదువుకుంటుంటే లవ్ ట్రాప్ చేసి తీసుకుని వెళ్ళిపోయారు. తీసుకెళ్లి 9 నెలలైందని ఆవేదన వ్యక్తం చేశారు. 48 గంటల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఆ పాప ఆచూకీని జమ్మూలో తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులు అద్భుతంగా పనిచేశారు. బెంగళూరు, కేరళ, జమ్మూలో పలు బృందాలుగా గాలింపు చర్యలు చేశారు. ప్రభుత్వం తలుచుకుంటే ఏదైనా చేయగలుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో 37 వేల మంది అమ్మాయిలు కనిపించకుండా పోయారు. నేను మనస్ఫూర్తిగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖను అభినందిస్తున్నా. ఆడపిల్లల తల్లిదండ్రులకు చెబుతున్నా. అమ్మాయిలు లవ్ ట్రాప్‌లో పడకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. ఇంతమంది ఆడపిల్లలు అదృశ్యమైతే దీనిపై ఒక స్పెషల్ కమిటీ ఎందుకు పెట్టలేదు? ఈ అంశాన్ని నేను క్యాబినెట్ లో కూడా మాట్లాడతా. అన్ని శాఖల్లోనూ ఉద్యోగుల సంఖ్యా బలం పెంచాలి. దాంతోపాటు పోలీసుల్లో కూడా సంఖ్యా బలం పెంచే విధంగా మా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌కి ఎవరొచ్చినా సుభిక్షంగా, సుఖంగా, సంతోషంగా ఉంటారని చెప్పి అనిపించుకోవాలి. మిస్సింగ్ కేసుల సంబంధించి ఒక ప్రత్యేకమైన సెల్‌ని ఏర్పాటు చేసేందుకు ఆలోచిస్తున్నామని పవన్ కళ్యాణ్ చెప్పారు.

## వైసీపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది

- ప్రజలకు స్వేచ్ఛ లేకుండా చేశారు
- ప్రజాస్వామ్య పద్ధతిలో జగన్ పాలన చేయలే
- రాజకీయ పార్టీల నాయకులపై కూడా తప్పుడు కేసులు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



**విశ్వంభర, విశాఖపట్నం :** వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇచ్చినప్పటికీ అభివృద్ధి చేయలేదు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందన సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. విశాఖ వేదికగా మూడు రోజుల పాటు సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు జరుగుతున్నాయి. మంగళవారం సమావేశాలకు ముఖ్య అతిథిగా జాతీయ కార్యదర్శి నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు. ఎన్నికల ఫలితాలపై సమీక్ష, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా చేశారని, ప్రశ్నించే గొంతు నొక్కేశారని విమర్శించారు. రాజకీయ పార్టీల నాయకులపై తప్పుడు కేసులు పెట్టారు అని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన చేయలేదని, అందుకే సంక్షేమ పథకాలు ఇచ్చిన ఘోరంగా ఓడిపోయారని కామెంట్స్ చేశారు. జగన్మోహన్ రెడ్డి ఎక్కడి పర్యటనకు వచ్చిన చెట్లు నరికేసి పర్యావరణ విధ్వాంసానికి పాల్పడ్డారు అని సీపీఐ నారాయణ పేర్కొన్నారు. న్యూట్రల్ స్టాండ్ తీసుకోవడం వలనే జగన్మోహన్ రెడ్డి ఓడిపోయారు అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. రాజకీయాలలో స్పష్టమైన వైఖరి ఉండాలి.. దొంగాటలు ఆడకూడదు.. అసెంబ్లీలో, పార్లమెంట్ లో చట్టం ప్రకారమే ప్రతిపక్ష హెూదా వస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఋషికొండాలో నిర్మించిన భవనాలు చూడటానికి ఎవరికి అనుమతి ఇవ్వలేదు.. నేను కోర్టు అనుమతితో నిర్మాణాలు పరిశీలించడానికి వెళ్ళాను.. విశాఖకు తలమానికమైన ఋషికొండాను వైసీపీ ప్రభుత్వం బొడిగుండు కొట్టేసింది.. నిజంగా టూరిజం కోసం అయితే ఋషికొండాలో అంత విలాసవంతమైన ప్యాలస్‌ను నిర్మించాల్సిన అవసరం లేదని నారాయణ అన్నారు. తానే ముఖ్యమంత్రిగా ఉంటానని ఋషికొండాలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి విలాసవంతమైన భవనాలు నిర్మించుకున్నారు అని సీపీఐ నారాయణ పేర్కొన్నారు. ఋషికొండాపై నిర్మాణాలకు పెట్టిన డబ్బులు పోలవరం ప్రాజెక్ట్ పై పెట్టివుంటే బాగుండేది.. జగన్మోహన్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు.. ప్రజాధనంపై బాధ్యతా రహితంగా వ్యవహరించారు.. తప్పక జగన్మోహన్ రెడ్డి శిక్ష అనుభవించాల్సిందేనని నారాయణ పేర్కొన్నారు.



## నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు


- మోడీ, నిర్మలా సీతారామన్‌లతో భేటీ
- ఏపీకి భారీ నిధులు కోరే అవకాశం

**విశ్వంభర, అమరావతి:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన ఖరారైంది. ముఖ్యమంత్రి హెూదాలో ఆయన నేడు హస్తిన పర్యటనకు వెళుతున్నారు. ఈ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను కలిసే ఛాన్స్ ఉంది. ఇక, వారితో భేటీలో రాష్ట్ర అభివృద్ధిపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. అలాగే, మరికొందరు కేంద్ర మంత్రులతో కూడా ఏపీ సీఎం భేటీ అయ్యే అవకాశం ఉంది. అందుబాటులో ఉన్న కేంద్రమంత్రులతో సమావేశమై రాష్ట్రానికి అవసరమైన నిధుల విషయంలో వారితో చర్చిస్తారని సమాచారం. రాష్ట్రం పూర్తిగా అప్పుల్లో కూరుకుపోవడంతో దీనిని గాడిన పడేయాలంటే కేంద్ర సర్కార్ నుంచి సహకారం అవసరం అని భావించిన సీఎం చంద్రబాబు.. అనేక విషయాల్లో మోడీ సర్కార్ నుంచి నిధులను తెచ్చుకోవడమే కాకుండా రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులపై కూడా ప్రధానంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ సాయాన్ని కోరేందుకే చంద్రబాబు ఈ టూర్ పెట్టుకున్నట్లు తెలుస్తుంది. ఈ ఐదేళ్లలో రెండు ప్రాజెక్టులు పూర్తి అయ్యేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందిస్తున్నాం.. దానికి కావాల్సిన నిధుల కోసమే కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు సమాచారం. త్వరలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్ విషయంలోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పట్ల సానుకూలంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరే అవకాశం ఉంది. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి పెద్దపీట వేస్తూ నిర్ణయాలు తీసుకోవాలని కోరే ఛాన్స్ ఉంది. దీనివల్ల ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో సానుకూలత వస్తుందని, డబుల్ ఇంజిన్ సర్కార్ ప్రభావం పని చేసిందని ప్రజలు భావించే ఛాన్స్ ఉందనే విషయాన్ని ప్రధాని నరేంద్ర మోడీకి చంద్రబాబు చెప్పే అవకాశం ఉంది. కేంద్రం ఈసారి బడ్జెట్ లో పోలవరం, అమరావతిలకి సంబంధించి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తే ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తారని కూడా సూచించనున్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లు పూర్తి

- నామినేషన్లు దాఖలు చేసిన హరిప్రసాద్, రామచంద్రయ్య
- ఏకగ్రీవంకానున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నిక

**విశ్వంభర, అమరావతి:** ఏపీలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల ఎన్నికలకు మంగళవారం కూటమి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందుకు సంబంధించి టీడీపీ తరుపున, మాజీ మంత్రి రామచంద్రయ్య, జనసేన తరుపున హరిప్రసాద్‌లను ఖరారు చేస్తూ.. సోమవారం జాబితా విడుదల చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎమ్మెల్సీలుగా ఉన్న సి.రామచంద్రయ్య, షేక్. మహ్మద్ ఇక్బాల్ వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. దీంతో ఇక్బాల్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయగా.. రామచంద్రయ్యపై అనర్హత వేటు పడింది. దీంతో ఖాళీ అయిన రెండు ఎమ్మె ల్సీ స్థానాలకు ఈనెల 12న ఉప ఎన్నిక జరగనుంది. దీంతో టీడీపీ నేత రామచంద్ర య్యకు ఎన్డీయే కూటమి మరోసారి అవకాశం కల్పించింది. జనసేన నుంచి పవన్ కల్యాణ్ రాజకీయ కార్యదర్శిగా ఉన్న పి.హరి ప్రసాద్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. దీంతో వారు మంగళ వారం నామినేషన్లు దాఖలు చేశారు. ఇతర పార్టీల నుంచి నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఎమ్మెల్సీగా నామినేషన్ దాఖలు వారు మీడియాతో మాట్లాడారు. పాత్రికేయుడిగా ప్రయా ణం మొదలుపెట్టి ఇక్కడ వరకు వచ్చానని హరిప్రసాద్ అన్నారు. ఈ అవకాశం ఇచ్చిన అధినేత పవన్ కళ్యాణ్‌కి రుణపడి ఉంటానని, ఆయన సూచనకు అంగీకరించారని చెప్పారు. సీఎం చంద్రబాబు, లోకేశ్‌కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. పాత్రికేయుడిగా అనేక సమస్యలమీద పరోక్షంగా పోరాటం చేశానని, ఇప్పుడు ప్రత్యక్షంగా ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. మండలిలో జనసేన తరఫున మొదటిసారి అడుగుపెడుతున్నానని, ఎమ్మెల్సీగా తనకు అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీగా బాధ్యతలు మరోసారి అప్పగించినందుకు చంద్రబాబుకు రామచంద్రయ్య ధన్యవాదాలు తెలిపారు. గతంలో రాక్షస పాలన నచ్చక బయటకు వచ్చానని విమర్శించారు. కార్యకర్తల సాధకబాధలు తెలిసిన వ్యక్తి చంద్రబాబు నాయుడని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నంగా ఉందని, దాన్ని ట్రాక్ పై పెట్టగల వ్యక్తి చంద్రబాబు అని నమ్ముతున్నానని రామచంద్రయ్య విశ్వాసం వ్యక్తం చేశారు.



# నేను సంతోషంగా భావిస్తున్నా

- రోహిత్ శర్మకు థ్యాంక్స్
- టీమిండియా హెడ్ కోచ్ ద్రవిడ్

**విశ్వంభర, స్పోర్ట్స్:** టీమిండియా హెడ్ కోచ్, దిగ్గజం రాహుల్ ద్రవిడ్ గంభీరంగా ఉంటూ భావోద్వేగాలను ఎక్కువ శాతం ప్రదర్శించరు. అయితే, గత వారం జూన్ 29న టీ20 ప్రపంచకప్ 2024 టైటిల్‌ను భారత్ కైవసం చేసుకున్నాక ద్రవిడ్ ఉప్పొంగిపోయారు. విరాట్ కోహ్లీ తీసుకొచ్చి చేతికి టైటిల్ అందించాక ద్రవిడ్ గట్టిగా అరిచారు. సంబరాలు చేసుకున్నారు. ప్లేయర్‌గా ఎంతో అద్భుతంగా ఆడినా మూడుసార్లు ద్రవిడ్‌కు ప్రపంచకప్ దక్కలేదు. హెడ్ కోచ్‌గా మూడో ప్రయత్నంలో ప్రపంచకప్ దక్కింది. ప్లేయర్‌గా అందని ప్రపంచకప్ టైటిల్.. కోచ్‌గా అయినా రావడంతో ద్రవిడ్ చాలా సంతోషం వ్యక్తం చేశారు. గతేడాది వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్‌లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓడిపోయాక హెచ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ చాలా ఫీలయ్యారు. కోచ్‌గా పదవీకాలం ముగియడంతో కాంట్రాక్ట్ కాలాన్ని పొడిగించుకునేందుకు ఇష్టపడలేదు. అయితే, గతేడాది నవంబర్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ



చేసిన ఓ ఫోన్ కాల్‌తో కోచ్‌గా కొనసాగేందుకు ఆయన అంగీకరించారు. ఆ విషయాన్ని రాహుల్ ద్రవిడ్ ఇప్పుడు స్వయంగా వెల్లడించారు. టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై గెలిచాక భారత జట్టును ఉద్దేశించి ద్రవిడ్ ఎమోషనల్ స్పీచ్ ఇచ్చారు. హెడ్ కోచ్ పదవి నుంచి తప్పుకోనుండటంతో తన అనుభవాలను పంచుకున్నారు. ఈ వీడియోను బీసీసీఐ మంగళవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

### ద్రవిడ్ ఏం చెప్పారంటే!

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మకు రాహుల్ ద్రవిడ్ థ్యాం క్స్ చెప్పారు. గతేడాది నవంబర్‌లో కాల్ చేసి కోచ్‌గా కొన సాగేందుకు ఒప్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. 'నవంబర్‌లో కాల్ చేసి కొనసాగాలని నన్ను అడిగినందుకు చాలా థ్యాంక్స్ రో (రోహిత్ శర్మ). రోహిత్‌తో పాటు మీ అందరితో కలిసి పని చేసినందుకు నేను చాలా గౌరవంగా, సంతోషంగా భావిస్తున్నా. టైమ్ ఇచ్చినందుకు ధన్యవాదా లు. కెప్టెన్, కోచ్‌గా మేం ఇద్దరం చాలాసార్లు మాట్లాడుకు న్నాం. కొన్నిసార్లు పరస్పరం అంగీకరించుకున్నాం. కొన్ని నిర్ణయాలను విభేదించుకున్నాం. మీ అందరి గురించి తెలు సుకోవడం సంతోషంగా ఉంది' అని ద్రవిడ్ అన్నారు.



## అందుకే మట్టి తిన్నా

### టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ

**విశ్వంభర, స్పోర్ట్స్:** టీమిండియా 13 ఏండ్ల నిరీక్షణకు తెరదించిన కెప్టెన్ రోహిత్ శర్మ ఇప్పుడు మేఘాల్లో తేలిపోతున్నాడు. తన కెప్టెన్సీలో తొలి ఐసీసీ వరల్డ్ కప్ ట్రోఫీ విజయాన్ని ఎంజాయ్ చేస్తున్నాడు. ఇక ఆన్‌లైన్‌లో తన ఫోటో వైరల్ కావడంపై హిట్‌మ్యాన్ స్పందించాడు. 'కెన్నింగ్‌టన్ ఓవల్ పిచ్ మట్టిని తినాలని ముందుగా అనుకోలేదు. కానీ, ఆ క్షణం ఎందుకో అలా చేయాలనిపించింది. మ్యాచ్ అనంతరం పిచ్ దగ్గరికి వెళ్లాను. మాకు ట్రోఫీ అందించిన పిచ్ అది. అందుకని ఆ మైదానాన్ని, ఆ పిచ్‌ను జీవితాంతం గుర్తు పెట్టుకుంటా. అందుకనే ఈ విజయానికి జ్ఞాపకంగా పిచ్ మట్టిని టేస్ట్ చేశాను' అని రోహిత్ వెల్ల డించాడు. వరల్డ్‌కప్ ట్రోఫీతో యావత్ దేశాన్ని సంబురాల్లో ముంచిన రోహిత్ సేన ఆలస్యంగా భారత్‌కు రానుంది. బెరిల్ తుఫాన్ కారణంగా బార్బడోస్‌లోనే చిక్కుకుపోయిన భారత జట్టు జూన్ 3 బుధవారం స్వదేశానికి రానుంది.

# జింబాబ్వేకు టీమిండియా పయనం

- జింబాబ్వే, టీమిండియా మధ్య 5 టీ20ల మ్యాచ్‌ల సిరీస్
- జూలై 6 నుంచి ప్రారంభం



**విశ్వంభర, స్పోర్ట్స్:** టీ20 సిరీస్ కోసం టీమిండియా జింబాబ్వే పయనమైంది. మంగళవారం ఉదయం టీమిండియా ఆటగాళ్లు జింబాబ్వేకు బయల్దేరినట్టు బీసీసీఐ వెల్లడించింది. ఫొటోలను బోర్డు సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్, రుతురాజ్ గైక్వాడ్, అవేశ్ ఖాన్, రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, తుషార్ దేశ్‌పాండే జింబాబ్వేకు వెళ్లిన వారిలో ఉన్నారు. హెడ్ కోచ్‌గా ద్రవిడ్ పదవీకాలం ముగియగా.. కొత్త కోచ్ శ్రీలంక పర్యటనతో జట్టుతో కలుస్తాడని బీసీసీఐ సెక్రెటరీ జై షా తెలిపారు. జింబాబ్వే టూరుకు జట్టుతో ఎన్‌సీఏ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ వెళ్తాడని చెప్పారు. భారత ఆటగాళ్లతో లక్ష్మణ్ సైతం జింబాబ్వేకు పయనమయ్యాడు. అయితే, బీసీసీఐ రిలీజ్ చేసిన ఫొటోల్లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కనిపించలేదు. దీంతో జట్టుతో అతను వెళ్లాడా?లేదా? అన్నది తెలియదు. టీ20 ప్రపంచకప్ జట్టుకు గిల్ రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపికైన విషయం తెలిసిందే. అమెరికాలో భారత్ మ్యాచ్‌లు ముగిసిన తర్వాత టీమ్ మేనేజ్‌మెంట్ అతన్ని రిలీజ్ చేసింది. అతను స్వదేశానికి రాలేదని తెలుస్తోంది. అమెరికా నుంచే అతను నేరుగా హరారేకు వెళ్తాడని వార్తలు వస్తున్నాయి. టీ20 ప్రపంచకప్ జట్టు సభ్యులు శివమ్ దూబె, సంజూ శాంసన్, యశస్వి జైశ్వాల్‌తోపాటు రిజర్వ్ ప్లేయర్లు రింకు సింగ్, ఖలీల్ అహ్మద్ జింబాబ్వే టూరుకు ఎంపిక అయ్యారు. అయితే, బెరిల్ హరికేన్ కారణంగా వారు బార్బడోస్‌లోనే చిక్కుకుపోయారు. దూబె, శాంసన్, యశస్వి జైశ్వాల్ స్థానాల్లో తొలి రెండు టీ20ల కోసం సాయి సుదర్శన్, జితేశ్ శర్మ, హర్షిత్ రాణాలను బీసీసీఐ జట్టులో చేర్చింది. దూబె, శాంసన్, జైశ్వాల్ ఇంటికి వచ్చిన తర్వాత హరారేకు వెళ్తారని పేర్కొంది. అయితే, ఖలీల్ అహ్మద్, రింకు సింగ్‌పై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.


# ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నా..

- ఈ బాధను వర్ణించలేకపోతున్నాను
- సౌతాఫ్రికా స్టార్ బ్యాటర్ డేవిడ్ మిల్లర్

**విశ్వంభర, స్పోర్ట్స్:** టీ20 ప్రపంచకప్ 2024 ముగిసి రెండు రోజులు అవుతున్నా తమ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నానని సౌతాఫ్రికా స్టార్ బ్యాటర్ డేవిడ్ మిల్లర్ అన్నాడు. గత శనివారం జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో సౌతాఫ్రికా 7 పరుగుల తేడాతో టీమిండియా చేతిలో ఓడిన విషయం తెలిసిందే. ఆఖరి ఓవర్‌లో సఫారీ విజయానికి 16 పరుగులు అవసరమవ్వగా.. డేవిడ్ మిల్లర్ తొలి బంతికే ఔటయ్యా డు. భారీ సిక్సర్ కొట్టే క్రమంలో సూర్యకుమార్ యాదవ్ సెన్సేషనల్ క్యాచ్‌కు వెనుదిరిగాడు. డేవిడ్ మిల్లర్ నాటౌట్‌గా నిలిచినా.. ఆ బంతి సిక్సర్‌గా వెళ్లినా.. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా సునాయసంగా విజయం సాధించేది. ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత తొలిసారి ఫైనల్ చేరిన సఫారీ టీమ్.. తృటిలో టైటిల్‌ను చేజార్చుకుంది. ఈ పరాజయం అనంతరం డేవిడ్ మిల్లర్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. ఓటమిని తట్టుకోలేక కన్నీటి పర్యంతమయ్యాడు. తన సతీమణి భుజాలపై తలపెట్టి ఏడ్చాడు. ఇందుకు సంబంధించిన



ఫొటోలు వీడియోలు వైరల్ అయ్యాయి. తన వల్లే సౌతాఫ్రికా ఓడిందనే బాధ అతన్ని బాగా వెంటాడుతోంది. తాజాగా తమ పరాజయంపై సోషల్ మీడియా వేదికగా స్పందించిన డేవిడ్ మిల్లర్.. ఈ బాధను వర్ణించలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. 'నేను తీవ్ర నిరాశకు గురయ్యాను. ఫైనల్ ముగిసి రెండు రోజులు గడిచినా.. ఈ ఓటమిని జీర్ణించుకోవడం చాలా కష్టంగా ఉంది. ఈ బాధను వర్ణించలేకపోతు న్నాను. ఈ టోర్నీలో మా జట్టు కనబర్చిన పోరాటం పట్ల గర్వంగా ఉ ంది. ఈ నెలలో ఎన్నో ఒడి దొడుకులు మధ్య మా జట్టు ప్రయాణం అద్భుతంగా సాగింది. మేం ఎంతో బాధను భరించాం. కానీ ఈ జట్టు అద్భుతంగా పుంజుకుంటుందనే నమ్మకం నాకుంది.'అని డేవిడ్ మిల్లర్ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఈ టోర్నీలో సౌతాఫ్రికా అద్భుత ప్రదర్శన కనబర్చింది. ఓటమెరుగని జట్టుగా ఫైనల్ చేరింది. గతంలో ఏడు సార్లు సెమీఫైనల్లో ఓడిన సౌతా ఫ్రికా.. ఈసారి సంచలన ప్రదర్శనతో ఫైనల్‌కు అర్హత సాధించింది. కానీ ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది.



## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

### ముంచిన ఆ రెండు రంగాలు..

**విశ్వంభర, బిజినెస్ :** దేశీయ స్టాక్ మార్కెట్లు ఉదయం నుంచి తిరోగమనాన్ని కొనసాగించి చివరికి నష్టాల్లోనే ట్రేడింగ్ ముగించాయి. ప్రధానంగా దీనికి ఓలటాలిటి కారణంగా నిపుణులు చెబుతున్నారు. సాయంత్రం మార్కెట్లు ముగింపు సమయంలో బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ 35 పాయింట్లు నష్టపోగా.. మరో కీల క సూచీ నిఫ్టీ 18 పాయింట్లు నష్టపోయింది. ఇదే క్రమంలో నిఫ్టీ బ్యాంక్ సూచీ 407 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీలో 438 పాయింట్ల నష్టంతో నేడు ట్రేడింగ్ ముగించాయి. అయితే నేడు ఇంట్రాడేలో మార్కెట్లో ఐటీ రంగానికి చెంది న షేర్లు సూచీల నష్టాలను తగ్గించటంలో దోహదపడ్డాయి. అలాగే అంత ర్జాతీ యంగా మార్కెట్లలో సానుకూలత ఉన్నప్పటికీ బ్యాంకింగ్, ఆటో రంగాల షేర్లు సూచీలను నష్టాల్లోకి లాగాయి ఎన్ఎస్ఈలో ఎల్‌టి, విప్రో, ఇన్ఫోసిస్, టాటా కన్జ్యూమర్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఓఎన్జీసీ, కోల్ ఇండియా, గ్రాసిమ్, హిందాల్కో, టీసీఎస్, సిప్లా, హెచ్సీఎల్ టెక్నాలజీస్, ఎల్ టిఐఎమ్, పవర్ గ్రిడ్, టాటా స్టీల్, ఎన్టీపీసీ, రిలయన్స్, డాక్టర్ రెడ్డీస్, సన్ ఫార్మా, బజాజ్ ఫిన్ సర్వ్ కంపెనీల షేర్లు లాభాలతో మార్కెట్ల ముగింపు సమయంలో టాప్ గెయినర్లుగా నిలిచాయి. ఇదే క్రమంలో శ్రీరామ్ ఫైనాన్స్, కోటక్ బ్యాంక్, ఎయిర్ టెల్, టాటా మోటార్స్, ఇం డస్ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, హెచ్డీఎఫ్సీ లైఫ్, బ్రిటానియా, బజాజ్ ఆటో, అదానీ ఎంటర్ ప్రైజెస్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్, హీరో మోటార్స్, నెస్లే, ఐటీసీ, హిందుస్థాన్ యూనీలివర్, ఎస్బీఐ లైఫ్, మారుతీ కంపెనీల షేర్లు నష్టాలతో టాప్ లూజర్లుగా నేడు తమ ప్రయాణాన్ని ముగించాయి.

# 5 శాతం వడ్డీకే రూ.3లక్షలు లోన్..

**విశ్వంభర, బిజినెస్ :** దేశంలోని అన్ని వర్గాల వారికి తక్కువ వడ్డీ రేట్లకు అవసరమైన రుణాలను అందించాలని చాలా కాలంగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అనేక పథకాలను తీసుకొస్తోంది. ఇవి ప్రజలను సొంత కాళ్లపై నిలబడి ఉపాధిని పొందేందుకు వీలు కల్పిస్తున్నాయి. ఇప్పుడు మనం మాట్లాడుకోబోతున్నది ప్రధానిగా నరేంద్ర మోదీ రెండవ టర్మ్‌లో అధికారంలో ఉన్నప్పుడు పేద వర్గాలకు నేరుగా ప్రయోజనం కలిగించే అనేక స్కీమ్స్ తీసుకొచ్చారు. వాటిలో ప్రజలను ప్రస్తుతం ఆకట్టుకుంటున్న పీఎం విశ్వకర్మ స్కీమ్ గురించే. దీనిని ప్రధాని మోదీ సెప్టెంబర్ 17, 2023న ప్రకటించారు. ఇప్పటి వరకు ఈ స్కీమ్ కింద లబ్ధి పొందేందు కు దాదాపు 13 లక్షల మంది నమోదు చేసుకున్నట్లు గణాం కాలు చెబుతున్నాయి. చేతులు, పనిముట్లతో పనిచేసే చేతివృ త్తుల వారితో సహా 18 వ్యాపారాలు ఈ స్కీమ్ పరిధిలో చేర్చ బడ్డాయి. దీనికింద వడ్రంగులు, పడవ తయారీదారులు, ఆయుధ తయారీదారులు, కమ్మరి, పనిముట్లను తయారు చేసేవారు, తాళాలు వేసేవారు, స్వర్ణకారులు, కుమ్మరులు, శిల్పులు, రాళ్లను విరగొట్టేవారు ఉన్నారు. అలాగే చెప్పులు కుట్టేవారు, మేస్త్రీలు, బుట్టలు అల్లేవారు, సాంప్రదాయం బొమ్మల తయారీదారులు, బార్బర్‌లు, దండలు తయారు చేసేవారు, చాకలివారు, టైలర్లు, ఫిషింగ్ వల తయారీలో ఉ న్న వారికి స్కీమ్ వర్తిస్తుంది. గతంలో మోదీ ప్రకటించిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద అర్హులైన చేతిపనుల వారు రూ.3 లక్షల వరకు రుణాన్ని పొందవచ్చు. ఇక్కడ విశేషం ఏమిటంటే రుణం ఎలాంటి పూచీకత్తు లేకుండా ఇవ్వబడుతుంది. లోన్ 18 నెలలు, 30 నెలల కాలవ్యవధికి 5 శాతం స్థిర రాయితీ వడ్డీ రేటుతో రూ.లక్ష, రూ.2 లక్షలు అనే రెండు విడతలుగా అందించబడుతుంది. ముందుగా ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదారులు రూ.లక్ష వరకు తొలి విడత రుణ సహాయాన్ని అందుకునేందుకు అర్హులు. దీనికి సక్రమంగా చెల్లింపులు చేపట్టే లబ్ధిదారులు రెండవ విడత రుణాన్ని పొందవచ్చు. ఇక్కడ సదరు వ్యక్తులు తమ




వ్యాపారంలో డిజిటల్ లావాదేవీలను అనుసరించటం తప్పనిసరని గుర్తుంచుకోవాలి.

## ఉద్యోగులను తొలగించిన టాటా సంస్థ..

### రంగంలోకి దిగిన రతన్ టాటా

**విశ్వంభర, బిజినెస్ :** రతన్ టాటాకు ఉన్న మంచి మనసు గురించి ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో వార్తలు వస్తూనే ఉంటాయి. ఎవరైనా ఇబ్బందుల్లో ఉన్నారని తెలిస్తే సాధ్యమైనంత వరకు వారిని ఆదుకోవాలని ప్రయత్నిస్తారు. దేశ వ్యాప్తంగా లేఆఫ్స్ కొనసాగుతున్న వేళ కూడా తన కంపెనీలలో ఎవరినీ ఉద్యోగం నుంచి తొలగించకూడదని నిశ్చయించుకున్నారు. తాజా గా మరోసారి ఆయన గురించిన ఓ వార్త వైరల్ గా మారింది. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ జూన్ 28న 115 మంది సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. 55 మంది ఫ్యాకల్టీతో పాటు 60 మంది బోధనే తర సిబ్బంది తొలగింపును నిలిపివేస్తున్న ట్లు టాటా ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆదివారం ప్రకటించింది. ఈ మేరకు ఫైనాన్షియల్ గ్రాంట్లను పొడిగించేందుకు రతన్ టాటా అంగీకరించినట్లు సమాచారం. 'ఈ సమస్యను పరిష్కరించడంలో టాటా ఎడ్యుకేషన్ ట్రస్ట్‌తో చర్చలు కొనసాగాయి. ప్రాజెక్ట్, ప్రోగ్రామ్ ఫ్యాకల్టీ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్‌ల వేతనాలకు సంబంధించి



నిధులు విడుద ల చేస్తామని టీఈటీ హామీ ఇచ్చింది' అని టీఐఎ స్ఎస్ పేర్కొంది. సదరు సిబ్బంది తమ పనిని కొనసాగించాలని కోరింది. అయితే టీఈటీ నుంచి గ్రాంట్ విడుదలైన తర్వాత వారి జీతాలు చెల్లించనుంది. టాటా ఎడ్యుకేషన్ ట్రస్ట్ నుంచి గ్రాంట్‌ల కొరత కారణంగా టీఐఎస్ఎస్ ఉద్యోగులను తొలగించింది. గత 6 నెలలుగా టీఈటీనుంచి నిధుల కోసం ప్రయత్నిస్తున్నామని, సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో కార్యకలాపాలను కొనసాగించడంలో ఇబ్బందు లు ఎదుర్కొంటు న్నామని తెలిపింది. టీఐఎస్ఎస్లో శాశ్వత అధ్యాపకులు యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ పేరోల్ క్రింద ఉన్నారు.

## బ్యాంకింగ్ రంగంపై కేంద్రం ఫోకస్..

### 2019 డెసిషన్ మరోసారి రిపీట్

**విశ్వంభర, బిజినెస్ :** బ్యాంకింగ్ రంగంలో సమూల మార్పులకు నరేంద్ర మోదీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొదటిసారి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంస్కరణలపై ఫోకస్ పెట్టింది. పలు బ్యాంకుల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటూ రెండు దఫాలుగా ముందుకు సాగింది. అయితే ఇదే రంగంలో త్వరలో మరో బిగ్ అప్‌డేట్ వస్తుందని పరిశ్రమ విశ్లేషకులు భావిస్తున్నారు.రెండోసారి ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. 4 చిన్న బ్యాంకుల విలీనానికి పనులు చకచకా జరిగిపోతున్నట్లు సమాచారం. ఇందుకోసం బ్యాంకింగ్ రెగ్యులేషన్ సవరణ చట్టంలో మార్పులు చేసేందుకు కూడా కేంద్ర ప్రభుత్వం రెడీ అవుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. పలు నివేదికల ప్రకారం.. విలీనం కోసం ప్రభుత్వం ముందు రెండు ప్లాన్స్ ఉన్నట్లు సమాచారం. మొదటగా UCO బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పంజాబ్ సింధ్ బ్యాంక్ మరియు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలను విలీనం చేయాలని చూస్తోంది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ లేదా ఇండియన్ బ్యాంక్‌తో వీటిని విలీనం చేయడం అనేది రెండవ ప్లాన్‌గా సర్కారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. గత రెండుమూడేళ్లుగా పరిశీలిస్తే సదరు 4 బ్యాంకుల పనితీరు గణనీయంగా మెరుగుపడింది. పంజాబ్ %డ% సింద్ బ్యాంక్‌లో ప్రభుత్వానికి 98.25 శాతం వాటా ఉండగా.. సెంట్రల్ బ్యాంక్‌లో 93.08శాతం, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 86.46 శాతం, యూకో బ్యాంక్‌లో 95.39శాతం వాటా ఉన్నాయి. 2019లో 10 ప్రభుత్వ రంగ బ్యాంకులను 4 సంస్థలుగా విలీనం చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తద్వారా దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థను ప్రపంచ స్థాయికి చేర్చాలని భావిస్తోంది.

# వెంకటేష్-అనిల్ రావిపూడి
# మూవీకి ముహూర్తం ఫిక్స్..!



టాలీవుడ్ స్టార్ హీరో విక్టరి వెంకటేష్ తన నెక్ట్స్ మూవీని డైరెక్టర్ అనిల్ రావిపూడి డైరెక్షన్ లో తెరకెక్కిస్తున్నట్లు అనౌన్స్ చేశారు. ఇప్పటికే ఎఫ్-2, ఎఫ్-3 చిత్రాలతో సక్సెస్ ఫుల్ కాంబోగా మారిన ఈ ఇద్దరు, ఇప్పుడు ముచ్చటగా మూడోసారి సినిమా చేస్తున్నారు. జూలై 3న ఈ సినిమాను ప్రారంభించనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేయగా.. తాజాగా ముహూర్త సమయాన్ని కూడా ప్రకటించారు. జూలై 3న ఉదయం 11.16 గంటలకు ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభం అవుతుందని దర్శకుడు అనిల్ రావిపూడి తాజాగా తన ట్విట్టర్ అకౌంట్ లో పోస్ట్ చేశాడు. 'భార్య, ఎక్స్ కాప్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్' అనే కాన్సెప్ట్ తో ఈ సినిమాను తెరకెక్కించనున్నారు చిత్ర యూనిట్. ఇక ఈ సినిమాలో మరోసారి పవర్ఫుల్ పాత్రలో వెంకటేష్ కనిపించనున్నాడు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు, శిరీష్ లు ప్రొడ్యూస్ చేయనున్నారు. ఈ సినిమాలో మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందించనున్నారు.



## జాన్వీ ప్లేస్ కబ్జా చేస్తున్న
## దిశా పటాని..

అసలు కొందరి గురించి కంపేరిజన్ ఎందుకొస్తుందో తెలియదు. కానీ విపరీతంగా ట్రెండ్ అవుతూ ఉంటారు. అలా ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్ అవుతున్నారు జాన్వీ కపూర్ అండ్ దిశా పాట్ని. వీరిద్దరికీ ఓ విషయంతో లింకు పెట్టి సరదాగా మాట్లాడుకుంటున్నారు మూవీగోయర్స్ తెలుగు సినిమాలు దిశా పాట్నికి కలిసొస్తాయా? లేదా? మొన్న మొన్నటిదాకా ఇదో ఆసక్తికరమైన టాపిక్. కానీ కల్కి సక్సెస్‌తో దిశకి టాలీవుడ్‌లో హిట్ వచ్చేసింది. కానీ, కల్కిలో ఒకటీ అరా సన్నివేశాలు, ఓ పాటతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది ఈ బ్యూటీ. పూర్తి స్థాయి పెర్ఫార్మెన్స్ కి స్కోప్ లేకపోయినా, భైరవ జోడీగా నటించినందుకు హ్యాపీ అంటున్నారు దిశా పాట్ని. తెలుగు సినిమాలు దిశా పాట్నికి కలిసొస్తాయా? లేదా? మొన్న మొన్నటిదాకా ఇదో ఆసక్తికరమైన టాపిక్. కానీ కల్కి సక్సెస్‌తో దిశకి టాలీవుడ్‌లో హిట్ వచ్చేసింది. కానీ, కల్కిలో ఒకటీ అరా సన్నివేశాలు, ఓ పాటతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది ఈ బ్యూటీ. పూర్తి స్థాయి పెర్ఫార్మెన్స్ కి స్కోప్ లేకపోయినా, భైరవ జోడీగా నటించినందుకు హ్యాపీ అంటున్నారు దిశా పాట్ని. మరో మూడున్నర నెలల్లో మళ్లీ సౌత్ ఆడియన్స్ ని పలకరించడానికి సిద్ధమవుతున్నారు దిశా పాట్ని. సూర్య హీరోగా నటిస్తున్న కంగువ 38 భాషల్లో విడుదలవుతోంది. ఈ సినిమాలో హీరోయిన్ దిశాపాట్ని. మరో మూడున్నర నెలల్లో మళ్లీ సౌత్ ఆడియన్స్ ని పలకరించడానికి సిద్ధమవుతున్నారు దిశా పాట్ని. సూర్య హీరోగా నటిస్తున్న కంగువ 38 భాషల్లో విడుదలవుతోంది. ఈ సినిమాలో హీరోయిన్ దిశాపాట్ని. అక్టోబర్ 10న విడుదల కానుంది కంగువ. ఈ సినిమాలో అయినా కాస్త నిడివి ఎక్కువ ఉన్న పాత్రతో మెప్పించాలన్నది ఆమె కోరిక. మరి మేకర్స్ ఆమె మాటను కన్సిడర్ చేస్తారా? సినిమా లెంగ్త్ ఎక్కువవుతోందని ఎడిటింగ్ టేబుల్ మీద కట్ చేస్తారా? అనేది చూడాలి. అక్టోబర్ 10న విడుదల కానుంది కంగువ. ఈ సినిమాలో అయినా కాస్త నిడివి ఎక్కువ ఉన్న పాత్రతో మెప్పించాలన్నది ఆమె కోరిక. మరి మేకర్స్ ఆమె మాటను కన్సిడర్ చేస్తారా? సినిమా లెంగ్త్ ఎక్కువవుతోందని ఎడిటింగ్ టేబుల్ మీద కట్ చేస్తారా? అనేది చూడాలి. అన్నీ ముందుగా అనుకున్నట్టే జరిగి ఉంటే, అక్టోబర్ 10న జాన్వీ తెర మీద మెరుపులు మెరిపించేవారే. తన అభిమాన నటుడు తారక్ తో కలిసి సిల్వర్‌స్క్రీన్స్ మీద దుమ్మురేపేవారే. దేవర సినిమా పనులు త్వరగా పూర్తి అవుతుండటంతో సెప్టెంబర్‌కి ప్రీ పోన్ అయింది. సో జాన్వీ రావాల్సిన ఆ డేట్‌కి వచ్చేస్తున్నారు దిశా పాట్ని. ఈ విధంగా, అక్టోబర్ 10 లింకుతో జాన్వీ, దిశను గుర్తుచేసుకుంటున్నారు అభిమానులు. అన్నీ ముందుగా అనుకున్నట్టే జరిగి ఉంటే, అక్టోబర్ 10న జాన్వీ తెర మీద మెరుపులు మెరిపించేవారే. తన అభిమాన నటుడు తారక్ తో కలిసి సిల్వర్‌స్క్రీన్స్ మీద దుమ్మురేపేవారే. దేవర సినిమా పనులు త్వరగా పూర్తి అవుతుండటంతో సెప్టెంబర్‌కి ప్రీ పోన్ అయింది. సో జాన్వీ రావాల్సిన ఆ డేట్‌కి వచ్చేస్తున్నారు దిశా పాట్ని. ఈ విధంగా, అక్టోబర్ 10 లింకుతో జాన్వీ, దిశను గుర్తుచేసుకుంటున్నారు అభిమానులు.



## నివేతా పేతురేజ్‌కి లవ్ ఫెయిల్యూర్ అయిందా?

మెంటల్ మదిలో, బ్రోచేవారెవరురా, రెడ్, పాగల్, అలవైకుంఠపురంలో, దాస్ కా ధమ్కీ.. లాంటి పలు సూపర్ హిట్ సినిమాలతో తెలుగులో నివేదా పేతురేజ్ బాగానే పేరు తెచ్చుకుంది. వేరే భాషల్లో కూడా సినిమాలు చేస్తూ బిజీగానే ఉంది నివేతా. అయితే నివేతా నటిగానే కాకుండా ఎఫ్1 కార్ రేసర్, బ్యాడ్మింటన్ ప్లేయర్ కూడా. ఈ రెండిట్లోనూ పలు పతకాలు గెలిచింది. ఇటీవల పరువు అనే వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది నివేతా. ఈ సిరీస్ జీ5 ఓటీటీలో స్ట్రీమ్ అవుతుంది. ఈ సిరీస్ ప్రమోషన్స్ లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు తెలిపింది. గతంలోకి వెళ్తే మీకు మీరు ఎలాంటి సలహా ఇచ్చుకుంటారు అని ఇంటర్వ్యూలో నివేతాని అడిగితే.. డేటింగ్ చేసే ముందు ఆ అబ్బాయి గురించి బాగా తెలుసుకోవాలి. ముందు ఫ్రెండ్షిప్ చేసి ఆ తర్వాత డేటింగ్ చేయాలి అని తెలిపింది. దీంతో.. అంటే మీకు పాస్ట్ లో బ్యాడ్ అనుభవం ఉన్నట్టు ఉంది అని అడగగా నివేతా.. ఈ రోజుల్లో అందరూ లవ్, డేటింగ్ చేస్తున్నారు. సింగిల్ గా ఉండటానికి భయపడుతున్నారు, ఆలోచిస్తున్నారు అని తెలిపింది. దీంతో గతంలో నివేతా లవ్ ఫెయిల్యూర్ అని, ఎవరో ఆ అబ్బాయి అని కామెంట్స్ చేస్తున్నారు.

## రాజ్ తరుణ్ 'తిరగబడర సామి' ట్రైలర్ రిలీజ్




రాజ్‌తరుణ్ హీరోగా నటించిన సినిమా 'తిరగబడరా సామి'. ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీలో మాల్వీ మల్హోత్రా, మన్నారా చోప్రా లు కథనాయికలు. సురక్ష ఎంటర్టైన్మెంట్ మీడియా పతాకంపై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. మకరంద్ దేశ్‌పాండే, జాన్ విజయ్, రఘు బాబు కీలక పాత్రలు పోషించారు. జెబి సంగీతం అందించిన ఈ చిత్ర ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు. ట్రైలర్ ను బట్టి చూస్తుంటే.. వైవిధ్యభరిమైన కథలో ఆద్యంతం వినోదాత్మకంగా ఈ మూవీని తీర్చిదిద్దినట్లుగా అర్థమవుతోంది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూరైంది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

## వర్షాకాలంలో రేబిస్ పట్ల
## జాగ్రత్త.. లక్షణాలు ఇవే



**విశ్వంభర, ఫీచర్ :** అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో ర్యాట్ ఫీవర్ విజృంభిస్తోంది. వర్షాకాలంలో ఇంటి పరిసరాలు, నడకదారిలో నీరు నిలిచిపోయే అవకాశం ఉండడంతో మురుగునీరుతో చాలా సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో డయేరియా కేసులు పెరుగుతున్నాయి. ఇప్పుడు రేబిస్ ఫీవర్ కూడా కలవరపెడుతోంది. కాబట్టి ఈ ఫీవర్ లక్షణాలు ఎలా ఉంటాయో ముందు తెలుసుకుందాం.

### రేబిస్ ఫీవర్ లక్షణాలు

- లెప్టోస్పిరోసిస్ అనేది లెప్టోస్పిరా జాతికి చెందిన స్పిరోచెటా వల్ల కలిగే జూనోటిక్ వ్యాధి (జూనోసిస్). ఎలుకల మూత్రం ద్వారా క్రిములు విడుదలవుతాయి.
- రేబిస్‌కు కారణమయ్యే అడవి మరియు పెంపుడు జంతువులు అంటువ్యాధి. ఈ వ్యాధి ప్రధానంగా మాంసాహార జీవుల ద్వారా వ్యాపిస్తుంది. జంతువుల మూత్రం ద్వారా వ్యాధికారకాలు విడుదలవుతాయి. జంతువుల మూత్రంతో కలుషితమైన నీటి ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది.
- అవయవాలపై గాయం ఉన్నప్పుడు మురుగునీటితో సంబంధాన్ని నివారించండి. కలుషిత మట్టి, ఆట స్థలాలు, రోడ్లపై నిలిచిన నీటిలో ఆడుకునే పిల్లలు కూడా ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉంది.

### రాబిస్ యొక్క లక్షణాలు

- అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం,
- తీవ్రమైన తలనొప్పి
- కండరాల నొప్పులు.
- ఎరుపు కళ్ళు. కంటికి రెండు వైపులా ఉన్న కంటిలోని తెల్లటి భాగంలో ఎరుపు రంగు ఏర్పడుతుంది.
- మీకు ఈ లక్షణాలు కనిపిస్తే, మీరు వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.
- వర్షాకాలంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లు ఇంకా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే త్వరగా రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పిల్లలు. తల్లిదండ్రులు పిల్లలకు ఇమ్యునిటీ పవర్ పెంచే ఆహారాలు ఇవ్వాలి.

# దిండు లేకుండా పడుకుంటే
# ఎన్ని లాభాలో తెలుసా..?

**విశ్వంభర, ఫీచర్ :** నేటి బిజీ లైఫ్‌స్టైల్‌లో మనం తరచుగా మన ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం లేదు. మన జీవనశైలిలో మన శరీరానికి హాని కలిగించే కొన్ని అలవాట్లను అభివృద్ధి చేస్తాము. అన్నం తినేప్పుడు నీళ్లు ఎంత ముఖ్యమో పడుకునేప్పుడు దిండు కూడా అంతే ముఖ్యం.. నిజానికి ఈ రెండు చెడ్డ అలవాట్లే..ఏంటి నమ్మటం లేదా..? దిండు లేకుండా పడుకుంటే మీకు ఎన్ని బెనిఫిట్స్ ఉంటాయో తెలుస్తా..?

### దిండు లేకుండా పడుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు:

తలనొప్పి నుంచి ఉపశమనం: దిండు లేకుండా నిద్రపోవడం వల్ల తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుందని మీకు తెలుసా..? అవును, దిండు లేకుండా నిద్రించడం వల్ల వెన్నునొప్పి నుండి ఉపశమనం పొందడమే కాకుండా తలనొప్పి నుండి ఉపశమనం పొందవచ్చు.

**మెడనొప్పి నుంచి ఉపశమనం:** మెడనొప్పి ఈరోజుల్లో సర్వసాధారణమైన సమస్య. దాదాపు అన్ని వయసుల వారు దీనితో బాధపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం దిండుపై నిద్రపోవడమే. అలాగే తల లేకుండా పడుకోవడం వల్ల మెడ నొప్పి సమస్య రాదు.

**మంచి నిద్రలో సహాయపడుతుంది:** మీరు మంచి నిద్ర పొందాలనుకుంటే, దిండు లేకుండా నిద్రపోవడాన్ని ప్రాక్టీస్ చేయండి. ఇది మీ అలసట నుండి ఉపశమనం కలిగిస్తుంది మరియు మంచి రాత్రి నిద్ర పొందడానికి సహాయపడుతుంది. దీని వల్ల మీరు ఉదయం లేవగానే పూర్తిగా రిఫ్రెష్ గా ఉంటారు.

**ఒత్తిడిని దూరం చేస్తుంది:** ఈ బిజీ లైఫ్‌స్టైల్‌లో వ్యక్తులకు ఒత్తిడి పెద్ద సమస్యగా మారింది. కానీ దిండు లేకుండా నిద్రపోవడం మీ తల పైకి వెళ్లకుండా చేస్తుంది, ఇది మీ మెదడుకు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది మరియు ఒత్తిడిని తగ్గిస్తుంది.



**జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది:** ఆరోగ్యకరమైన శరీరానికి తగినంత నిద్ర చాలా ముఖ్యం. అలాంటి పరిస్థితుల్లో దిండు లేకుండా నిద్రపోవడం వల్ల మంచి నిద్ర వస్తుంది. దీని వల్ల మీ జ్ఞాపకశక్తి బాగా పెరుగుతుంది మరియు మెరుగుపడుతుంది. అలాగే, ఇది రోజంతా శక్తిని ఇస్తుంది.

**మొటిమలు రావు:** మొటిమలు యువతలో ప్రధాన సమస్య. అయితే దీనికి మీ దిండు కూడా ఒక పెద్ద కారణమని మీకు తెలుసా? ఎందుకంటే దిండుపై పేరుకున్న దుమ్ము, ధూళి మీ ముఖానికి అంటుకుంటుంది. మీ ముఖంపై మొటిమలు రావడానికి ఇదే ప్రధాన కారణం. అటువంటి పరిస్థితిలో, దిం డు లేకుండా నిద్రపోవడం వల్ల మొటిమలు రావు. అయితే దిండు లేకుండా పడుకోవాలంటే..మీ బెడ్ కంఫర్ట్‌గా ఉండాలి. అంటే మెత్తగా ఉండాలి. అలాగే బెడ్ షీట్ నీట్‌గా ఉండాలి. వీలైంతే కేవలం చస్ట్ పార్ట్ కవర్ అయ్యే వరకూ వేరే బెడ్‌షీట్ వేసుకోండి.. నిద్రపోయేప్పుడు మాత్రమే ఆ బెడ్‌షీట్‌ను వాడండి.. మీకు ఎలాంటి సమస్య ఉండదు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana.
Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com